తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2016 వెల రూ.5/-













పురుషోత్తముని పుష్పయాగమహోత్సవ దృశ్యమాలిక



సింగారాల కేమరుదు

చూడరమ్మ సతులాల సోబానఁ బాడరమ్మ
కూడున్నది పతిఁ జూడికుడుతనాచారి,

శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపుఁ గళల కేమరుదు
కోమలాంగి యీ చూడికుడుతనాచారి

కలశాబ్ధికూఁతురట గంభీరాల కేమరుదు
తలఁప లోకమాతయట దయ మరి యేమరుదు
జలజనివాసియట చల్లఁదన మేమరుదు
కొలఁదిమీర యీ చూడికుడుతనాచారి

అమరవందితయట అట్టె మహిమేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీ వేంకటేశుఁ దానె వచ్చి పెండ్లాడె
కొమెరవయసు చూడికుడుతనాచారి

(సంపుటం.26 - సంకీర్తన.246)



శ్రీ గోదాదేవిని స్తుతిస్తూ, శ్రీమహాలక్ష్మిని వర్ణించిన గీతమిది. గోదాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెకు సింగారాలు కొరతా? మన్మథుని తల్లి కనుక చక్కదనాలు కొదవా? చంద్రుని తోబుట్టవు కనుక సొంపైన కళలకు కొదవా? పాలసంద్రపు బిడ్డ కనుక గంభీరాలకు తక్కువా? లోకమాత కనుక దయకు తక్కువా? పద్మనివాసిని కనుక చల్లదనానికి లోటా? దేవవందిత కనుక మహామహిమకు అరుదా? అమృతానికి చుట్టం కనుక ఆనందాలకు కొరతా? ఇన్ని గొప్పలు గల్గీ, స్వయంగా తానే వచ్చి, శ్రీవేంకటేశ్వరుణ్ణి పెండ్లాడింది-ఆ నవయువతి- గోదాదేవి. అన్నమయ్య దృష్టిలో వేంకటేశుడే రంగనాథుడు.

మధురభక్తికి ప్రతీక అయిన శ్రీగోదాదేవిని లక్ష్మీదేవిఅంశంగా భావించి, ఆరాధించాడు-అన్నమయ్య.



త్వరలో.. నెలనెలా...

మనగుడి

హిందూ ధర్మప్రచారపరిషత్తు, తి.తి.దే., తిరుపతి మరియు
దేవాదాయ ధర్మాదాయశాఖ సంయుక్త నిర్వహణలో....

ఆలయ ప్రాశస్త్యాన్ని తెలిపేది "మనగుడి"
ఆలయ ధర్మాలను యువతకు తెలియజేసేది "మనగుడి"
ధర్మబద్ధంగా మనల నందరినీ ఏకం చేసేది "మనగుడి"
మానవీయ వికాసాన్ని కలిగించేది "మనగుడి"
అందుకే అందరం కలసి మెలసి, జరుపుకుంటున్న బృహత్తర కార్యక్రమం "మనగుడి"



2012 ఆగష్టులో శ్రావణపౌర్ణమినాడు ప్రప్రథమంగా ప్రారంభమైన "మనగుడి" కార్యక్రమం అప్పటినుండి ప్రతి సంవత్సరం శ్రావణపౌర్ణమి, కార్తికపౌర్ణమిన జరుగుతోంది. ఈ సంవత్సరం కూడా 11-11-2016 నుండి 14-11-2016 వరకు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ప్రతి సంవత్సరం "మనగుడి" సంబరాలను ధర్మదీక్షాబద్ధులమై జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమం వల్ల ఎందరో స్ఫూర్తిని పొంది దేవాలయం విలువను, మానవజీవనవికాసంలో గుడికి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించారు. ఎన్నో వేల ఆలయాలలో మళ్లీ పూజాదికాలు వైభవోపేతంగా నడుస్తున్నాయి. గ్రామాలలోని భక్తులందరూ కలిసి ఈ గుడి మనది-మనమే కాపాడుకుందాం అనే స్ఫూర్తిని పెంపొందించుకొంటున్నారు. "మనగుడి" కార్యక్రమం ద్వారా మనమందరం ఆశించిన ఫలితం ఇదే! కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుని కృప వల్ల ఇదివరకు జరిగిన అన్ని "మనగుడి" కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ "మనగుడి" కార్యక్రమాలను ప్రాంతాలవారీగా, ఆలయాలవారీగా ధారావాహికగా ప్రతినెలా సచిత్రాలతో 'సప్తగిరి' అందించనున్నది.



('మనగుడి' చిహ్న రూపకల్పన: బి.గురుకుమార్ రెడ్డి)

2017 జనవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

01 ఇంగ్లీషు నూతన సంవత్సరాది

06 నుండి 10 వరకు
తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

06 నుండి 12 వరకు
ఆండాళ్ నీరాట్టోత్సవం

08 వైకుంఠ ఏకాదశి

09 శ్రీస్వామి పుష్కరిణీ తీర్థముక్కోటి

13 భోగి పండుగ,
తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రణయ కలహ మహోత్సవం

14 మకరసంక్రాంతి

15 కనుమ పండుగ,
శ్రీగోదాపరిణయోత్సవం

18 కూరత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం

27 పురందరదాసు ఆరాధనోత్సవం

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47 డిసెంబరు, 2016 సంచిక : 07



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకుడు
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

పర్యవేక్షకుడు
శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్. (విశ్రాంత),
విశేషాధికారి, ప్రాజెక్టులు, తి.తి.దే.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు(ఎఫ్.ఏ.సి.),
సంపాదకుడు
డా॥ కె.రాధారమణ

ఉపసంపాదకుడు
డా॥ కంపల్లె రవిచంద్రన్

ముద్రాపకురాలు
శ్రీమతి ఎమ్.గౌతమి, ఎం.బి.ఏ.,
ఉపకార్యనిర్వహణాధికారి(ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి

ప్రథమశ్రేణి వర్ణచిత్రకారుడు
శ్రీ పి.శివప్రసాద్, తి.తి.దే., తిరుపతి.

చిత్రకారుడు
శ్రీ కె.తులసీప్రసాద్

డి.టి.పి., పత్రిక రూపకల్పన
శ్రీ బి.గురుకుమార్ రెడ్డి

ఫోటోగ్రఫి
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే., తిరుపతి.
శ్రీ పి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్,తి.తి.దే.,తిరుపతి.

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : గోదా అలంకారంలో గోవిందుడు
వెనుక చిత్రం : ఆనందనిలయుడు, ఆముక్తమాల్యద



గీతామృతం

సర్వమానవాళిజీవనతత్త్వానికి జీవధాతువు భగవద్గీత. వ్యక్తిశ్రేయస్సునుండి యావత్ప్రపంచశాంతివరకూ, మనిషి చేసే ప్రస్థానంలో అడుగడుగునా మార్గదర్శకంగా నిలిచి దారిచూపే ఆధ్యాత్మికకాంతిపుంజం భగవద్గీత.

శుద్ధసంపూర్ణజ్ఞానమూర్తీ, భగవంతుడూ అయిన శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి నిమిత్తమాత్రునిగా పెట్టుకొని బోధించిన నీతిశాస్త్రం భగవద్గీత. అందుకనే భగవద్గీత ఒకమతగ్రంథం కాదు – సమస్తమానవాళికి జీవనవేదం, జీవుని నిఘంటువు. పురుషుణ్ణి పురుషోత్తమ స్థితికి చేర్చేది–గీత.

గీత మానవజీవనసరళిని నియంత్రిస్తూ జీవనగమనానికి సత్యమైన, చేరువైన గమ్యాన్ని చూపుతుంది. గీతను లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే కొద్దీ నిత్యవ్యావహారికజీవితంలోని అనేకసమస్యలకు సమాధానాలు, పరిష్కారాలు గోచరిస్తుంటాయి. అందుకే దానిని 'గీతామృతం' అన్నారు.

గీతలో మొదటిది విషాదయోగం. చివరిది మోక్షసన్న్యాసయోగం. విషాదంతో ప్రారంభమైన మానవజీవితం– భగవంతుని ప్రబోధంవల్ల చివరకు మోక్షంపైకూడా కోరికలేనంతటి శుద్ధజ్ఞాన, శుద్ధసత్త్వ, నిష్కామస్థితికి చేరుస్తుంది– గీతాజ్ఞానం. ఇదే జీవన్ముక్తి (జీవించి ఉండగానే ఏ బంధాలూ లేక నిత్యమూ ఆనందంగా, హాయిగా ఉండే స్థితి). మానవులందర్నీ దైవత్వానికి చేర్చే ఆధ్యాత్మికమతాన్ని గీత స్థాపించింది. తనకు విధించిన ఆశ్రమధర్మాలతో భగవంతుణ్ణి అర్చిస్తే–నిర్మలమైన చిత్తం ఏర్పడుతుంది. అందువల్ల ఫలాపేక్షలేని కర్మయోగం సిద్ధిస్తుంది. దీనిద్వారా నిర్మల నిశ్చల జ్ఞానభక్తి ఏర్పడుతుంది. దీంతో మోక్షం లభిస్తుంది. ఇదే గీతాసారం! నిష్కామకర్మే ఆరాధన– ఇదే గీతాహృదయం!

ఈశ్వరార్పణబుద్ధితో చేసేకర్మలు తప్ప– మిగిలిన కర్మలన్నీ బంధానికి కారణాలవుతాయని తెలిసి ఆచరించడమే మోక్షానికి మార్గమనింది–గీత.

ప్రకృతిలో ఉంటూనే ప్రకృతికి అతీతంగా ఎలా జీవించవచ్చో నేర్పింది–గీత. యోగమంటే–'చేసే సత్కర్మను నేర్పుతో చేయడమే!' అనే కొత్త నిర్వచనం చెప్పింది–గీత. కర్మ చేయడం మనవంతు. కానీ, ఫలాన్ని మాత్రల కోరకుండా కర్మచేస్తే అది నిష్కామకర్మ అవుతుంది. అదే భగవంతునికి నచ్చే కర్మవిధానం. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది – గీత ఒక్కటే!

ఆధునికజీవితసంఘర్షణలో నలిగిపోతూ, విషాదయోగాన్ని అనుభవిస్తున్న నేటియువతకు భగవద్గీత చక్కటి కరదీపిక. ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని ఏకం చేసి, మానసికప్రశాంతతను కలిగించే ఆదర్శగ్రంథం– గీత. జీవితధర్మంగా కర్మను ఆచరించడం ఎలాగో నేర్పేగొప్పప్రణాళిక– గీత. సృష్టిలోని ఏ రచనకైనా పరమార్థం–పరమాత్మునితత్త్వాన్ని బోధించడమే! ప్రస్థానత్రయంలోని ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు ఇవన్నీ ఒకస్థాయివారికిమాత్రమే! అయితే, భగవద్గీత మాన్యులకే కాక, సామాన్య ప్రజలకూ కల్పవృక్షంలాంటిది.

ఈనాడు జీవితం పూర్తిగా యాంత్రికమైపోయింది. గడియారంతో సమానంగా ప్రజలు పరుగుపెడుతున్నారు. ఎవరిమొహం చూచినా–ప్రత్యేకంగా యువతరాన్ని, ఏదో ఆందోళన, వేగం, అలసట, ఆత్రుత, నిరాశ, నిస్పృహ – బ్రతుకుతెరువుకై జరిపే పోరాటంలో మనిషిపొందుతున్న చీకాకు లివి. ఒకనిమిషంకూడా విశ్రాంతిలేని ఈ జీవనసమరంలో అజ్ఞానంతో, అధైర్యంతో డీలాపడిపోయే మనిషికి నూతనోత్తేజం, ధైర్యం, ప్రోత్సాహం ఇవ్వగల దివ్యౌషధం– గీత.

అలాంటిగీతను – శ్రవణం చేయాలి. మననం చెయ్యాలి, ధ్యానం చెయ్యాలి. ఈ జీవనరథాన్ని రాగద్వేషాలతో కూడిన ద్వంద్వాలమార్గంలో నడపటమే బంధం. దైవమార్గంలో నడపడమే మోక్షం. ఇదే గీతారహస్యం! ఇది సర్వఉపనిషత్సారం. కాబట్టి గీత అందరూ క్రోలదగినమధురక్షీరం!

డిసెంబరు, 16
ధనుర్మాసం ప్రారంభం
సందర్భంగా...

వెయ్యేనుగుల ఊరేగింపు

– శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, 94909 57129

భగవంతుణ్ణే భర్తగా భావించిన/పొందిన ఒక ధన్యురాలి ఆరాధనకు ఆనవాలు శ్రీ ఆండాళ్. గోపికల మధురభక్తి ప్రభావం గోదాదేవిపై విశేషంగా ప్రసరించి, ఆమెను ఉదాత్త దివ్యస్త్రీగా రూపొందించింది. ఆ పరమభక్తురాలు, మధురభక్తికి నిలువుటద్దమైన గోదాదేవి స్వగతమే ఈ కథనం....

నా పేరు కోద్తై. పాండ్యదేశానికి పాపిటబొట్టులాంటి శ్రీవిల్లిపుత్తూరు మా ఊరు. మా నాన్నగారికి నేనొక రోజు తులసి వనంలో దొరికానట! పూల తోటలో పూలు కూర్చి, దేవుడికోసం మాలలల్లి అర్పించుకునే మా నాన్నకు నేనట్లా తోటలో కన బడ్డప్పుడు నన్నూ ఓ పువ్వనే అనుకున్నాడాయన. అందుకని నన్ను ఓ పూబాలా....! ఓ పూమాలా....!! అని పిలిచేవాడాయన.

మా ఊరు చాలా అందమైన ఊరు. నేను పెరిగి పెద్దాన్నవుతున్నకొద్దీ మా ఊరి అందమంతా నాలోనే వికసిస్తూ వచ్చింది. మా ఊరిచుట్టూ వరిచేలు. పండి కోతకెదిగిన వరి కంకులు ఫలభారంతో వంగివాలినప్పుడు పొలాల్లో తెల్లకలువల్ని ముద్దుపెట్టుకుంటున్నాయా అనిపించేది. వరిచేల పక్కన నిండుగా ఎదిగిన చెరకుతోటలు, బెల్లం వండేవాసన, తీపి తనపుగాలులమధ్య పెరిగాన్నేను. మా ఊళ్లో గృహిణులు ఇళ్లల్లో స్నానాలు చేసేటప్పుడు రాళ్లకు పసుపు అరగదీసుకుంటే, ఆ పసుపునీళ్లతో వన్నెతిరిగిన హంసలు ఎగురుతుంటే మా ఊరిదిక్కులకు బంగారుమలాము పూసినట్టుండేది. మా ఊరిమధ్య శ్రీకృష్ణదేవుడికోవెల. ఆ కోవెల గంటల గణగణలే నా రోజులకు మేలుకొలుపులుగా, పవళింపుపాటలుగా పెరిగాన్నేను. వసంత ఋతురాత్రుల్లో, తెల్లవారుజామువేళల్లో దక్షిణపుగాలులు మెత్తగా తాకుతుంటే దేవాలయధ్వజస్తంభగంటలు మృదువుగా సవ్వడిచేస్తుండేవి. అట్లా ఆగీ ఆగీ గాలులు వీస్తున్నప్పుడు ఆ చిరుగంటల సవ్వడికి తెల్లవారిందన్న భ్రమలో పక్షులు కిలకిల్లాడేవి. భగవదంకితమైన జీవితాల్లో, గ్రామాల్లో కనవచ్చే తుష్టీ, ప్రశాంతీ మా ఊరినిండా వ్యాపించిఉండేవి.

మా నాన్న తన జీవితమంతా శ్రీకృష్ణదేవుణ్ణే నింపుకున్నాడు. మా ఇల్లే ఒక దేవాలయంలా ఉండేది. ఇంట్లో ఎంత రాత్రయినా వచ్చీ పోయే వైష్ణవులతో అదంతా ఒక భక్తకూటంగా ఉండేది. అర్ధరాత్రులుకూడా నాగేంద్రశయానుడి పుణ్యకథలే వినబడేవి. దివ్యప్రబంధగానమే సాగుతుండేది. నా చిన్నప్పుడు నేను మగతనిద్రలో సగం మెలకువలో ఉన్నప్పుడు మా నాన్న అతిథులతో 'అయ్యా, అన్నం కొద్దిగా చల్లారిపోయినట్టుంది, కూరలు సరిపోయినట్టులేదు, మీ కోసం బొబ్బట్లు వడ్డించాలనుకున్నాను, కుదరలేదు, తమరు దయతో మరేమీ అనుకోకుండా,





మొహమాటపడకుండా నా ఆతిథ్యాన్ని స్వీకరించండి' అంటూ చెప్తుండేమాటలే చెవిన పడుతుండేవి. ఆ వంటలు ఎటు వంటివి! ఆ విందులు ఎటువం టివి! ఆ ఆతిథ్యమెటువంటి ది! ఆ భగవన్నామసంకీర్తనమెటువంటి ది! వేసవి రాగానే చందన చర్చలు మొదలయ్యేవి. వెచ్చవెచ్చని అన్నం, తియ్యనిచారు, మజ్జిగపులుసు, చెరకురసాలు, మిరియాలపొడి అద్దిన నవ కాయకూరలు, పరిమళాలు వెదచల్లే పూలమాలలు, తోమాలలు, తులసిదళాలు, నేను పుట్టడమే కాదు, పెరగడంకూడా పూల తోటలోనే పెరిగాను.

నా పసితనమంతా నాన్న నాకో నాన్నగా కాక అమ్మ గానే కనబడ్డాడు. ఆ అమ్మకూడా ఎటువంటి అమ్మగా నన్ను లాలించేదని! ఎక్కడో ఒక గొల్లపల్లెలో ఒక లేతరావిచిగురు లాంటి బిడ్డకు పాలిచ్చే అమ్మలాగా నన్ను ముద్దాడేవాడు. నాన్న శ్రీకృష్ణదేవుడిని ఒళ్లో పెట్టుకుని స్నానం చేయిస్తుంటే నాకు ఏ స్వప్నలోకంలోనో ఆవుల అంబారావాలమధ్య, పెరుగు చిలుకు తున్న కవ్వం చప్పుళ్లమధ్య, పేడ, ఎండుగడ్డి కలిసిన తీయని మట్టివాసనల మధ్య తిరుగుతున్నట్టుండేది. నాన్న నన్నూ కణ్ణన్‌నీ కూడా కలిపి రెండుచేతుల్తో పెంచాడు. స్నానం చేయిస్తే అది మా ఇద్దరికీ నీరాట్టమే. కొప్పుదువ్వితే, పూలచుట్టలు ముడిస్తే అది మా ఇద్దరికీ పూచ్చూటలే. నాన్న ఒళ్లంతామనసంతా అమ్మ దనంతో మెత్తనైపోయాడు. ఒకప్పుడు నాన్న మధురై వెళ్లాడుట. పాండ్యరాజు పరతత్త్వనిర్ణయం చేయాలని పండితసభ పెట్టాడు. పెద్దపెద్ద పండితులెందరో వచ్చారు. నాన్నకు చదువుకునే తీరి కెక్కడిది? ఆయన సమయమంతా పూలుకోసి మాలలు చుట్టడం లోనే గడిచి పోతేను! ఇంటికొచ్చిన వైష్ణవులందరికీ వండి వడ్డించడంతోనే సరిపోతేను! కణ్ణన్‌నూ, నన్నూ పెంచి పెద్ద చేయడంతోనే సరిపోతేను. నాన్న భయంభయంగానే కొలువులో అడుగుపెట్టాడట. విష్ణుమూర్తి ఆయనతో 'నీకేం భయం లేదు, నీకేంతోస్తే అది చెప్పెయ్యి, నేనున్నా'నన్నాడట. నాన్న ఏం మాట్లాడాడో ఏమోగాని ఆ కొలువుకూటమంతా ఆయనముందు సాగిలపడి పోయిందట. నాన్నను ఏనుగెక్కించి ఊరంతా ఊరేగిం చారట. ఆ సంబరం చూడటానికి ఆకాశంలో విష్ణుమూర్తి కూడా వచ్చేటప్పటికి నాన్నకు కంగారైపోయిందంట. ఆ జనం ఆ విష్ణుమూర్తిని చూస్తే ఆయనకు దిష్టి తగులుతుందని భయపడి, దేవుడికే దిష్టి తీసేసాడట. ఎందుకు చెప్తున్నానంటే ఇదంతా, మా ఇంట్లోనైనా, పాండ్యనగరవీథుల్లోనైనా నాన్నకు తెలిసిందల్లా అమ్మమనసు మాత్రమే, నన్నైనా, దేవుణ్ణైనాకూడా అమ్మలాగా బుజ్జగించడమే!

కణ్ణన్ నేనూ కలిసిపెరిగాంకదా, నాకు ఆ చిన్నప్పటి నేస్తమంటూ ఎవరన్నా ఉంటే అతడే. ఆ కన్నయ్యచేష్ట లెన్నిం టినో నాన్న పాటలు పాడేవాడు. అమ్మలాగా పాడేవాడు. నీళ్లు పోస్తూ పాడేవాడు. తలదువ్వుతూ పాడేవాడు. దిష్టి తీస్తూ పాడేవాడు. గోరుముద్దలు తినిపిస్తూ పాడేవాడు. నిద్రపుచ్చుతూ పాడేవాడు. ఆ పాటలు వింటూంటే, నాకు నా ప్రాపంచిక జీవితానికీ, మనోమయజీవితానికీ మధ్య హద్దులుండేవి కావు.

కణ్ణన్‌ను ఒళ్లో పెట్టుకుని నాన్న 'కన్నయ్యా, ఉట్టిలో వెన్నముంతను దొంగిలించి, ఆబగా వెన్నంతా తినేసినప్పుడు నీ ఒళ్లంతా పాలకంపు, వెన్నవాసన, వాటికితోడు గొల్లవాడల

మట్టిపట్టేసింది. ఇప్పుడింక నీకు ఒళ్లంతా దురద మొదలై నిద్ర పట్టదు. దా, నీకు స్నానం చేయిస్తాను. ఇవిగో, నులి వెచ్చని నీళ్లు, సుగంధతైలాలు, శీకాయపొడి, నీకు స్నానం చేయించాలని నేనిట్లా కాసుకుని ఉంటే నువ్వెంతకీ రావేంటి? రా నాన్నా! తొందరగా లాలపోసి, నీకు బువ్వ తినిపించి, నిద్రపుచ్చనివ్వు' అని పాడుతుండేవాడు. 'నీకు ఇష్టమని అప్పాలు చేశాను, బూరెలు చేశాను, పటికబెల్లం వేసి పాలుకాచాను, అవి కావాలంటే మరి తొందరగా స్నానం చేయి' అని వేడుకునేవాడు.

ఆ పాటలు, ఆ వేడికోళ్లమధ్య నా చుట్టూ వెన్నవాసన అలముకున్నట్టుండేది. సుగంధతైలాలపరిమళాలు, వండిన అప్పాల, పూర్ణంబూరెల తీపిగాలులు నా చుట్టూ మోసులెత్తేవి. నేనుకూడా గొల్లపల్లెల్లో ఆలమందల వెంటబడి పోతున్నట్టుగా, నా ఒళ్లంతాకూడా గోధూళిచేరి దురదపెడుతున్నట్టుగా ఉండేది.

నేను కొద్దిగా పెద్దదాన్నయ్యాక, మా నాన్న నాకు కొంత చదువు మొదలుపెట్టాడు. ఎప్పుడో కొన్నేళ్ల కిందట మాకు ఉత్తరంగా కంచికీ, వెంగడానికీ మధ్య కొందరు వైష్ణవాచార్యులు దేవుణ్ణి స్తుతించిన గీతాలు కొన్ని మా నాన్నకు కంఠతా వచ్చు. వాటినే వినిపించేవాడు. మాకు దక్షిణదేశంలో ఎప్పుడో పూర్వయుగాల్లో ప్రాచీనతమిళగ్రామాల్లో మారుతున్న ఋతువుల మధ్య వికసించిన సంగంగీతాలుకూడా మా నాన్న నాకు వినిపించాడు. బాలకృష్ణుడిగురించీ, గోకులంగురించీ తెలుసుకోవాలన్న నా కుతూహలాన్ని తృప్తిపరచడంకోసం హరివంశం చదివి వినిపించాడు. పల్లవరాజులకాలంనాటిదొక తాళపత్రగ్రంథం మా ఇంట్లో ఉండేది. భాసమహాకవి రాసిన బాలచరితం నాటకమది. ఆ నాటకాన్ని నా చిన్నప్పుడు నేనెన్నిసార్లు చదివానో! ఆ వ్రజభూమిలో కన్నయ్యవెంట ఆవులు మేపడానికి నేనుకూడా పోయాను, ఆ గొల్లపిల్లల జట్టులో ప్రతి ఒక్కడూ నాకెంత గుర్తో!

నాన్న పాడే తమిళ 'అంతాదు'ల్లో కనవచ్చే ఆ దేవుడు కంటికి కనవచ్చే దేవుడు కాడు. కానీ అతడు మనతో ఉన్నట్టే ఉంటుంది. మనం నిలబడ్డప్పుడు మనతో నిలబడ్డట్టుగా, మనం తిరుగాడినప్పుడు మనతో తిరుగాడినట్టుగా ఉంటుంది. మరొక పక్క, ఆ ప్రాచీన తమిళదేశపుపాటలు, ఆ ప్రాకృతిక పరిసరాలు,



వాటిలో కనవచ్చే తిరుమాలికొక రూపముంది, అతడికొక అందముంది. అతడు అచ్చంగా తమిళగ్రామాల బాలుడిగా, యువకుడిగా కనవస్తాడు. మొదటిఆళ్వారులు స్తుతించిన ఆ అగోచర సన్నిధినీ, సంగంకవులు పాటలు కట్టిన ఆ ఎర్రకన్నుల, శ్యామవర్ణదేహుడినీ నాలో నేను సమన్వయించుకుంటూండగానే నా బాల్యమంతా గడిచిపోయింది.

నాకు ఎనిమిదేళ్లు వచ్చేటప్పటికి మా ఊళ్లో బాలికలు నాతో జట్టుకట్టేరు. వాళ్లప్రపంచం చాలా తేటతెల్లంగా ఉండేది. వాళ్లఅమ్మలూ, నాన్నలూ వాళ్లను పెంచి, పెద్దచేసి ఎవరో ఒక అయ్యచేతిలో పెట్టాలనుకునేవారు. వాళ్ల ఇళ్లల్లో నాకున్నట్టు వాళ్లకొక కన్నయ్యలేడు. వాళ్లది ఖాళీప్రపంచం. వాళ్లమనఃప్రపంచంలో గోధూళిలేదు. అసలు, వాళ్లకలలకు రంగులట్టే లేవనిపించేది. మార్గశిరం వచ్చిందంటే చాలు, అప్పటికెన్నో ఏళ్లుగా వాళ్ల తల్లులు, వాళ్ల అమ్మమ్మలు చేసినట్టే వాళ్లూ నోములు పట్టేవారు. పెళ్లికోసం, వరుడికోసం, సంతానంకోసం, సౌభాగ్యంకోసం పూజలు చేసేవారు, ఉపవాసాలు చేసేవారు, వ్రతాలు చేసేవారు. ఏడాది తిరిగేలోగా వాళ్లల్లో కొందరికి పెళ్లిళ్లు అయ్యేవి, మరొక ఏడాదిలో వాళ్లు పండంటి బిడ్డల్ని చంకనేసుకుని కనబడేవారు. నోముల్లో కొత్త పిల్లలు చేరేవారు, ప్రతి ఏటా తెలిమంచుతెరలు తప్పించుకుంటూ మార్గశిరప్రత్యూషాలుదయిస్తున్నట్టే, ప్రతిమార్గశిరమాసంలోనూ బాలికలు కొత్తకలలతో కొత్తనోములు నోచేవారు.



నన్నూ ఆ నోమునోచమన్నప్పుడు నేనడిగాను, 'ఈ నోము దేనికోసం? ఈ నోములో మీరు దేవుణ్ణేమి కోరుకుంటా రని? వాళ్లకు ఆ నోము ఎప్పుడు పట్టాలో, ఆ నోము పట్టినంత కాలం ఏమి ఒట్లు పెట్టుకోవాలో తెలుసుగానీ, ఆ నోములో వాళ్లు దేన్నిగురించి అడుగుతున్నారో వాళ్లకు తెలియదని నాకు అర్థమైంది. ఆ నోమొక గమ్మత్తైన నోము. అందులో 'దేవుడా! మాకు పెళ్లికావాలి, భర్త కావాలి, పిల్లలు కావాలి' అని అడగడంలేదు.

అందులో 'దేవుడా! మాకు మంగళవాద్యాన్నివ్వు'అని అడుగుతారు. అది మంగళవాద్యంగురించిన నోమని తెలిసి నప్పుడు నాకేమో అపరిమితమైన వివశత్వం కలిగింది. అదెంత అందమైన నోము! నువ్వు సిరులు కోరవచ్చు, సంపదలు కోర వచ్చు, సంతానం కోరవచ్చు, సౌభాగ్యం కోరవచ్చు, అవి నీకు సిద్ధించవచ్చుకూడా, అందులో విశేషం లేదు. కాని నువ్వు మంగళవాద్యాన్ని కోరడం, నీ చుట్టూ మహామంగళతూర్యధ్వని మా(ర్మో)గడం, అబ్బా! ఆ మంగళమనే మాటలో ఎంత అర్థం ఇమిడిఉందో ఎట్లా చెప్పను?

నాకేమనిపించేదంటే, మనం నోము నోస్తే, పాటలు పాడితే దేశం సుభిక్షంకావాలి. ఏపుగా పెరిగిన వరిపైర్లమధ్య మీనాలు తుళ్లింతలాడాలి. కొట్టాల్లో కూచుని పాలుపితకబోతే ఆవుల పొదుగులు తమంతతామే చేపుతూ కడవలనిండా క్షీర ధారలుపొంగిపొర్లాలి. తరగనిసంపదలతో గ్రామాలు నిండి పోవాలి. మంగళమనేమాటలో ఇంత మంగళాశాసనం ఉంది, ఇంత శుభాకాంక్ష ఉంది. ఇంతకీ మంగళవాద్యాన్ని ఎవరన్నా ఎందుకు కోరుకోవాలి?

నన్నొకసారి నాన్న ఒక తిరణాలకు తీసుకువెళ్లాడు. అక్కడ దేవుడిపెళ్లి ఊరేగింపు జరుగుతోంది. రంగురంగుల జెండాలతో, వస్త్రాలతో, నవ్వుతున్న ముఖాలతో, పల్లకీలతో, సన్నాయిరాగాలతో సంబరం సాగుతోంది. ఆ సంబరం నా లోనూ ఏదో సంబరం రేకెత్తించింది. నాకేదో చెయ్యాలనిపిం చింది. అదేదో స్పష్టంగా తెలియదుగానీ, నేను వాళ్లందరిలో ఒకట్టైపోవాలనీ, ఆ సంతోషంలో నా సంతోషాన్నికూడా కలి పెయ్యాలనిపించింది. అప్పుడు నాన్న నాకొక బూరా ఇచ్చాడు. ఆ బూరా నోరారా ఊదాను. ఒక సన్నని రాగమేదో తీగలాగా బయటకి సాగి ఆ మహానందసమారోహంలో లీనమైపోయింది. నాకదొక బతికినక్షణమనిపించింది.

నా నేస్తాలు నన్నుకూడా నోము నోచడానికి రమ్మన్న ప్పుడు నేను మళ్లా అటువంటి బూరాకోసం, పిల్లంగోవి కోసం, మంగళనాదంకోసం నోముపట్టాను. ఆ నోములో ముందు ఇల్లిల్లూ తిరిగి నా నేస్తాల్ని పిలిచాను. అప్పుడు ఊరిమధ్య కోవె లకు వెళ్లి, శ్రీకృష్ణుణ్ణి పిలిచాను.

ఆయనుంటున్న కోవెల నాకళ్లకెప్పుడూ కోవెలలా కని పించలేదు. నాన్నకు లానే నాకుకూడా అది రేపల్లె . ఆ రేపల్లెముంగిట నిలబడి శ్రీకృష్ణదేవుడి పరివారాన్నంతా పిలి చాను. నేను పిలిచినప్పుడు నల్లనయ్య నీలమ్మ పాలిండ్లనే తల గడగా చేసుకుని నిద్రిస్తున్నాడు. అతణ్ణి మాతోపాటు ఆడుకోవడా నికి వదిలిపెట్టమని నీలమ్మని అడిగాను, ఆమెనుకూడా ఆడు కోవడానికి రమ్మని పిలిచాను. ఆ ఆటపాటల్లో మాకు కొత్త వస్త్రాలు కావాలని కోరుకున్నాను. కాళ్లకు అందెలు, చెవులకు దుద్దులు, బాహువులకు కడియాలు, మేనుకు తొడవులు ధరించి, అందరం కలిసి విందారగించాలని కోరుకున్నాను. మా ముందు పచ్చని అరిటాకుల్లో క్షీరాన్నం వడ్డించి చేయిమునిగేటట్టు నేయి వడ్డించాలనీ, ఆ మధురరసం మోచేతులకిందగా కారిపోతుండే

వైకుంఠపాళి
:: 13 – సమాధానాలు ::

	1 చం	2 ద్ర	ప్ర	3 భ	వా	4 హ	నం	
5 నం		ష్ట		వ		రి		6 నం
7 ద	త్త		8 సే	నా	ని		9 బృం	ద
కం		10 జ		సి		11 వా		నం
	12 అం	బ	కం		13 ఆ	సు	రి	
14 పూ		ల		15 డు		కి		16 జా
17 త	రి		18 పా	శు	రం		19 ఆ	న
కి		20 బా		మ		21 జా		కి
	22 ధ్వ	జా	వ	రో	హ	ణ	ము	

టట్టు దాన్ని చేతులతో జుర్రుకోవాలనీ కోరుకున్నాను. ఆ మేలు కొలుపులయ్యాక, ఆడుకున్నాక, పాడుకున్నాక, దేవుడితో ఈ మాటకూడా చెప్పాను– 'మా నోమొక సాకు, మంగళవాద్యం మరొకసాకు. మేం కోరుకున్నదల్లా నిన్ను మేలుకొలపడం, నిన్ను పిలవడం, నీతో ఆడుకోవడం, పాడుకోవడం, అడి ఆడి అలసిపోయాక, నిద్రపోయాక, మళ్లా మేలు కొలపడం, మళ్లా పిలుచుకోవడం, మళ్లా ఆడుకోవడం. ఇంతే'

తిరుప్పావై పాడేటప్పటికి నేనింకా పసిదాన్నే. నాకు తెలిసిందల్లా ఆడుకోవడం, పాడుకోవడమే. నా నేస్తాలు సంతా నాన్ని కోరుకుంటుంటే నేను సన్నిధి కోరుకున్నాను. వాళ్లు సౌభాగ్యాన్ని కోరుకుంటుంటే– నేను సాంగత్యాన్ని కోరుకున్నాను. అట్లా కొన్నాళ్లు గడిచాయి. నేను పెద్దదాన్నయ్యాను. నా దేహంలో కొత్తలావణ్యం, నా చెక్కుల్లో మిసిమి వచ్చి చేరాయి. నా ఎదద మొగ్గతొడిగింది. నేను నవయౌవనంలో ప్రవేశించాను.

అటువంటి రోజుల్లో నాన్న నన్నొకసారి శ్రీరంగం తీసుకువెళ్లాడు. కావేరి ఒడ్డున సస్యకేదారాలమధ్య నెలకొన్న సుందరహర్మ్యాల శ్రీరంగంలో శ్రీరంగనాథుణ్ణి చూడగానే నాలో చెప్పలేని అలజడి చెలరేగింది.

నా ఎదట ఉన్నమూర్తి నా చిన్ననాడు మా నాన్న స్నానం చేయించిన బాలకృష్ణుడు కాడు. నా తోటిబాలికలతో ధనుర్మాసవేళ మార్గశిరమాసపు నోముపట్టి తిరుప్పావైపాడు కుంటూ నాతో ఆడుకోడానికి రమ్మని పిలిచిన కణ్ణన్‌కూడా కాడు. ఇతడి ఎదట నేనో శిశువుగా, బాలికగా నిలబడలేక పోయాను. నేనతడి ఎదట నిలబడినప్పుడు నాకొక దేహముం దనీ, యౌవనప్రాదుర్భావవేళ అరవిచ్చిన రెండుకలువల్లాగా నా వక్షం వికసించిందనికూడా గుర్తొచ్చింది. ఆ క్షణంలో నేనను భవించిన వేదనను మీతో ఎట్లా చెప్పేది? అది మీతో పంచు కుందామంటే చెవిటివాడితో మూగవాడు చర్చకు కూచున్నట్టుం టుంది.

నాకొక్కసారిగా తెలియవచ్చింది, నేను స్త్రీనయ్యానని, నాప్రేమను సమర్పించుకోడానికి నాకొక హృదయమవసరమవు తోందని. పూర్వకాలపు సంగంకవులు స్త్రీపురుష ప్రణయానికొక ప్రాకృతికభూమికను సిద్ధం చేశారు. పర్వతసానువుల్లో, పంట పొలాల్లో, సాగరతీరంలో, అడవి అంచుల్లో, ఊషరక్షేత్రాల్లో స్త్రీ పురుషులమధ్య వికసించేప్రణయాన్నీ, సంభవించే సమాగ మాలనూ, ఎడబాట్లనూ వారు పాటలుకట్టిపాడారు.

ఆ ప్రణయాన్ని వాళ్లు మూడు విధాలుగా ఊహించారు. అందులో మొదటిది, సాధారణకాముకత్వాన్ని వాళ్లు పూర్తిగా నిరసించారు. దానికన్నా ఉన్నతమైందీ, సమహృదయులూ, సమానధర్ములూ ఐన స్త్రీ పురుషులమధ్య ప్రకృతిసహజంగా వికసించే ప్రణయాన్ని వాళ్లు లోకసహజప్రణయమన్నారు. అంతకన్నా ఉన్నతమైన మరొక ప్రణయానుభవాన్నికూడా వాళ్లు గుర్తుపట్టకపోలేదు. కానీ వాళ్లు దాన్ని లోకాతీతప్రణయమన్నారు.

లోకాతీతప్రణయమంటే ఏమిటో తెలుసా మీకు? స్త్రీ పురుషులిద్దరిలో ఒకరు మహామానవులైతే, మరొకరు మామాలు మనిషిమాత్రమే అయితే, వాళ్ల మధ్య చిగురించే ప్రణయమది. అది మనహృదయాల్ని ఎంతగా నలిపివేస్తుందో అనుభవిస్తేగాని తెలిసేదికాదు. మనం ఎదుటివాళ్లప్రేమకు చాలలేకపోతు న్నామనో, లేదా ఎదుటివాళ్లు మన ప్రేమకు చాలినట్టుగా ప్రతిస్పందించడం లేదనో తెలియరావడంలో ఎంత విషాదముం దని! వాళ్లకి తెలుసు, నీ ఎదుట ఒక మూర్తి ఉండి, ఆ దేహం నీ పరిష్వంగానికి అందకపోవడంలో ఎంతవేదన ఉందో! నీకొక దేహం ఉండి, ఆ దేహాన్ని హత్తుకోవడానికి రెండు చేతులు, స్పృశించగల చేతులు, స్పందించగలచేతులు, చెమట పట్టే చేతులంటూ లేకపోతే, అవి నిన్ను తాకకపోతే ఎంత విషాదం!

నాన్న చిన్నికృష్ణుడికి స్నానం చేయించినప్పుడు ఇలాంటి వేదన ఎందుకు పడలేదో. ఆయన అమ్మమనసుకు ఆ బాధ తెలియరాలేదు. కాని కన్నెమనసుకు మాత్రమే తెలిసే ఆ బాధను దివ్యంగా పాడినవారు నమ్మాళ్వా రులు. నా చిన్నప్పుడు నాన్నపాటలు నన్నెట్లా మురిపించాయో, నేను పెద్దదాన్నయ్యాక నమ్మా ళ్వారుల పాటలు నన్నట్లా కదిలించాయి. గోపీకృష్ణుడి ఎదట నమ్మాళ్వారులు నిజంగా స్త్రీగా మారి పోయారు. ఎన్ని అవస్థలు అనుభవించా





రాయన. ఎన్ని భూమికలు ధరించారు? తల్లిగా, చెలికత్తెగా, ప్రేయసిగా కృష్ణుడికోసం ఆయన పడ్డ వేదన, విరహం నాలోని స్త్రీత్వానికొక అభివ్యక్తినిచ్చాయి.

నమ్మాళ్వారులకి తెలుసు, తనకీ, కృష్ణుడికీ మధ్య ప్రేమ లోకాతీతప్రేమ అని, నెరవేరని ప్రణయమని. కాని ఆ ప్రణయభూమికలోకి ప్రయాణించడమే ముఖ్యమనుకున్నారాయన. నమ్మాళ్వారులు కోరుకున్నదొక అగోచరమూర్తిని కాదు. ఆ మూర్తి మనం చూస్తున్న దేహాలన్నిటికన్నా యథార్థమైన మూర్తి. ఆయన విరహాతిశయంతో 'అవి ఈ బాలికను జంటగా ముంచెత్తు తున్న మృత్యువులా, లేక కన్నయ్య సుందరనేత్రాలా?' అని అడుగుతున్నప్పుడు ఆయన చూస్తున్నకళ్లు మనచుట్టూ కనిపిస్తున్న మానవనేత్రాలన్నిటికన్నా ఆకర్షణీయంగా ఉన్నాయనడం అతిశయోక్తి కాదు.

నమ్మాళ్వారులు తమ ప్రణయానుభవాన్ని ఇంద్రియాలదోసిళ్లతో పట్టి తాగాలనే కోరుకున్నారు తప్ప–ఇంద్రియాతీతంగా పొందాలనుకోలేదు. 'ఆ వీరవరాహమూర్తి నన్నమాంతం మింగేసాడు' అని నమ్మాళ్వారులన్నారని వినగానే నాకు చెప్పలేని తుళ్లింత కలిగింది. ఒక స్త్రీకోసం నెత్తిన బురదచల్లుకున్న ఆ వరాహమూర్తి పెదాలు నన్నుకూడా నమిలిమింగేస్తే బాగుణ్ణనిపించింది. ఎట్లా పాడేరాయన! ఒక కన్యహృదయంలోకి ప్రయాణించి పాడారాయన. కాని, నేనో, నేను స్వయంగా కన్యను, నమ్మాళ్వారులకు జీవితకాలం సాధనచేస్తేగాని చేకూరని మనఃస్థితి నాకు అయాచితంగా లభ్యమైందని కనుగొన్నాను. నాకొక హృదయముందని, ఆ హృదయాన్ని నాకు తెలియకుండానే నవనీతచోరుడు కొల్లగొట్టాడనీ తెలుసుకున్నాక, నాకు మరే కోరికా లేకపోయింది.

ఇక మిగిలిందొక్కటే కోరిక, ఎటుచూచినా ఒక్కటే భావన, నా సమస్తం ఆయనకెట్లా అర్పించుకోవడమా అన్నదే. తీవ్రప్రణయభావనతో నేను దగ్ధమైపోతున్నా ఆయన నన్నెందుకు చేరదీసుకోడన్నదొక్కటే ప్రశ్న. 'నన్నెవరు ఇష్టపడతారో వాళ్లనే నేనిష్టపడతానని' ఆయన తనతో అన్నాడని నాన్న నాతో ఎన్నో సార్లన్నాడు. అది నిజమేనా? ఒక స్త్రీకోసం సముద్రానికి వంతెన కట్టిన మానవుడు, తనను ప్రేమించానని ఒక స్త్రీ కబురు చేస్తే– ఆమెను పెళ్లిపీటలమీంచి ఎత్తుకుపోయిన మొనగాడు నా విషయానికొచ్చేటప్పటికి మౌనం వహిస్తున్నాడేమని దుఃఖం కలిగేది. దుఃఖం చిన్నమాట. అందులో కోపం ఉంది, లజ్జ ఉంది, ఈర్ష్య ఉంది. చివరకు శ్రీరంగనాథుడిచేతుల్లో ఉన్న శంఖాన్ని చూచినాకూడా నాకు అసూయ కలిగేది. అప్పుడే పూసిన కెందామరల మకరందాన్ని ఆస్వాదించే హంసలాగా ఆయన పెదాలను ఆనుకునే భాగ్యం పొందినందుకు ఆ శంఖం నాకెంతో చీకాకు పుట్టించింది.

ఆ దుఃఖంలో తత్తరపాటు ఉంది. అగమ్యమనఃస్థితి ఉంది. అన్నిటికన్నా మించి నా దేహం, పువ్వులాగా వికసిస్తున్న నా దేహం నాలో కలిగిస్తున్న మహామోహనమనోవ్యాకులత ఉంది. మట్టిపోతపోసిన మైనంబొమ్మ కరిగిపోయినట్టుగా నా దేహంలో నా ఆత్మనెవరో కరిగించేసినట్టుంది. ఆ ఖాళీజాగాను ఆయనతో నింపేస్తే తప్ప నేన్నిలవలేననిపించింది.

లోకాతీతప్రణయం లోకసహజంగానే సఫలం చెందాలని లేదు. నేనొకరాత్రి కలగన్నాను. అప్పుడు శ్రీరంగనాథుడు వెయ్యేనుగుల ఊరేగింపుతో నా కోసం వచ్చినట్టు కలగన్నాను. రేపే మనపెళ్లి ముహూర్తమంటూ పోకచెట్లపందిరికింద కొచ్చి నిలబడ్డాడని కలగన్నాను. వేదమంత్రాలమధ్య దేవీదేవతలు ఆశీర్వదిస్తూండగా నా చేతికి మంగళకంకణం కట్టాడని కలగన్నాను. ఎర్రతామరలవంటి తనచేతుల్తో నా పాదాన్ని ఎత్తిపట్టుకుని సన్నికల్లు తొక్కించాడని కలగన్నాను. దేహమంతా కుంకుమపరాగంతో, శీతలసుభగచందనచర్చలతో మేమిద్దరం కలిసి, వసంతస్నానాలు చేసినట్టుగా కలగన్నాను.

నేనిప్పుడు భగవద్దివ్యదేశరాణిని, నన్నంతా ప్రేమతో ఆండాళ్ అని పిలుస్తున్నారు.

ఈ సంచికలో సన్నిధిగొల్ల, పద్మావతీ శ్రీనివాసుల అవతరణ వివరించబడుతుంది.

అనంతాళ్వార్ తవ్విన చెరువు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పక్కన ఉంది. ఇప్పటికీ స్వామివారిసేవకు ఆ చెరువులో నీరు వాడు తుంటారు. అనంతాళ్వార్ ఎంతటి మహానుభావుడయ్యా అంటే స్వామి చెవి ఒగ్గి వింటారు. స్వామిని రావాలి అంటే ఆయన రారు. తిరుమల నంబీ అన్నా, అనంతాళ్వార్ అన్నా, వేంగమాంబా అంటే ఆయన పరిగెత్తుకుని వస్తారు. అటువంటి మహానుభావులపేర్లు వినపడుతున్నాయి - అని భార్యతోసహా వచ్చే స్తారు. శక్తిమంతమైన ఆరాధన చేసినవారు ప్రాతఃస్మరణీయులు.

సన్నిధిగొల్ల

తరువాత చెప్పుకోదగినవారు సన్నిధిగొల్ల. తాను చేసింది లేకపోయినా వంశానుగతంగా ఆ వరం వచ్చేసింది. వేంకటేశ్వర స్వామికి యజ్ఞం చేశారు. కలియుగం వచ్చేస్తూంది- మమ్ములను మేము ఎలా రక్షించుకోవాలి? ఋషులందరూ సత్రయాగం చేసి, యజ్ఞఫలితం ఎవరికి ఇవ్వాలన్నారు.

యజ్ఞ భృత్ యజ్ఞకృత్ యజ్ఞీ యజ్ఞభుక్ యజ్ఞసాధనః ।
యజ్ఞాన్తకృత్ యజ్ఞగుహ్య మన్న మన్నాద ఏవ చ ॥

యజ్ఞఫలితాన్ని పుచ్చుకునే సమర్థుడు విష్ణువే. ఎవరు సమర్థులో వారికి ఇవ్వాలి. నారదముని-భూలోకంలో వేంకటేశ్వ రావతారం రావాలి. అందుకని ఒక చిన్నవిషయం చూపించాడు.

వేంకటేశ్వరస్వామి భూలోకంలో అవతారస్వీకారం చేసి నప్పుడు యశోదాదేవి వకుళమాతగా నీ కల్యాణం చూడటం కొరకు పుట్టింది. ఆమెను నీతో తీసుకుని వెళ్ళమని వకుళమాతను వినియోగించారు. ఆమె దగ్గర ఉండి ప్రతిరోజూ వేంకటేశ్వర స్వామియోగక్షేమాలు చూస్తుండేవారు. కల్యాణం చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది.

ఆకాశరాజు యజ్ఞం చెయ్యడానికి భూమిని దున్నుతున్నారు. సీతమ్మతల్లి జన్మించినట్లుగానే నాగేటిచాలులో మందసం దొరి కింది. ఆ మందసం మూత తెరిచారు. పద్మాలలో పడుకుని అమ్మ వారు కనపడింది. పద్మాలలో దొరికింది కనక పద్మావతి అని పిలి చారు. అయోనిజగా జన్మించిన అమ్మవారిని ఎవరికిచ్చి వివాహం చెయ్యాలా? అని ఆకాశరాజు మథనపడుతున్నాడు.

శ్రీనివాసుడు వాయుదేవుణ్ణి గుర్రంగా చేసుకుని, వేటకోస మని విహారంగా వచ్చాడు. వేటాడుతూ ఉండగా, అదే సమయానికి పద్మావతి చెలికత్తెలతో వనవిహారానికి వచ్చింది. ఒక ఏనుగు ఆమెను, చెలికత్తెలను తరిమింది. ఆ తరువాత ఎటో మాయమై



06

తిరుమల విశిష్టత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

పోయింది. వేంకటేశ్వరస్వామిదర్శనం పద్మావతికి, పద్మావతీదేవి దర్శనం స్వామికి జరిగింది. ఆమె తన్మయావస్థలో ఉండగా చెలి కత్తెలు వచ్చి, "ఎంతటి తెంపరివాడివి? ఉద్యానవనంలో రాజ కుమార్తెదర్శనానికి వచ్చి, తేరిపార చూస్తున్నావా?" అని చెప్పి రాళ్ళు పెట్టి కొట్టారు. అవి గుర్రానికీ, ఆయనకూ ఇద్దరికీ తగి లాయి. భక్తులకోసం రాళ్ల దెబ్బలు తిని, కింద పడిపోయినప్పుడు ఎలా ఉన్నాడో పురాణంలో చెప్పారు.

యథా యుగాంతే వటపత్రశాయీ

యుగాంతం అయ్యాక వటపత్రశాయి ఎలా పడుకున్నాడో అలా పడుకున్నాడు. అప్పుడు పద్మావతి చెలికత్తెలు "నువ్వెందుకు వచ్చావు?" అని అడిగారు.

కన్యాపేక్షా ముఖ్యకార్యమ్

అని వివాహం చేసుకోవడానికి ఆడపిల్లకొరకు వచ్చా నన్నారు. చెలికత్తెలు "ఎంత సాహసపూరితంగా మాటలు మాట్లాడు తున్నావో తెలుసా? ఆకాశరాజుకు తెలిస్తే నిన్ను ఉరి తీస్తారు?" అన్నారు. "వచ్చిన పని అయిపోతే మరణం వచ్చినా ఫరవాలేద న్నారు"-ఆయన.

కార్యాంతే మరణం శ్రేయః

అలాగే సంహరించబడతాను. నాకేమీ బెంగ లేదన్నారు. కావలసిన అవతారప్రయోజనం-స్వామిమనసు అమ్మవారి వద్దకూ, అమ్మవారిమనసు స్వామివద్దకూ మారాయి. తేనె, అవీ పట్టుకుని ఇంటికి వెళ్ళినా చాలా చిన్నబుచ్చుకుని కూర్చున్నారు. ఆదివరాహ స్వామి వకుళమాతకు "సాక్షాత్తుగా నీవు పెంచి పెద్ద చేసిన కృష్ణమూర్తి ఈ రోజు ఈ రూపంలో వేంకటేశ్వరుడుగా వచ్చారు" అని చెప్పారు. అమ్మ చూచి ఎందుకలా ఉన్నావని అడిగింది.

ఉత్తిష్ఠోత్తిష్ఠ దేవేశ కిం శేషే పురుషోత్తమ!

ఆయన లేచి ఏమి జరిగిందో చెప్పమని అడిగిన తల్లికి "అమ్మా! ఏం చెప్పమంటావు? పద్మావతీదేవివద్ద మనసు పడవేసు కున్నాను. ఆమెతో వివాహం జరగాలని కోరిక" అని చెప్పారు. అయ్యో! వారు రాజులు మనకు పిల్లను ఇస్తారా! అనింది. అమ్మా! నా అవతారప్రయోజనాలలో అది ఒక కారణం. ఆమె పుట్టిందే నా కోసం. నువ్వు వెళ్ళి పిల్లను అడగమని అన్నారు. పద్మావతికూడా మనసుపడి అన్నం నీళ్ళు మానివేసింది. హంసతూలికాతల్పంమీద పడుకుని చెలికత్తెలు వింజామరలు వీస్తున్నా, అగ్నిసెగ తగిలినంత బాధ పడిపోతున్నది. చెలికత్తెలు "ఏమిటమ్మా ఇలా అయిపోయా" వంటే ఆమె చెప్పింది.

విరికై తుమ్మెద లీల నా హృదయ ముప్పిళ్ళూరు నెల్లప్పుడున్
హరికై సత్కరుణాసుధాలహరికై ఆనందమందాకినీ
ఝరికై నిత్యనివాసశేషగిరికై సంధృప్త దైత్యేభ కే
సరికై నిర్మల మందహాస సుషమాసౌభాగ్య సంచారికై

అని పద్మావతీదేవి వేంకటేశ్వరస్వామిలో మనసు లగ్నమైం దని చెప్పింది. ఏ యుగంలో అయినా, ఎన్ని అవతారాలెత్తినా ఆయనకొరకే అని రుక్మిణీదేవి చెప్పినట్లు-


నాకు వేంకటేశ్వరుడే భర్త అని భీష్మించుకుని కూర్చున్నది. వకుళమాతతో వేంకటేశ్వరస్వామి వేంకటాచలం కిందకి దిగితే, కూతురికోరిక తీరడంకోసమని అగస్త్యమహర్షివారి ఆశ్రమంలో ఉన్న పరమశివలింగానికి సహస్రఘటాభిషేకం చేయిస్తున్నారు. ఆకాశరాజపరివారమంతా అక్కడుంది" వెళ్ళి వారితో పిల్లను ఇచ్చి పెళ్ళి చేయమని అడగమని అంటే ఆమె అక్కడకు వచ్చి అడిగితే తప్పకుండా అంతఃపురానికి వెళ్ళి మాట్లాడుకుందామని చెలికత్తెలు చెప్పి, తీసుకుని వెడుతున్నారు. ఇంతలో వేంకటేశ్వరస్వామి ఏ అవతారంలో ఎవరూ వేయని సోది చెప్పే ఎరుకలదానిలా చిత్రమైన వేషం వేశారు. ఒకప్పుడు ఆయన్ను ఆ ఉద్యానవనంలో చూచి ఆశ్చర్యపోయి

ఎటుల వచ్చితి విచ్చటి కెవర వీవు? పరమ రమణీయ ఫలపుష్ప ఫలితమైన ఈ విశాల వనమునందు తావు లేదు జంతువులపట్టులిచట నిషాదులకును

అని వేటగాడు అనుకుని వెళ్లగొట్టేశారు.

సోది చెప్పే వ్యక్తిలా ఇప్పుడు వచ్చి ధరణీదేవిఅంతఃపురం దగ్గరలో సోది చెపుతానని అంటుంటే, వీధులలో నిలబడి చక్కగా సోది చెపుతున్నారు. జరిగే విషయాలు, జరగబోయే విషయాలు ఎంత బాగా చెపుతున్నదో సోది అనే వార్త ధరణీదేవికి వెళ్ళింది. ఎంతో అందమైనవేషం కట్టారు.

"తెల్లు నల్పగు వెంట్రుకల్ తెల్లు తలపైన అలరారు తాటాకు బుట్ట. ప్రాయంబు సడలిన పచ్చచెక్కిళ్ళపై సొంపు నింపెడి సోయగంపు సొట్ట. తమ్మిమొగ్గల నెల్ల దాచెడి మెత్తటి పైట చక్కగా నింపు పూసల సరుల పుట్ట, గజకుంభముల మించు నిజ బుర్ర సొర్రపై తియ్యటి పాట పుట్ట, కలికి నెలవంక కుంకుమ చిలువ పుట్ట, బ్రహ్మ వొడిలోన బాలుడై రవము పెట్ట, మంచి ఎరుకత వచ్చె సిరి మించునట్లు"



తెల్లగా నల్లగా అయిన తలమీద చక్కని తాటాకు బుట్ట పెట్టుకున్నది. చేతిలో వాయిస్తూ పాడటానికి పెద్ద సొరకాయతో చేసిన బుర్రపట్టుకుని, పెద్దకుంకుమబొట్టు పెట్టుకుని బ్రహ్మదేవుని పిల్లవాడిని చేసుకుని ఒళ్ళో పడుకోబెట్టుకుని, సోది చెపుతానని తిరుగుతుంటే, లోపలకు తీసుకుని వెళ్ళారు. 'ఏమ్మా సోది చెప్పు'! అని అడిగారు. చెపుతాను కానీ అమ్మా! పిల్లవాడు మారాం చేస్తు న్నాడు. కొంచెం పాలు బువ్వ పెట్టమని అడిగింది. భగవానుడు ఏదైనా ఫలితమిచ్చే ముందు ఒక చిన్న పుణ్యకార్యం చేయిస్తాడు.

(ఇంకా ఉంది)



శ్రీకృష్ణుడు భారతానికి ఆత్మ. నిరాకారుడైనా సాకారుడుగా తాను రావడం "దుష్టశిక్షణం, శిష్ట రక్షణం-తద్వారా ధర్మసంస్థాపనం- అనే మూడుపనుల కోసం. కనుక ముఖ్యంగా ధర్మోద్ధరణమే కృష్ణావతార ప్రయోజనం. ఈ ప్రయోజనాన్ని సమగ్రంగా ఫలింప జేయడానికి చేసిన కృషి భారతయుద్ధావిష్కరణం! ఇక్కడే ధర్మాధర్మాలకు గొప్పసంఘర్షణం జరిగింది. 'పెరుగుట విరుగుటకొరకే!' అన్నట్లు అధర్మపక్షానికి బలమెక్కించి, తాను ధర్మపక్షంలో ఉండి- అధర్మాన్ని అణగద్రొక్కాడు.

ఈ కార్యక్రమనిర్వహణకు అర్జునుణ్ణి సహకారిగా గైకొన్నాడు. వీళ్లిద్దరూ నరనారాయణులనే ప్రాచీనఋషులు. మహా తపస్సంపన్నులు. వీరిధ్యేయం కేవలం తపస్సు కాదు. తమ తపశ్శక్తినంతాధారవోసి, ధర్మరక్షణం చేయడమే! ధర్మం - ప్రవృత్తి, నివృత్తి అని రెండువిధాలు. కేవలం ఇహానికి సంబంధించింది - ప్రవృత్తి. జన్మరాహిత్యానికి సంబంధించింది - నివృత్తి. కనుక గత ద్వాపరాంతంలో ఈ నరనారాయణుల్లో నరుడు - అర్జునుడుగా, నారాయణుడు - శ్రీకృష్ణుడుగా అవతరించారు.

భారతీయుల సాహితీదృష్టి పురుషార్థ ప్రధానమైంది. దీనికి దూరమైన ఏ పనికీ ఈ భూమిలో స్థానం లేదు. కథలు మొదలుకొని, వేదవేదాంతాలదాకా ఉండే సాహిత్యమంతా పురుషార్థాల్ని ప్రబోధిస్తూ, పాఠకులకు సదుపదేశాన్ని ఉపదేశించడమే లక్ష్యంగా నడిచింది. కనుకనే "కమనీయధర్మార్థ కామమోక్షములకు అత్యంత సాధనంబైనదాని; వేడ్కతోదవిలి వినుచున్నవారల కభిమత శుభకారంబైన దాని" నని భారతాన్ని గూర్చి చెప్తూ పురుషార్థ ప్రతిపాదనమే సాహిత్య ముఖ్యోద్దేశంగా పేర్కొన్నారు. సర్వయజ్ఞాలలో జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమనింది - గీత. కనుక భారత పఠనం ఒక మహాజ్ఞానయజ్ఞం.

శ్రీకృష్ణుడు దివ్యశక్తిసంపన్నుడైనా సాధ్యమైనంతవరకూ మానవత్వంతోనే ధర్మరక్షణం చేయాలని ఆకాంక్షించాడు. అందుకై సంధి విఫలమవుతుందని తెలిసినా-స్వయంగా "నేనే రాయబారినై వెళ్తా"నని-కార్యభారాన్ని తనపై వేసుకొన్నాడు. ధర్మపద్ధతిలో కౌరవులకు చెప్పవలసింది చెప్పాడు. ఋషులతోనూ చెప్పించాడు. ఐనా విధినిర్ణయం మరోవిధంగా ఉన్నందున-కౌరవులకు కృష్ణునిసంధి వచనాలు నచ్చలేదు. ఆ దుష్టచతుష్టయం కయ్యానికే కాలు దువ్వింది. గత్యంతరం లేక శ్రీకృష్ణుడూ-యుద్ధమే నిర్ణయించాడు.

అది క్రీ.పూ.3140లో శోభకృత్ సంవత్సరకార్తిక బహుళ పక్షం. ఈ పక్షంలోని అమావాస్యకు ఏడెనిమిది రోజులు ముందుగా శ్రీకృష్ణునిరాయబారం జరిగింది. ప్రపంచవాఙ్మయచరిత్రలోనే మానవశ్రేయస్సు కోరి, స్వయంగా భగవంతుడే ఒక రాయబారిగా వెళ్లి, హితవచనాలు చెప్పి, దుర్మార్గుల దురాగతాల్ని బట్టబయలు చేసి, వాళ్లకుతంత్రాల్ని మట్టుపెట్టి, చివరకు విశ్వరూపాన్ని చూపిన సన్నివేశం 'న భూతో న భవిష్యతి' కదా! ఆశ్చర్యం! ఆ సన్నివేశాన్నీ, భగవంతుని దివ్యధార్మికవాక్కులూ చూడడానికీ, వినడానికీ ఎందరో దివ్యులైన మహాత్ములూ, ఋషులూ ఆకాశమార్గంలో నిల్చొన్నారు. సభలోనూ ఎందరో ఋషులు, పెద్దలూ ఉన్నారు. అయినా ఎవరి బోధలూ 'యముని మహిషఘంటానాదాలు వినిపిస్తున్న దుర్యోధనాదుల చెవులకు వినిపించడంలేదు. రాయబారం విఫలమయింది. యుద్ధమే నిశ్చయమైంది.

శ్రీకృష్ణుడే భారతయుద్ధానికి ముహూర్తం నిర్ణయించాడు. అది క్రీ.పూ. శోభకృత్ సంవత్సర కార్తిక బహుళ అమావాస్య (తిథి త్రయంతో కూడింది) మంగళవారం.

ఇరుసైన్యాలు 18 అక్షౌహిణులతో సిద్ధంగా ఉన్నారు. ఇక యుద్ధం ప్రారంభం కావాలి. తన నిర్ణయాన్ని సాధించి, కృష్ణుడు అర్జునునికి సారథి అయ్యాడు. ఇరువైపులా ఉండే సేనల్ని ఒకమారు తేరిపారజూచి, ఎవరెవరున్నారో చెప్పమన్నాడు - సారథితో - రథికుడైన అర్జునుడు. సారథిగా ఉన్నందున స్వామి చక్కగా వివరించాడు. ఇంతవరకూ సవ్యంగానే జరిగింది. ఉన్నట్లుండి అర్జునుడు రథంలో కూలబడ్డాడు. కర్తవ్యాన్ని విస్మరించాడు. యుద్ధం చేయలేనంటూ - తన అభిప్రాయాన్ని ఏకరువు పెట్టాడు. చివరగా "నేనెందుకు ఇలా అయ్యానో తెల్పండి. మీ శిష్యుణ్ణయిన నన్ను శాసించండి" అంటూ ప్రార్థించాడు - అర్జునుడు.

యుద్ధమంటే ఎంతో ఇష్టపడే అర్జునుడు - ఈనాడు ఇలా దద్దమ్మగా మారడం సహజమా? గతంలో ఎక్కడైనా ఇలా చేశాడా?

అంటే- లేదు. మరెందుకిలా అయ్యాడు? ఇదంతా సారథి అయిన కృష్ణపరమాత్మ కల్పించిన ఒక మాయావిశేషం. ఈ దుస్థితిని కల్పించి, అర్జునుణ్ణి నిమిత్తమాత్రుణ్ణిగా చేసుకొని, మానవజాతికి కర్మ, భక్తి, జ్ఞాన విజ్ఞానాదులతో కూడిన ఉత్తమబోధను అందించా లనేది స్వామిసంకల్పం! కనుకనే అర్జునుడు విషాదంలో ఉంటే - కృష్ణుడు నవ్వుతూ - తన ఆశయం సిద్ధించబోతుందని సంతోషించాడు. ఇపుడు కర్తవ్యవిముఖుడైన నరుణ్ణి కర్తవ్యసుముఖుణ్ణి చేయాల్సివచ్చింది. ఈ ద్వంద్వాల ఘర్షణలలో నుంచీ అవతరించింది - గీత.

శ్రీకృష్ణుడు మహాతాత్త్వికుడు - కనుకనే అతనిముఖంనుండి భగవద్గీత వంటి మహోత్తమమైందీ, సర్వలోకాల్లో నిల్చేదీ అయిన ఉత్తమతాత్త్వికగ్రంథం వెలువడింది. గీతామృతాన్ని పిండిన శ్రీకృష్ణుని రాజనీతికౌశలం, సమాజ నిర్మాణదక్షత, మన గృహనిర్వహణ ప్రకారం, బంధుమిత్రులందు ఆదరణ, దుష్టశిక్షణం, శిష్టరక్షణం - లోకానికి ఎంతోవిజ్ఞానాన్ని పంచిపెట్టాయి. ఇలా భగవద్గుణాత్మకుడైన శ్రీకృష్ణుని సంకీర్తనంతో భారతం పూజనీయమైంది.

భగవద్గీతావతరణం - క్రీ.పూ. 3140 సంIIలో జరిగింది. మొన్నటి ద్వాపరం 28వ ద్వాపరం. ఈనాడు మనం చదువుతున్న గీత ఈ 28వ ద్వాపరాంతంలో ఆవిర్భవించిందే!

కానీ నిజానికి గీతావతరణం ఈ కాలానికి చెందింది కాదు. గీత-నాల్గవఅధ్యాయం ప్రారంభంలో "ఈ తాత్త్విక ప్రబోధాన్ని మొదట సూర్యునికి చెప్పాను. అతడు మనువుకు చెప్పాడు. మనువు ఇక్ష్వాకునికి చెప్పాడు. తర్వాత పరంపరారూపంలో రాజులెందరికో సంక్రమిం చింది. ఈనాడు ఆ బోధ నష్టమైపోయింది. దాన్నే నీ కిప్పుడు మరలా చెప్తున్నా" నన్నాడు - గీతా భగవానుడు.

అదీ 'భక్తుడవూ, సఖుడవూ కనుక నీకు వివరిస్తున్నా' నని చెప్పాడు. కనుక ఈ గీతాబోధావతరణం మానవలోకానికి వచ్చి 200కోట్ల సంవత్సరాలయింది.

గీతాప్రశస్తి

గీత మానవునిఆధ్యాత్మికపరిణామాన్ని చెప్తుంది. ఆత్మవికాసమంటే ఏమిటో చెప్తుంది. అందరి స్వేచ్ఛనూ అరికట్టకుండా-అందరికీ ఆత్మవికాసం, ఆధ్యాత్మికపరిణతి ఉండే లాగా సామాజిక వ్యవస్థ ఉండాలనే సమసమాజ వాదాన్ని వెల్లడించింది. జీవితంలో యోగాన్ని సంయోగం చేసింది. నిత్యజీవితం గడపడం లోని నేర్పు యోగ మనింది. జీవితంలో సమర్థతే యోగ మనే క్రొత్తఅర్థాన్ని పేర్కొనింది. గీత - జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అనే మూడు సత్యాల్ని తెలుపుతుంది. నిత్యజీవితాన్ని ధీరుడుగా ఎదుర్కో! ఇదే శ్రీకృష్ణుని సిద్ధాంతం.

నక్షత్రాలు సూర్యునికంటే పెద్దవే ఐనా- సూర్యుడు ఉదయించాక అవి కన్పించట్లుగా- గీతకంటే ముందున్న తాత్త్వికగ్రంథాలు పెద్దవే అయినా-గీత వచ్చాక అవన్నీ ప్రక్కకు పోయాయి. అన్నింటి స్థానంలో శిరోరత్నంగా భగవద్గీతే సర్వప్రమాణ గ్రంథంగా నిల్చింది. గీతా ప్రబోధంవల్లనే శ్రీకృష్ణుడు జగద్గురువయ్యాడు.

వాస్తవానికి గీతావతరణం 28వ ద్వాపరయుగంలో జరిగింది. శోభకృత్ కార్తికబహుళఅమావాస్య మధ్యాహ్నసమయంలో. తర్వాత యుద్ధం ప్రారంభమయింది. మార్గశిరశుద్ధదశమి సాయం కాలానికి పదిరోజులు యుద్ధం చేసిన భీష్ముడు అంపశయ్యపై పరుండినాడు. ఆ రాత్రి వెళ్లి- సంజయుడు ధృతరాష్ట్రునికి భీష్ముడు పడిపోయాడని వాపోతూ చెప్పాడు. అప్పటికే బాగా రాత్రి ప్రొద్దుపోయింది. కనుక ఉదయం కొలువులో విశేషాలు వివరిస్తూ అన్నాడు - ధృతరాష్ట్రుడు. మరునాడు మార్గశిరశుద్ధ ఏకాదశి - ఉదయం ధృతరాష్ట్రుడు సభలో "ధర్మక్షేత్రే.... సంజయ!" ఏం జరిగిందంటూ సంజయుణ్ణి అడిగాడు. సంజయుడు యుద్ధ ప్రారంభసన్నివేశం నుండి - భీష్ముని పతనంవరకూ అంతా చెప్పాడు.

ఆ విధంగా భగవద్గీత ఆనాటి సభద్వారా అందరికీ తెలిసింది. ఆ అమావాస్యనాడు-రంగమధ్యంలో ఇతరులెవ్వరూ లేరు. కేవలం కృష్ణుడు, అర్జునుడు, రథకేతనంపైనున్న హనుమంతుడు. సర్వమూ గ్రహించే శక్తిని వ్యాసుని ద్వారా పొందిన యుద్ధవార్తాహరుడైన సంజయుడుమాత్రమున్నారు. అన్నీ తెలిసిన వ్యాసుడు ఎక్కడో ఉన్నాడు. వీళ్లకు తప్ప ఆనాటి కృష్ణార్జునసంవాదాత్మకమైన గీతాప్రబోధం- ఇరుపక్షాల్లో చివరకు ధర్మజభీష్మాదులకు కూడా తెలీదు. కనుక భగవద్గీత 28వ ద్వాపరంలో కార్తిక అమావాస్యనాడు అవతరించినా- లోకానికి తెలిసింది- మార్గశిరశుద్ధ ఏకాదశి కనుక - అది విష్ణుప్రీతి కరమైన తిథి కనుక - గీతా జయంతిని - ఈ రోజే జరుపుకోవడం ఎంతోకాలం నుంచీ స్థిర పడింది.



ఈశ్వరార్పణబుద్ధితో చేసే కర్మలు తప్ప మిగిలిన కర్మలన్నీ బంధానికి కారణాలౌతాయని, తెలిసి కర్మల్ని ఆచరించడమే సద్గతికి చక్కని రాజమార్గమనింది- గీత.

మేలినోము

- కీ.శే.'ఆదర్శాచార్య' చిత్రకవి ఆత్రేయ

'మాసానాం మార్గశీర్షోఽహం'-'మాసాల్లో పవిత్ర మార్గశిరమాసాన్ని నేనే' అని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు చెప్పినట్లు- ఈ మార్గశిరమాసం శుక్లపక్షంలో ధనుర్మాసం వస్తుంది. మృగశీర్షానక్షత్రంలో కూడిన పూర్ణిమ వచ్చే నెలకు మార్గశీర్షం అని పేరు. ధనూరాశిలో సూర్యుడు ప్రవేశించే రోజునుండి జనవరిలో మకర సంక్రాంతివరకు ధనుర్మాసం. చాంద్రమానాన్ని బట్టి మనకు మార్గశీర్షమైతే, అదే సౌరమానాన్నిబట్టి ధనుర్మాసం అవు తుంది. ఈ రోజే ధనుస్సంక్రమణదినం. ఆ శుభఘడియలోనే ధనుర్మాసవ్రతం ఆరంభిస్తారు.

పన్నిద్దరాళ్వారులలో ఏకైక స్త్రీమూర్తి గోదాదేవి ఈ విశిష్ట వ్రతాన్ని తన ఊరివారితో కలసి ఆచరిస్తూ తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని గానం చేసింది. తిరు అంటే శ్రీ, పావై అంటే వ్రతం. ఇది సకలసంపదలనిచ్చే వ్రతం, అదే శ్రీవ్రతం, సిరినోము. ఈ వ్రతాన్నే మొదట ద్వాపరయుగంలో రేపల్లెలో శ్రీకృష్ణుణ్ణి పొందాలని కోరి, గోపికలు కాత్యాయినీవ్రతం చేశారు. వారికి వ్రతఫలం దక్కింది. ఊరు, నాడు ఈతిబాధలు తొలగి సస్యశ్యామలమయింది. ఆ తర్వాత కలియుగంలో శ్రీ విల్లిపుత్తూరులో గోదాదేవి (ఆండాళ్) అర్చామూర్తి శ్రీవటపత్రశాయిని సాక్షాత్ శ్రీకృష్ణ భగవానునిగా, ఆలయాన్ని నందగోపభవనంగా, తన స్నేహితురాండ్రను గోపికలుగా, తానూ ఒక గోపికగా త్రికరణశుద్ధిగా భావించి, ఈ వ్రతం చేసింది. ఆమె కోరిన ఫలంగా - శ్రీరంగనాథుణ్ణి పొందింది.

ఈ శ్రీవ్రతం ఇహపరఐశ్వర్యాన్ని, (ప్రేమను), భగవదనుభవాన్నీ, కైంకర్యాన్నీ (శ్రేయాన్ని) ప్రసాదిస్తుంది. ఈ నెలంతా రోజూ సుప్రభాతానికి ముందే బ్రహ్మముహూర్తంలో లేచి, స్నానాదులు చేసి, శుచిగా శ్రీకృష్ణునికి, గోదాదేవికి (రంగనాయకికి) పూజలుచేసి, 'తిరుప్పావు'లోని పాశురాలు అనుసంధిస్తూ అందరూ ధనుర్మాసవ్రతం చేస్తారు. భగవంతునికృపకు పాత్రులవుతారు.

33 కోట్లమంది దేవతల భయాన్ని పోగొట్టే వాడా....

మానవులు తమకు వచ్చే భయాలను, ఆపదలను పోగొట్టుకోవడానికి ఎంతోమంది దేవతలను ఆశ్రయిస్తుంటారు. కానీ, ఆ దేవతలందరూ వారిభయాల్నీ, ఆపదల్నీ పోగొట్టుకొనడానికి దేవాదిదేవుడైన పరమాత్మను ఆశ్రయిస్తారని ఆండాళ్ తన దివ్యప్రబంధం తిరుప్పావైలో చెపుతోంది. రుచికరమైన పదార్థం ఏదైనా నలుగురుకీ పెట్టి, వారితో కలిసి తినాలి' అనే సూక్తిని ఆచరణలో పెట్టి, గోదాదేవి ఊరిలోని వారందరినీ మేలుకొలిపి, వారిని తీసుకొని నాయకుడు, ఆచార్యుడు అయిన నందగోపునిభవనానికి నాలుగురోజులక్రితమే వచ్చింది. ఈ 'తిరుప్పావై' సిరినోములో ప్రధానఘట్టం ఆచార్యసమాశ్రయణం. గోదాగోపికల ఆర్తిని తెలుసుకున్న నందగోపుడు, ఆ సుప్రభాతంలో, శ్రీకృష్ణ పరమాత్మ శయనించి ఉన్న మంచం దగ్గరికి వారిని తీసుకుని వెళ్ళాడు. గోదాగోపికలు అక్కడ పడుకుని ఉన్న యశోదాదేవినీ, దుప్పటి ముసుగుతన్ని కనపడకుండా ఉన్న గోపాలకృష్ణుణ్ణీ, బలరాముణ్ణీ మేల్కొల్పుతారు. కృష్ణుడు అక్కడ లేడని తెలుసుకుని,



నీళాదేవిఇంటికి వెళ్లారు. అక్కడ కృష్ణుణ్ణి, నీళాదేవినీ మేలుకొలిపి, వారికి ఏం కావాలో అడుగుతున్నారు.

ముప్పత్తు మూవర్ అమర ర్కుమున్సె న్రు,
కప్పం త విర్కుం కలియే! తుయి లెళాయ్

....అనే ఈ 20 పాశురానికి తెనుగుసేత ఇది.

ముప్పదిమూడు సురకోటుల ముప్ప గాచి
భయమును మానుపు బలశాలీ! మేలుకో!
ఆర్జవముతో ఆశ్రితులను బ్రోచు
అరిభయంకరా! హరీ! మేలుకో!
స్వర్ణకలశవక్షఃసీమ, అరుణవర్ణాధరములు, సన్నని
కటికల పూర్ణా! నప్పిన్నా! సిరీ! మేలుకో, మమ్మేలుకో!

ఆలవట్టము, అద్దమొసగీ అందరినీ
నీస్వామితో నీరాట్ట మాడించమే అమ్మా!

జగతికే మంగళము కూర్చు మన శ్రీ వ్రతము.

33 కోట్ల దేవతలకు ఏ కష్టం కలుగుతుందేమోనని ముందే వెళ్ళి, వారికి శత్రుభయాన్ని తొలగించే బలశాలివి గదా!



నీ ఆర్జవం అంత గొప్పది. ఆర్జవం అంటే మనసులోని ఆలోచన, పలికే మాట, చేసేపని - ఈ మూడు ఒకేలా ఉండడం. స్వామీ! మరణమే లేని దేవతలకు సాయపడతావే కాని, నిన్ను వదలి బ్రతుకు లేని, బ్రతుకలేని మావంటి దీనులను అనుగ్రహించవా? మాపట్ల నీ ఆర్జవం నిరూపించు! లేచి మమ్మల్ని కటాక్షించు! అమ్మా! నీళాదేవీ! నీవు సాక్షాత్తు లక్ష్మివే! నీవు లావణ్యంలో, సౌందర్యంలో, దయలో, కారుణ్యంలో, క్షమలో అన్నింటిలోను పరి పూర్ణురాలివి. లేచి మా మొర లాలించవమ్మా!" గోదాగోపికల ప్రార్థనలు విన్న నీళాదేవి మేల్కొని ఇలా అంది 'మీ విషయమే ఆలోచిస్తున్నానమ్మా! మీకేం కావాలో చెప్పండి.' అపుడు గోపికలు సంతోషంతో ఇలా అన్నారు. 'విసనకర్రను, అద్దాన్ని మాకిచ్చి, నీ ప్రియునితో మేము స్నానంచేసేట్లు చెయ్యి! ఇదే మా కోరిక.' ఇదేం కోరిక? అమ్మవారిని కోరే కోరిక ఇదేనా? భర్తతో స్నాన మాడించమని భార్యనే కోరడం తగునా? ఇక్కడ స్వాపదేశార్థం గ్రహించాలి. జీవులందరిచేత పొందబడేవాడొక్కడే! ఆయన పర మాత్మ! శ్రీకృష్ణపరమాత్మను చేరడమే గోపికలు కోరే స్నానం. ఈ స్నానానికి పరికరాలు అద్దం, విసనకర్ర. వివిధతాపాలవల్ల శరీరానికి పట్టిన చెమటలు (అహంకారం, మమకారం), విసనకర్రతో (నమః=నేను కాదు, నాది కాదు) పదేపదే విసురుకుంటే తొలిగి పోతాయి. అపుడు స్నానం చేసి, అద్దం చూచుకోవాలి. ప్రణవమ్ (ఓంకారమ్) ఆ కంచుటద్దం, అది మన ఆత్మస్వరూపాన్ని తెలియజేస్తుంది. ఈ రోజు పాశురం సారాంశం ఏమిటంటే, 'అమ్మా! మా స్వరూపాన్ని చక్కదిద్దుకునే అవకాశం మాకు కల్పించు! ఆ కృష్ణపరమాత్మకే సర్వవిధకైంకర్యాలు చేసే భాగ్యాన్ని మాకు ప్రసాదించు' అని గోదాగోపికలు నీళాదేవిని ప్రార్థిస్తున్నారు.

ధనుర్మాస వ్రతం- ఒక కీలకఘట్టం

గోదా, గోపికలు సిరినోము ప్రాశస్త్యాన్ని గురించి అందరికీ చెప్పి, ఇంకా నిద్ర లేవని పదిమంది గోపికలను మేల్కొలిపి, అందరూ కలిసి వ్రతంలో 16వ రోజున సుప్రభాతన్నే నందగోపుని భవనానికి వచ్చారు.


నాయగ నాయ్ నిన్ర నందగోపనుడయ
కోయిల్ కాప్పానే....
నాయకుడై నట్టి నందగోపుల వారి
ప్రాసాదరక్షకా! ఓ ద్వారపాలకా!

మణిమయద్వారంపుగడితీయవయ్యా అంటూ భవనం తలుపులు తెరవమని ప్రార్థించారు. ఎందుకు? ఏమిటి? అని ద్వారపాలకులడిగితే, గోదాగోపికలు ఇలా చెప్తున్నారు. 'కన్నయ్య

నిన్ననే మమ్మల్ని కలిశాడు. వ్రతానికి 'పర'వాద్యాన్నిస్తానని మాకు మాట ఇచ్చాడు. అందువల్ల మేమిప్పుడు చిన్నికృష్ణునికి సుప్రభాతం పాడి, నిద్రలేపి, ఆ 'పర'ను తీసుకువెళ్ళడానికి వచ్చాము. నీవు కాదనకుండా వెంటనే ఆ తలుపులు తెరిస్తే మేము లోపలికి వెళ్ళి, ఆ మాయావిని, మణివర్ణుణ్ణి కలుస్తాం. జగతికి మంగళం కూర్చే శ్రీవ్రతాన్ని పూర్తిచేస్తాం.'

తిరుప్పావై మణిహారంలో మేరుపూస (పైది) శ్రీకృష్ణుడైతే, మధ్యమణిపూస ఈ 'నాయగనాయ్' పాశురం (గీతం). ఈ విశేష పాశురం ఆచార్యసమాశ్రయణాన్ని సూచిస్తుంది. జీవులను పరమ పదానికి చేర్చే నాయకుడు ఆచార్యుడు. ఆయనే నందగోపుడు. నందగోపభవనమే మంత్రము. దానిలోపల కృష్ణభగవానుడు న్నాడు. 'ఆచార్యవాన్ పురుషో వేద'- ఆచార్యుణ్ణి గలవాడే భగవానుణ్ణి పొందగలడని ఛాందోగ్యఉపనిషత్తువాక్కు.

భగవానుడు గోదాగోపికలకిచ్చే 'పర' వాద్యమే పరమ పురుషార్థం- భగవత్‌కైంకర్యం. మనోజయం (ద్వారపాలకుడు) మన అహంకార మమకారాలనే తలుపుల్ని తెరుస్తుంది. గోపికలు (జీవాత్మలు), లోనికి వెళ్లి నందగోపుని (ఆచార్యుని) అనుమతితో శ్రీకృష్ణభగవానుణ్ణి కలుస్తారు. ఆండాళ్, 'తిరుప్పావై' దివ్య ప్రబంధంలో ఇది కీలక ఘట్టం. ఇది ప్రపన్నులు వారిఆచార్యులను ప్రీతితో సేవించేరోజు.



ధనుర్మాసవ్రత విధానం - నియమాలు

- తెల్లవారుజామున నాలుగుగంటలకు ముందే లేచి, స్నానాదులు చేసి, శుచిగా ఆరవేసిన తెల్లనివస్త్రాల్ని ధరించి, శుభకరమైన ఊర్ధ్వతిలకాన్ని పెట్టుకొని, ఇంటిలోని దైవసన్నిధికి చేరాలి.
- శ్రీరంగనాథుడు, శ్రీగోదాదేవి లేదా శ్రీకృష్ణుడు, శ్రీగోదాదేవి పటాలను, అర్చామూర్తులను ప్రత్యేక పీఠంపై వేంచేపు చేసి, అలంకరించి, వారిని మనస్సులో నిలుపుకొని, ఆరాధన ప్రారంభించాలి.
- అర్ఘ్య, పాద్య, ఆచమనాలను, స్నానాన్ని, చందనాన్ని, సమర్పించి, పుష్పాలతో, తులసీదళాలతో, ప్రీతితో, కేశవాది నామాలతో, శ్రీకృష్ణాష్టోత్తర, శ్రీగోదాష్టోత్తర శతనామావళులతో అర్చన చేయాలి.
- ఆ పైన ధూప, దీపాలు, ఆచమనాలు సమర్పించి, పొంగలి నైవేద్యం పెట్టాలి.
- 'లక్ష్మీచరణలాక్షాంక...., 'స్వోచ్ఛిష్టమాలికా' అనే రెండుశ్లోకాలతో మంగళనీరాజనం సమర్పించాలి.
- తర్వాత, ధనుర్మాసమహావ్రతసేవాకాలం చేయాలి. అనగా ఆళ్వార్, ఆచార్యప్రార్థన, తిరుప్పళ్ళి యెళుచ్చి (శ్రీరంగనాథ సుప్రభాతం), తిరుప్పావై తమిళపాశురాలను, తెలుగుగేయాలను శ్రద్ధగా చదవాలి. 1, 3, 16, 18, 23, 24, 27, 28, 29, 30 పాశురాలను రెండుసార్లు పఠించాలి.
- తిరుప్పావైలోని 28 పాశురాలు పఠించిన తర్వాత (అనగా 'కఱవైగళ్' వరకు), అర్ఘ్య, పాద్య, ఆచమనీయాలు సమర్పించి, ప్రత్యేకఆరగింపు (దధ్యోదనం- ఫలాదులు; ఇంకా విశేషపాశురాలు వచ్చినప్పుడు పులిహోర, చక్కెర పొంగలి,

భక్ష్యాలు చేయాలి). 1, 3, 16,18, 23, 24, 27, 28, 29, 30 (మొత్తం పది) పాశురాలు విశేషపాశురాలు. 'కరవైగళ్' పాశురంరోజు వ్రతం చేసే కుటుంబాలతో కలసి, 'వనవిహారం' వెళ్లి రావచ్చు.

- తాంబూలం సమర్పించిన తర్వాత, నిల్చొని, కర్పూరహారతి వెలిగించి, 'మంగళాశాసన' శ్లోకాలు చదవాలి. మొదట 'అన్టివ్వులగం' అనే తిరుప్పావైలోని 24వ పాశురం రెండు సార్లు అనుసంధించాలి.

- ఇపుడు సువర్ణమంత్రపుష్పం సమర్పించి, చామరం వీస్తూ శాత్తుముఱై పాశురాలు-అనగా 29, 30-'శిత్తుం శిరుకాలే, వంగక్కడల్'- పాశురాలను రెండుసార్లు అనుసంధించాలి. హారతిస్తూనే 'కర్కటే పూర్వఫల్గున్యాం, తులసీకాననోద్భ వామ్। పాండ్యే విశ్వంభరాం గోదాం, వందే శ్రీరంగనాయ కీమ్॥' అనే శ్లోకాన్ని, 'నీళాతుంగస్తనగిరితటీ' అనే ఆండాళ్ ప్రార్థనశ్లోకాన్ని విన్నపం చేయాలి. తర్వాత నమస్కరించి, మంగళకరమైన మీ కోరికలను మనసుతో విన్నవించాలి.

- అనంతరం ఆండాళ్‌వాళితిరునామాలను తమిళంలోను, తెలుగులోను మొదటిరెండు పాశురాలనుమాత్రం అను సంధించాలి. వెంటనే, అందరికీ తీర్థాన్ని, ప్రసాదాలను వినియోగం చేస్తూ, 'సర్వదేశదశకాలే'తో ప్రారంభమయ్యే ఆళ్వారాచార్యుల మంగళాశాసనశ్లోకాలు చదవాలి.

- తర్వాత ఆండాళ్‌వాళితిరునామాల్లోని 3, 4 శ్లోకాలు చద వాలి.

- ఇప్పుడు, 'శ్రీగోదాచతుఃశ్లోకి' అనుసంధించాలి. తుదిగా, 'క్షమాప్రార్థన' శ్లోకాలు చదవాలి.

- ఇప్పుడు, 'మంగళము శ్రీరంగమన్నారురాణికిని' అనే మంగళం, 'ఊంజల్‌సేవ' పాట మొ॥ పాడుకోవచ్చు. స్వామిసన్నిధిలో సాష్టాంగదండప్రణామం (ఆలయంలో అయితే రెండుచేతులు జోడించాలి) చేసి, 'కోయిల్ ఆళ్వార్' తలుపులు వేయాలి. ఈ కార్యక్రమం అంతా ఉదయం ఆరుగంటలలోపే పరిసమాప్తం కావాలి.

- మార్గశిరమాసంవచ్చిన రోజునుంచి, ధనుర్మాసం ప్రారంభం అయ్యేవరకు ఈ వ్రతవిధానం బాగా అధ్యయనం చేసి, అన్నిఏర్పాట్లు చేసుకోవాలి. ముందుగా సత్సంగసభ్యులకు, బంధువర్గానికి, ఇరుగుపొరుగులకు, మిత్రులకు, భాగవతోత్తములకు, ఆచార్యులకు ఈ వ్రతసంకల్పాన్ని వినయ పూర్వకంగా తెలియజేసి, వారిని ఆహ్వానించాలి.

- మొత్తం పదినియమాలు శ్రీ గోదాదేవి తిరుప్పావై రెండో పాశురం-'వైయత్తువాళ్వీరుగాళ్'లో సూచించారు. ఆ నియ మాలు విధిగా పాటించాలి. ఇవి జీవితాంతం పాటిస్తే మరీ మంచిది. ఈ పదినియమాలలో రెండు - నెయ్యి తినకుండా ఉండడం, పాలు త్రాగకుండా ఉండడం. అయితే ఆరాధన పూర్తికోసం పాయసంలో పాలు, పొంగలిలో నెయ్యి ఉపయో గించి, దైవనివేదితప్రసాదంగా తీసుకోవచ్చు. అట్లే అన్ని భోగాలకు, భోగవస్తువులకు దూరంగా ఉండాలి.

- విశేషపాశురాల రోజులలో నివేదితభోగాలను ప్రసాద ప్రతి పత్తితో కొద్దిగా చేతిలో ఉంచుకొని స్వీకరించాలి. వ్రతం రోజుల్లో సాత్త్వికాహారాన్ని - వీలైతే ప్రసాదాన్నే మితంగా స్వీకరించాలి.

- సాయంకాలం శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రం పఠించి, మీ ఊరిలో జరిగే తిరుప్పావైప్రవచనం విని, రాత్రి ఇంటికి వచ్చి, పెరుమాళ్లకు అర్ఘ్యపాద్యాదికాలు సమర్పించి, ధూప దీపాలు ఇచ్చి, పండ్లు, పాలు ఆరగింపు చేసి, మంగళా శాసనం సమర్పించాలి.

- ఈ విధంగా 30 రోజుల శ్రీవ్రతం పూర్తిచేసి, భోగిపండుగ రోజు, ఇంటిలోనే శ్రీగోదాకల్యాణం నిర్వహించాలి. లేదా మీఊరిఆలయంలో జరిగే గోదా కల్యాణానికి వెళ్లి, అక్షతలు, తీర్థప్రసాదాలు స్వీకరించి, ఇంటికి వచ్చి, కల్యాణాక్షతలు కుటుంబసభ్యులకు అందించి, వ్రతపరిసమాప్తి చేయాలి.

- ధనుర్మాసం ముందుగాని, తర్వాతగాని కుటుంబసభ్యులు, సత్సంగసభ్యులతో కలసి, మొదట శ్రీ విల్లిపుత్తూరు, తర్వాత శ్రీరంగం- ఒకేయాత్రలో దర్శించితే- భక్తిశ్రద్ధలతో మనం ఆచరించిన ధనుర్మాసమహావ్రతం సుసంపన్నమౌతుంది.

గోదాదేవి శ్రీరంగనాథునితో భోగైక్యం పొందినరోజే భోగి పండుగ. అంతకుముందు సంక్రాంతి పండుగే విశేషపర్వదినం. 'భోగం' అంటే సుఖం. గోదా విషయంలో భోగం శారీరకం కాదు. ఆమె శ్రీరంగనాథునిలోనే సశరీరంగా ఐక్యమైంది. జీవాత్మ శరీరంతో పాటు పరమాత్మలో ఐక్యకావడం-గోదాదేవి మధుర భక్తిలోని విశిష్టత. ఆమె కల్యాణం ఇతరుల కల్యాణంవంటిది కాదు. కానీ లోకశ్రేయస్సు దృష్ట్యా రుక్మిణీ కల్యాణం వలె **'గోదా శ్రీరంగనాయకులకల్యాణం'** భోగిపండుగనాడు నిర్వహించడం సంప్రదాయమైంది. దేవతల కల్యాణాలు లోకకల్యాణం కోసమే!



పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

కేరళదేశంలో 'కుక్కుటకూట' మనే పురం. ఆ పట్టణంలో దేనికీ కొదువ లేదు. ఆ నగరం 'అయోధ్యలా' ఉంది. ఆ పట్ట ణాన్ని పరిపాలించేవారు చేరవంశీయులు. ఆ దేశాని కధిపతి దశరథునిలాంటివాడు. శ్రీహరిభక్తులలో రుక్మాంగదునివంటివాడు.

ఆ 'అధీశ్వరునికి' మాఘ – పునర్వసు తారలో కౌస్తుభాంశంతో ఒక కుమారుడు పుట్టాడు. అతడే కులశేఖరుడు. శ్రీరాముల వారిజన్మనక్షత్రం, కులశేఖరునిజన్మతార రెండూ ఒకటే. శ్రీరాములవారిలాగే కుల శేఖరులు 'ఒకమాట, ఒకబాణం' లాగా రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. అతడు రామ కథాసుధారసలగ్నహృదయుడుకూడా.

కులశేఖరులకున్న ప్రత్యేకగుణం 'అర్చా వతారసేవనం'. అంతేకాదు. ఎనలేని భాగ వతభక్తికూడా. ఆ మహీపతిదృష్టిలో శ్రీహరి కంటె భాగవతులే సర్వశ్రేష్ఠులు. తాను రాజ యినా తన సంపద అంతా వైష్ణవుల సొమ్ముగా భావించి, శ్రీవైష్ణవులను సంభా వించేవాడు. అందుకే కుక్కుటపురం 'శ్రీ వైష్ణవనిలయ' మయింది.

ఆ మర్యాదాపురుషోత్తముణ్ణి దర్శించ డానికి రోజూ ఎందరో వచ్చేవారు. వారిలో వైష్ణవసమూహమే ఎక్కువ.

ఒకరోజు మహారాజు అంతఃపురంలో ఉన్నారు. అపుడే వైష్ణవులు 'దురదుర' అడుగుపెట్టారు. ఈ దృశ్యాన్ని చూచిన మంత్రులు ద్వారపాలకులకు 'చేసన్న' చేశారు. ఇంకేం? ద్వారపాలకులు వారిని అడ్డగించారు. తమ చేతిలోని రక్షకదండాన్ని వాకిటికి అడ్డంగా పెట్టారు. కొందరు లెక్క చేయకుండా పోతుంటే 'నిలవండి నిలవండి' అని హెచ్చరికకూడా చేశారు. చివరకు ద్వారపాలకులు–

"స్వాములారా! ఆగండి. మహారాజుల వారు అంతఃపురంలో ఏకాంతంగా ఉన్నారు. వారిఅనుమతి లేకుండ ఇచ్చవచ్చినట్టు ఎప్పుడంటే అప్పుడు లోపలికి అడుగు పెట్టడం తగదు. రాజు వైష్ణవప్రియుడయినంతమాత్రాన ఈ జబర్దస్తీ పనికిరాదు. చెఱకు తీపి అని వేళ్ళతో పెకలించడం సబబుకాదు. మిమ్మల్ని అడ్డగిస్తున్నామని అన్యథా భావించ కండి. సమయం చూచి, మీరు వద్దురు గాని. అయినా తొందరపడకండి. ఇక్కడే కాసేపు కూర్చోండి" అన్నారు.

'ఆలాగా! మాదే తప్పు. సమయాసమయాలు తెలుసుకోకుండా వచ్చాం. ఇది పరమభాగవతుల భవనం. శ్రీవైష్ణవులదగ్గర ఉన్నవారంతా ధన్యాత్ములు. పుణ్యవంతులు. వారున్నచోట కీటకాలయినా వాటికి ముక్తి తథ్యం. ఆలాగే మేము 'మొగసాల'లో కాచుకుకూర్చొంటాం, మీ ఆన పాటిస్తాం' అన్నారు.


ఈ దృశ్యమంతా అంతఃపురం చెలికత్తెలు చూస్తూ వున్నారు. వారు ఆలోచనల్లో పడ్డారు. శ్రీవైష్ణవులరాక చెప్పాలా? వద్దా? అనే మీమాంసలో పడ్డారు. కావలివారు అడ్డగించడం వారిధర్మం. కానీ, చెలికత్తెలధర్మం వేరు. వార్తలను అందివ్వడమే వారిపని. ఒక వేళ చెప్పకపోతే? రాబోయే అనర్థాలకు తాము బాధ్యులు కాదలచుకోలేదు. అందుకే వారు 'లో నగరు' లోనికి వెళ్ళారు. విశ్రాంతి తీసుకొంటున్న జనకయోగీంద్రులలాంటి రాజుగారి దగ్గరికి వెళ్ళి, సవినయంగా

"దేవా! భాగవతులు మీ దర్శనార్థం వచ్చారు. కానీ కావలివారు తమరు అంతః పురంలో ఉన్నారని, వారిని ద్వారందగ్గరే ఆపారు. వారేమో మొగసాల నిలిచారు. ఈ వార్త తమకు తెలియచెప్పడం మా విధ్యుక్తధర్మంగా భావించాము. విన్నది, కన్నది మీకు విన్న వించాం" అన్నారు.

కులశేఖరులు గాభరాపడ్డారు.

'ఆలాగా! వైష్ణవులు అనిరుద్ధులు. వారికి అడ్డు చెప్పడం తగదు. హరిదాసవరులకు అసలు అడ్డం లేదే? అడ్డగించడమెందుకు' అని కోప్పడ్డారు.

మంచం మీదుండి లేచారు–దిగ్గున. పరిచారకులు సందడితో తెచ్చిన పావుకోళ్ళు తొడుక్కోలేదు. దగ్గరివారి కైదండ పట్టుకో లేదు. 'జాతికొదమసింగం' లాగా అడుగులు వేస్తూ మొగసాలలో వేచివున్న పరమవైష్ణవుల శ్రీపాదపద్మాలమీద వాలారు.



"భాగవతులార! క్షమించండి. ఇది తెలియక జరిగిన అపరాధ' మన్నారు.

శ్రీ వైష్ణవులు కులశేఖరుణ్ణి చూచారు. ఆతనిభక్తికి సంతోషించారు. అంతేకాదు. కౌగిలించుకొన్నారు. 'శ్రీనివాసో రక్షతు' అని కానుకలిచ్చారు.

కాసేపాగి కులశేఖరులు కావలివారివైపు చురచుర చూచి, "ద్వారపాలకులార! నేను చెప్పిందేమిటి? మీరు చేసిందేమిటి? వైష్ణవులు ఎపుడు వచ్చినా అడ్డుచెప్పరాదని హెచ్చరించానుకదా! నా ఆన లెఖ్ఖపెట్టక బరితెగించా రేమిటి? ఇది మీ స్వతంత్రనిర్ణయమా లేక ఎవరయినా ప్రోత్సహించారా! నా ఆజ్ఞ శిరోధార్యమని మరచినారా? మీకు కండకావరమా లేదా పొట్ట కొవ్వా" అని రుసరుస లాడారు.

తమకారణంగా ఒకరిని శిక్షించడమో లేదా తాము చూస్తుండగా వింటుండగా అదలించడం వారికిష్టం లేదు. ఈ దృశ్యాన్ని చూచిన హరిభక్తులు కలవరపడ్డారు. అంతేకాదు తమ ముందు ఈ ధట్టింపు అనర్థదాయకం అని భావించారు. అంచేత వారు వెన్వెంటనే

"స్వామీ! కులశేఖరా! ఆగండి. మా మాట వినండి. వీరు చేసిన తప్పు మన్నించండి. మా ప్రార్థన ఆలకించండి' అన్నారు.

కులశేఖరులు వారిసంప్రార్థనం కాదనలేక పోయారు. వారిని మన్నించి వైష్ణవులకు స్వాగతం చెబుతూ అంతఃపురంలోనికి దారితీశారు. వైష్ణవుల్ని మణిమయపీఠాలపై ఆసీనులజేసి ఉపచరించారు. రోజులు గడిచాయి. వైష్ణవసమూహం రావడంలోగాని, రాజు ఉపచారంలోగాని మార్పులేదు. కులశేఖరుల మంత్రివర్గం ఒకచోట గుమికూడారు. పరస్పరం సంభావించుకొన్నారు. వైష్ణవుల రాకను, రాజుకున్న భాగవతప్రీతిని తర్కించుకొన్నారు. అయినా మంత్రులుగా తమ బాధ్యతలుగా గుర్తించి, కులశేఖరుల వారికి కొన్నిఅంశాలు విన్నవించాలని కలిసి బయలదేరారు. జంకుకొంకులతో రాజుదగ్గరికి చేరారు. మంత్రివరులను కులశేఖరులు చూచారు.

'మంత్రివరులార! ఎందుకు జంకుతున్నారు? ఏదో చెప్పాలనుకొంటున్నట్టు అనిపిస్తున్నది. ఇది ఏకాంతప్రదేశం. ఇక్కడ పరులెవ్వరు లేరు. తప్పక చెప్పవలసింది ఏదయినా ఉంటే వెంటనే చెప్పండి" అన్నారు.

(ఇంకా ఉంది)



తిరుప్పావై సందేశం

- డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420

"వేదమ్ అనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదై తమిళ్" - గోదాదేవి ద్రావిడప్రబంధమైన తిరుప్పావై వేదానికి అంతటికిని విత్తనం వంటిది- అంటే- సారం వంటిది - అని తిరుప్పావై ప్రబంధం ప్రశస్తి కెక్కింది. వేదమనేది విధినిషేధరూపంలో ప్రతిమానవుడు వర్తించాల్సినరీతిని ప్రబోధిస్తుంది. వేదానికి సారమైన తిరుప్పావైలోకూడా ఈ విధంగా విధినిషేధరూపంలో ఏ రీతిలో కర్తవ్యాన్ని బోధిస్తుందో కొంచెం గమనిద్దాం. వేదం ప్రభువువలె ఆజ్ఞాపించగా, రసవత్కావ్యమైన తిరుప్పావై సున్నితంగా ఈ కర్తవ్యబోధ చేస్తుంది.

గోదాదేవి గోపికలను అనుకరిస్తూ, శ్రీకృష్ణునిఅను గ్రహాన్ని పొందడంకోసం ధనుర్మాసవ్రతాన్ని చేసింది. ఆ వ్రత విధానాన్ని తిరుప్పావై ప్రబంధంగా వెలయించింది. తాను ఆచ రించే వ్రతంవల్ల లభించే భగవదనుగ్రహం అందరికీ కలగా లనే ఉదారాశయంతో ప్రబంధప్రారంభంలోనే "నీరాడ ప్పోదు వీర్ పోదుమినో" - వ్రత స్నానాన్ని చేయాలనే ఆశ గలవాళ్లందరూ రండి - అని సాదరంగా ఆహ్వా నిస్తూ ఒక చక్కని సందే శాన్ని అందిస్తుంది. భారతంలోని విదురనీతి "ఏకః స్వాదు న భుంజీత" - మంచివస్తువును ఒంటరిగా భుజించరాదు అని తెల్పింది. అన్నిటి కంటే మిక్కిలి భోగ్యమైన భగవదనుగ్రహం తానొక్కతే పొందితే చాలదు, పది మందితో కలిసి పొంది, ఆనందించాలనే గొప్ప భావంతో గోదాదేవి చేసిన ఈ ఆహ్వానం విదురనీతిసూక్తిని తలపిస్తుంది. ఈ భావానికీ, ప్రయత్నానికీ అనుగుణంగానే శ్రీకృష్ణస్వామి, తనతో పాటు, తనతో కలిసి వ్రతాన్ని ఆచరించిన వారినందఱినీ అనుగ్రహిం చిన వైనాన్ని "యామ్ పెఱు శమ్మానమ్" - మేము పొందిన సన్మానం - అనే బహువచన ప్రయోగంద్వారా, "కూడి యిరున్దు కుళిర్న్దు" - అందఱు కలిసి ఉండి ఆనందించి - అనే సూక్తిద్వారా గోదాదేవి తెల్పింది.

వ్రతాచరణంవల్ల కలిగే ప్రయోజనపరంపరనుగూర్చి గోదాదేవి మూడవపాశురంలో ప్రస్తావించిన తీరు చాలాహృద్యం. "లోకాలను కొలిచిన స్వామినామాన్ని కీర్తించి, వ్రతాన్ని చేస్తే - లోకంలో ఏ కీడూ కలుగదు. ప్రతిమాసం మూడుమార్లు వర్షం కురుస్తుంది. ఎత్తుగా పెరిగిన ఎఱ్ఱని పంటచేల మధ్యలో బాగా బలిసినచేపలు తుళ్లుతాయి. చక్కగా పూచినకలువపూలలో తుమ్మెదలు నిద్రిస్తాయి. ఎంత పితికినా ఇంకా ఇంకా పాలు వర్షించే పశుసమృద్ధి కల్గుతుంది. తరగని సంపద నిండుగా ఉంటుంది" - అని వ్రతఫలాన్ని ఆండాళ్ తెలుపడంలోని ఆంతర్యం గమనించదగింది. మన ప్రయోజనాన్ని ఉద్దేశించి చేసే ప్రయత్నాలు ఏవీ పర్యావరణ పరిరక్షణకు భంగం కల్గించరాదనీ, పశుపక్ష్యాది సకల ప్రాణికోటి క్షేమంగా ఉన్నప్పడే, చుట్టూ ఉండే పర్యావరణం సురక్షితంగా ఉన్నప్పడే మన మనుగడకు యోగక్షేమాలుంటాయనే సందేశం దీనిద్వారా సూచింపబడింది.

ఏ పనిచేసినా త్రికరణశుద్ధిగా చేసినపుడే అది ఫలిస్తుంది - అనేది అందరిఅనుభవంలో గోచరించేసత్యం. దీన్ని గోదాదేవి అయిదవపాశురంలో - "దామోదరనై నామ్ తూమలర్ తూ విత్తొళుదు వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క పోయి పిళై యుమ్....తూ శాకుమ్" (దామోదరుని మనం పరిశుద్ధ పుష్పాలతో అర్చించి, నమ స్కరించి, నోటితో కీర్తించి, మనస్సులో ధ్యానిస్తే మన ప్రాక్తన, ఆగామికర్మలన్నీ అగ్నిలో పడినదూదివలె రూపుమాసిపోతాయి) అని పల్కిన సూక్తి ఈ సత్యాన్ని బోధిస్తుంది.

15వ పాశురంలో నిద్ర లేపబడే గోపిక తన చెలికత్తెల మాటలకు మొదట కోపిస్తూ బదులి చ్చింది. కానీ, వెంటనే ఆత్మ పరిశీలనం చేసుకొని, తన లోనే దోషం ఉందనీ, క్షమించమనీ అర్థించింది. ఎవరైనా మనలోని దోషాన్ని ప్రస్తావిస్తే మొదటగా కోపించడం సహజం. కానీ, వెంటనే మనలోపాన్ని గుర్తించి, సరిదిద్దు కోవడం వివేకంకలవానిలక్షణం - అనే ప్రబోధం ఇందులో కన్పిస్తుంది. ఈ విధంగా తిరుప్పావై ప్రబంధంలో మనం నిత్యం గమనించి, ఆచ రించదగినవాస్తవాలు ఎన్నో గోచరిస్తాయి.



డిసెంబరు, 10
గీతాజయంతి సందర్భంగా...

గీతావిజ్ఞానం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

మన ఋషివాఙ్మయంలో "గీతలు" అనే ప్రక్రియకు చాలా ప్రాధాన్యముంది. ప్రసిద్ధంగా 'భగవద్గీత'ను చెప్పుకుంటున్నాం.

నిజానికి దీన్నికూడా గీతలు అనే అంటారు. 'గీతాసు ఉపనిషత్సు' అని బహువచనంలోనే వ్యాసుడు పేర్కొన్నాడు.

'భగవద్గీత' కాక - ఇంకా చాలాగీతలు ప్రాచీన ఆధ్యాత్మికసాహిత్యంలో దర్శనమిస్తాయి. 'మహాభారతం' లోనే 'అనుగీత', 'హంసగీత'లు ఉన్నాయి. భాగవతంలో 'గోపికాగీతలు', 'భ్రమరగీతలు', 'వేణు గీత', 'యుగళగీతలు', 'శ్రుతిగీతలు' ఉన్నాయి. ఇందులో మొదటినాలుగు 'మధురభక్తి' సంప్రదాయాన్ని చెప్పినవి. వేటికవి ప్రత్యేకగ్రంథాలు.

> **విశ్వంలో ప్రతి వస్తువు భగవచ్ఛక్తితో ఉన్నదని, ప్రపంచంలో అన్ని గొప్ప వస్తువులలో దివ్యత్వాన్ని చూపించే విభూతియోగం - అటుపై విడివిడి వస్తువులుగా కాక అన్నీ కలిపి ఏకంగా సమస్తమూ ఈశ్వరస్వరూపమేననే జ్ఞానసిద్ధిని అందించే 'విశ్వరూప సందర్శనయోగం' అన్ని గీతలలో సామాన్యాంశాలు.**

ఇవి కాక కపిలగీత, ఉద్ధవగీత, అష్టావక్రగీత, శివగీత, గణేశగీత, శ్రీదేవీగీత.... కూడా పురాణాల్లో కనిపిస్తాయి. ఇవన్నీ 'భగవద్గీత అనుకరణలా'? అని కొందరికి సందేహం.

కానీ వేదవిద్యను విపులీకరించే పురాణప్రక్రియలో 'గీత' ఒక సంప్రదాయం.

పరమేశ్వరుడు జగద్రక్షణకోసం నామరూపాలతో వ్యక్తమైనా, లేదా అవతరించినా చేష్టద్వారా ఎంత ఉపకారం చేస్తాడో, మాటద్వారా అంతమేలు చేస్తాడు. మాటద్వారా చేసే మేలు గీత.

- గీతల పరమార్థం - ఉపనిషత్తత్త్వాన్ని ప్రతిపాదించడం, అంతటా వ్యాపించింది ఒకే పరబ్రహ్మం అనే ఎరుక మనకు కలిగించడం వీటిఉద్దేశం. ఈ అవగాహన వల్ల రాగద్వేషాలు, వైషమ్యాలు సమసి, తత్త్వవిచారణ జరిగి, జ్ఞానవైరాగ్యాలు సమకూరుతాయి.
- విశ్వంలో ప్రతివస్తువూ భగవచ్ఛక్తితో ఉందనీ, ప్రపంచంలో అన్నిగొప్పవస్తువులలో దివ్యత్వాన్ని చూపించే విభూతియోగం- అటుపై విడివిడివస్తువులుగా కాక- అన్నీ కలిపి ఏకంగా సమస్తమూ ఈశ్వరస్వరూపమేననే జ్ఞానసిద్ధిని అందించే 'విశ్వరూపసందర్శనయోగం' అన్నిగీతలలో సామాన్యాంశాలు.
- భగవద్గీతలో కన్న ఇతర గీతలన్నింటిలో విస్తృతంగా చెప్పబడిన అంశం 'పిండోత్పత్తిప్రకరణం'. జీవుడు శరీరాకృతిని ధరించే వ్యవస్థ ఇందులో వర్ణితం. అటుపై జీవితాన్నీ, ప్రపంచాన్నీ విశ్లేషించి, సత్యాసత్యాలను (నిత్యానిత్యాలను) తేల్చి చెప్పడం జరుగుతుంది.
- ప్రతిగీతలోను భక్తి, జ్ఞానకర్మయోగాలు చెప్పబడ్డాయి. ఈ మూడింటినీ సమన్వయించి, అన్నివిధాల సాధనామార్గాలను బలపరచడమే వీటిఉద్దేశం. ధ్యానం, ఉపాసనవంటివాటిని గీతలన్నీ బోధించాయి.

"సమస్తమూ వ్యాపించిన ఒకే పరమేశ్వరుడున్నాడు. ఆయన సర్వకారకుడు, సర్వాతీతుడు, నిర్గుణుడు, నిరాకారుడు, నిరంజనుడు, అనంతుడు. ఆ తత్త్వాన్నే శక్తిగా ఉపాసించినా, శివునిగానో, శ్రీహరిగానో ఆరాధించినా వ్యక్త మయ్యే నామరూపాలతో ఆగిపోకుండా, తత్త్వాన్ని తెలుసుకొని, జ్ఞానసిద్ధిని పొందు. 'జ్ఞానసిద్ధియే మోక్షం' ఇది సర్వగీతలసారం." ఉపనిషన్మతాన్ని, ఉపాసనావిధానాలనీ సమన్వయించే వేదాంత విచారణయే గీతలు.

పరిపూర్ణుడైన నారాయణబ్రహ్మం శ్రీకృష్ణునిగా అవతరించి, చెప్పినవి 'భగవద్గీతలు'.


ఇవి ఈ యుగానికి ఆదిలో అవతరించినవి. పైగా కనిపించిన యాదవసైన్యాన్ని కాకుండా, ఏకంగా గోచరించే పరమాత్మనే తనకు సారథిగా ఎంచుకన్న అనన్య భక్తుడు, ప్రపన్నుడు, అర్జునుడు. 'అనేకం' ప్రపంచదృష్టి - భిన్న దృష్టి. అది దుర్యోధనునిది.

ఏకం-పరమాత్మదృష్టి. అర్జునునికి ఈ దృష్టి కలిగినందుననే స్వామి ఎంతో ప్రీతితో స్వయంగా ఏకైక పరతత్త్వాన్ని బోధించాడు. జీవనరథానికి సారథ్యం వహించి సత్పథంలో నడిపి, దుష్ప్రవృత్తులను జయింపజేసి, కైవల్యమనే విజయసౌఖ్యాన్ని ప్రసాదించే పార్థసారథి బోధించినగీతలలో ప్రత్యేకత ఉంది. నిరంతరఘర్షణలతో జీవితపోరాటంలో ఈశ్వరస్పృహతో, స్వధర్మాన్ని ఆచరిస్తూనే, పరమాత్మజ్ఞానాన్ని కైవసం చేసుకొనే బ్రహ్మవిద్యామార్గమిది.

పురాతనపురాణగీతలమీదట, ఈ కృష్ణగీత - అదే సనాతన వాణిని వినిపిస్తున్నప్పటికీ, సన్నివేశసందర్భాలవల్ల గొప్ప ఔచిత్యాన్నీ, ఔన్నత్యాన్నీ సంతరించుకుంది.

బ్రహ్మానందంలో లీనమైన భాగవతులు పలికిన 'గోపికాగీతలు' వంటివికూడా మనసును భగవన్మయం చేసి, కైవల్యాన్ని కలిగించగలవు గనుకనే 'గీతా' శబ్దానికి నోచుకున్నాయి.

డిసెంబరు, 5
సుబ్రహ్మణ్యషష్ఠి
సందర్భంగా...



సుబ్రహ్మణ్యషష్ఠి

– శ్రీమతి పి. విజయలక్ష్మి

ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల రెండవ కుమారుడు సుబ్రహ్మణ్యుడు. ఇతడు మార్గశిరశుద్ధషష్ఠినాడు అవతరించినందున - ఈ షష్ఠి 'సుబ్రహ్మణ్యషష్ఠి'గా ప్రసిద్ధమై - పూజనీయమైంది. తెలుగువాళ్లు 'సుబ్బరాయుడిషష్ఠీ' అంటారు. "సుబ్బరాయుడిషష్ఠీ చూచీవద్దాం రాండీ! మా వాళ్లింట్లో పెళ్లే, మళ్లీ వద్దాం రాండి" అంటూ ఈ పండుగ బాలబాలికలకూ బాగా పరిచయమైంది.

మార్గశిరమాసం జ్ఞానమార్గాన్ని విస్తృతం చేసేది. సుబ్రహ్మణ్యస్వామి మహాజ్ఞాని. ఆధ్యాత్మికంగా, యోగశాస్త్ర పరంగా ఈ స్వామి తన ప్రత్యేకతను నిల్పుకొన్నాడు.

సుబ్రహ్మణ్యస్వామి బాలుడుగా తల్లి ఒడిలో ఉన్నాడు. అపుడు శివుడు పార్వతికి ఓంకారంయొక్కఅర్థాన్ని వివరించి చెప్పాడు. పార్వతితోపాటు బాలకుమారస్వామీ ఆ అర్థాన్ని గ్రహించాడు. కొంచెం పెద్దవాడయ్యాక ఒకమారు బ్రహ్మతో వాదోపవాదాలు జరపాల్సిన సన్నివేశం వచ్చింది. ఓంకార (ప్రణవ) మంత్రార్థాన్ని వివరించాల్సి వచ్చింది. ఆ అర్థం చెప్పమని బ్రహ్మను కుమారస్వామి అడిగాడు. బ్రహ్మ సరిగ్గా చెప్పలేకపోయాడు. అపుడు స్వామి బ్రహ్మను ఒక గృహంలో బంధించాడు. పిదప శివుడు జోక్యం చేసుకొని, కొడుకుతో చెప్పి 'బ్రహ్మబంధాన్ని' విడిపించాడు. అప్పటి నుండి కుమారస్వామి సుబ్రహ్మణ్యస్వామి – జ్ఞానవిజ్ఞాన మూర్తియై ప్రసిద్ధి కెక్కాడు.

ఈ స్వామికి కార్తికేయుడు, స్కందుడు, షణ్ముఖుడు, గుహుడు, షాణ్మాతురుడు, శరవణభవుడు, గాంగేయుడు – ఇలా ఆయా కార్యకారణాల్నిబట్టి చాలా పేర్లున్నాయి. కాళిదాసు ఈ స్వామిఅవతారం చెప్పడంకోసం "కుమార సంభవం" అనే కావ్యం వ్రాశాడు. తారకాసురవధ కుమార స్వామివల్లనే జరగాలి. అది బ్రహ్మనిర్ణయం.

సుబ్రహ్మణ్యస్వామి - సర్పరూపం

ఈ స్వామిని మూర్తిరూపంలోనే గాక – సర్ప రూపుడుగానూ పూజించే సంప్రదాయం ఉంది. యోగ శాస్త్రంప్రకారం మనశరీరంలో మూలాధారంనుండి – పైకి షట్చక్రాలున్నాయి. వాటిపైది సహస్రారచక్రం. ఈ స్వామి– ఈ చక్రాలలో కుండలినీశక్తి అనబడే సుషుమ్నానాడియే అని యోగులంటారు. అజ్ఞానదశలో మనస్సు ప్రపంచానికి అభిముఖంగా ఉంటుంది. కనుక మనోవృత్తులన్నీ ఈ సుషుమ్నామార్గంలో అధోముఖంగా వ్యాపిస్తాయి. అందువల్ల కుండలిని (పాము) యొక్క తోక మూలాధారంలోనూ, తల సహస్రారంలోనూ ఉంటుంది. అప్పుడు సర్పాకారుడైన సుబ్రహ్మణ్యుడు తనపడగను – సహస్రారకర్ణికపైనున్న శివునిపై – కల్గి ఉంటాడు. ఈ కారణంవల్లనే శివుడు నాగాభరణుడయ్యాడు. ఇందుకే శివునితోపాటు, సర్పరూపంలో ఉండే సుబ్రహ్మణ్యునికీ పూజార్హత సిద్ధించింది. ఈ సుషుమ్నా



బ్రహ్మచారిత్వం

సుబ్రహ్మణ్యుడు బ్రహ్మచారిగా ప్రసిద్ధుడు. అయినా దేవసేన, వల్లీ - ఇతని భార్యలుగా ప్రతీకపద్ధతిలో పేర్కొన్నారు. దేవసైన్యాధిపతి కనుక దేవసేనాపతి. 'వల్లి' అంటే తీగె, త్రాడు అని అర్థాలు. పురుషుణ్ణి వృక్షంగా, తీగెల్ని స్త్రీలుగా చెప్పడం కద్దు. దేవసేనలన్నీ- ఈ స్వామిని - చెట్టును తీగెల్లాగా ఆశ్రయించుకొని, అల్లుకొని ఉంటాయి కనుక 'వల్లీపతి' అనే అర్థం చెప్పవచ్చు. ఇలా ఈ రెండూ - దేవసేన, వల్లి- అనే భార్యలపేర్లకు సంకేతాలు.

నాడీరూపమైన సర్పాన్ని నియంత్రించే శక్తి గలవాడు ఈ స్వామి కనుక - పాముల్ని చంపే నెమలిని ఈయనకు వాహనంగా చెప్పాయి - పురాణాలు.

బ్రహ్మచారి పూజ

సుబ్రహ్మణ్యుడు బ్రహ్మచారి అనే భావంతో ఈ షష్ఠినాడు మంచిబ్రహ్మచారిని ఆహ్వానించి, అతణ్ణి ప్రత్యక్షసుబ్రహ్మణ్యస్వామిగానే భావించి, భగవంతుణ్ణి అర్చించినట్లే అర్చించి, నూత్న వస్త్రాలు ఇచ్చి, అతనికి సాత్త్వికపదార్థాలతో భోజనం పెట్టి, దంపతులు సాష్టాంగ నమస్కారం చేసి, అతని ఆశీస్సులు పొంది, దక్షిణ తాంబూలాలతో సత్కరిస్తారు. ఇది సాటి మానవునిలో భగవంతుణ్ణి దర్శించే ఒక గొప్పస్థితికి నాంది పల్కేపండుగ. వయస్సులో ఆ బాల బ్రహ్మచారి చాలా చిన్నవాడే అయినా - ఆ సమయంలో అతడు సాక్షాత్తు సుబ్రహ్మణ్యస్వామియే! ఇట్టిదే చండీ యాగాల్లో నిర్వహించే కుమారీపూజ కూడా! జ్ఞానప్రాప్తికీ, వంధ్యా దోషనివృత్తిద్వారా సంతానఫలప్రాప్తికీ - సుబ్రహ్మణ్యస్వామిఆరాధన మిక్కిలి దోహదం!

రైతుల దేవుడు

రైతులకు పంటలు చేతికి వచ్చే కాలం మార్గశిరం. పుష్యంకూడా. పంటపొలాల్లో ఎలుకలు పైరుకంకుల్ని, వెన్నుల్ని కొరికేస్తాయి. అందువల్ల ధాన్యం పంటభూముల్లో రాలి పోతుంది. పైరు పెరిగే సమయంలోనూ ఎలుకలు బొరియలు పెట్టి, పైరుకు పెట్టిన నీళ్లు - కాలువల్లోకి పోయేటుగా చేస్తాయి. ఇలా రైతులకు శత్రువులుగా మారిన ఎలుకలు - పాములు చంపి తినేస్తుంటాయి. అందువల్ల నీరు నిల్వడం, పైరు పెరగడం, వరివెన్నులు (కంకులు) దెబ్బ తినకుండా ఉండడం జరుగుతుంది. కనుక పాములు రైతులకు మిత్రులుగా వ్యవహరిస్తుంటాయి. సుబ్రహ్మణ్యస్వామి సర్పరూపుడు కనుక - అందుకు కృతజ్ఞతగా - ఆ స్వామిని విగ్రహరూపంలోనూ, సర్పరూపంలోనూ పూజిస్తారు - రైతులు.

కావడి మొక్కుబడి

తమిళులు ఈనాడు స్కందషష్ఠిగా - స్వామిని పూజిస్తారు. కావడికట్టి మోసుకొని - స్వామిక్షేత్రానికి వెళ్తారు. భక్తులు తమ ఇండ్లనుండో, గ్రామంనుండో ఈ కావడి మోసుకొని పోవడం ఆచారం. ఈ కావడి కుండల్ని చక్కెరతోకానీ, పాలతోకానీ నింపుతారు. మొక్కుకొన్న తీరునుబట్టి పాలకావిడి, పంచదారకావడి మారుతూ ఉంటుంది.

సుబ్రహ్మణ్యషష్ఠి - పూజించేసమయంలో ద్వైతంగా, భక్తి విషయంలో విశిష్టాద్వైతంగా, సమాధిస్థితిలో అద్వైతంగా, యోగ విషయంలో కుండలినీశక్తిగా ప్రకాశించి - ఒక సమచతురస్రంగా రూపొంది, ఉపాసకులకు చతుర్విధముక్తుల్నీ, పురుషార్థాల్నీ ప్రసాదిస్తూ - సాత్త్వికగుణఫలమైన ఆనందాన్నీ, జన్మరాహిత్యాన్నీకూడా అనుగ్రహిస్తూంది. తన షణ్ముఖత్వాన్నీ, సుబ్రహ్మణ్యత్వాన్నీ సార్థకం చేసుకొంటూ - ఇలా షష్ఠినాడుపుట్టిన సుబ్రహ్మణ్యుడు షడ్విధఫలదాత అయ్యాడు.



తి.తి.దే. ఆధ్వర్యంలో కార్తికపున్నమి రోజు (14-11-2016) న
జరిగిన 8వ విడత " మనగుడి" కార్యక్రమ మనోహర దృశ్యమాలిక



శ్రీ గోదాదేవీ అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీరంగనాయక్యైనమ:
ఓం శ్రీగోదాయై నమ:
ఓం శ్రీ విష్ణుచిత్తాత్మజాయై నమ:
ఓం శ్రీ సత్యై నమ:
ఓం శ్రీ గోపీవేషధరాయై నమ:
ఓం శ్రీ దేవ్యై నమ:
ఓం శ్రీ భూసుతాయై నమ:
ఓం శ్రీ భోగశాలిన్యై నమ:
ఓం శ్రీ తులసీకాననోద్భూతాయై నమ:
ఓం శ్రీ శ్రియై నమ: 10
ఓం శ్రీ ధన్విపురవాసిన్యై నమ:
ఓం శ్రీ భట్టనాథ ప్రియకర్త్యై నమ:
ఓం శ్రీ శ్రీకృష్ణహితభోగిన్యై నమ:
ఓం శ్రీఆముక్తమాల్యదాయై నమ:
ఓం శ్రీ బాలాయై నమ:
ఓం శ్రీ రంగనాథప్రియాయై నమ:
ఓం శ్రీ పరాయై నమ:
ఓం శ్రీవిశ్వంభరాయై నమ:
ఓం శ్రీ కలాలాపాయై నమ:
ఓం శ్రీ యతిరాజసహోదర్యై నమ: 20
ఓం శ్రీ కృష్ణానురక్తాయై నమ:
ఓం శ్రీ సుభగాయై నమ:
ఓం శ్రీ సులభశ్రియై నమ:
ఓం శ్రీ సులక్షణాయై నమ:
ఓం శ్రీ లక్ష్మీ ప్రియసఖ్యై నమ:
ఓం శ్రీ శ్యామాయై నమ:
ఓం శ్రీ దయాంచితదృగంచలాయై నమ:
ఓం శ్రీ ఫల్గున్యావిర్భవాయై నమ:
ఓం శ్రీ రమ్యాయై నమ:
ఓం శ్రీ ధనుర్మాసకృత వ్రతాయై నమ: 30
ఓం శ్రీ చంపకాశోక పున్నాగ-
మాలతీవిలసత్కచాయై నమ:
ఓం శ్రీఆకారత్రయసంపన్నాయై నమ:
ఓం శ్రీ నారాయణ సమాశ్రితాయై నమ:
ఓం శ్రీ మదష్టాక్షరీమంత్రరాజ స్థిత-
మనోరథాయై నమ:
ఓం శ్రీ మోక్షప్రదాననిపుణాయై నమ:
ఓం శ్రీ మంత్రరత్నాధిదేవతాయై నమ:
ఓం శ్రీ బ్రహ్మణ్యై నమ:
ఓం శ్రీ లోకజనన్యై నమ:
ఓం శ్రీ లీలామానుషరూపిణ్యై నమ:
ఓం శ్రీ బ్రాహ్మణ్యై నమ: 40
ఓం శ్రీ బ్రహ్మజ్ఞానిన్యై నమ:
ఓం శ్రీ అనుగ్రహాయై నమ:
ఓం శ్రీ మాయాయై నమ:
ఓం శ్రీ సచ్చిదానందవిగ్రహాయై నమ:

ఓం శ్రీ మహాపతివ్రతాయై నమ:
ఓం శ్రీ ప్రపన్నార్తిహరాయై నమ:
ఓం శ్రీ నిత్యాయై నమ:
ఓం శ్రీ వేదసౌధవిహారిణ్యై నమ:
ఓం శ్రీ రంగనాథమాణిక్యమంజర్యై నమ:
ఓం శ్రీ మంజులభాషిణ్యై నమ: 50
ఓం శ్రీ సుగంధార్థగ్రంథకర్త్ర్యై నమ:
ఓం శ్రీ రంగమంగళదీపికాయై నమ:
ఓం శ్రీ ధ్వజవజ్రాంకుశాబ్జాంక-
మృదుపాదతలాంచితాయై నమ:
ఓం శ్రీ తారకాకారనఖరాయై నమ:
ఓం శ్రీ ప్రవాళ మృదులాంగుళ్యై నమ:
ఓం శ్రీ కూర్మోపమేయపాదోర్ధ్వభాగాయై నమ:
ఓం శ్రీ శోభనపార్ష్ణికాయై నమ:
ఓం శ్రీవేదార్థభావవిదిత తత్త్వ -
బోధాంఘ్రిపంకజాయై నమ:
ఓం శ్రీఆనంద బుద్బుదాకార సుగుల్ఫాయై నమ:
ఓం శ్రీ పరమాయై నమ: 60
ఓం శ్రీ అణుకాయై నమ:
ఓం శ్రీ తేజశ్శ్రియోజ్జ్వలధృత పాదాంగుళీ -
సుభూషితాయై నమ:
ఓం శ్రీ మీనకేతనతూణీరచారుజంఘా -
విరాజితాయై నమ:
ఓం శ్రీ కకుదబ్జా సుయుగ్మాఢ్యాయై నమ:
ఓం శ్రీ స్వర్ణరంభాసక్థికాయై నమ:
ఓం శ్రీ విశాలజఘనాయై నమ:
ఓం శ్రీ పీనసుశ్రోణ్యై నమ:
ఓం శ్రీ మణిమేఖలాయై నమ:
ఓం శ్రీ ఆనందసాగరావర్త గంభీరాంభోజ -
నాభికాయై నమ:
ఓం శ్రీ భాస్వద్వళిత్రికాయై నమ: 70
ఓం శ్రీ చారుజగత్పూర్ణమహోదర్యై నమ:
ఓం శ్రీ నవవల్లీరోమరాజ్యై నమ:
ఓం శ్రీ సుధాకుంభాయత స్తన్యై నమ:
ఓం శ్రీ కల్పమాలానిభభుజాయై నమ:
ఓం శ్రీ చంద్రఖండనఖాంచితాయై నమ:
ఓం శ్రీ సుప్రవాళాంగుళీన్యస్త మహా -
రత్నాంగుళీయకాయై నమ:
ఓం శ్రీ నవారుణ ప్రవాళాభ పాణి దేశ -
సమంచితాయై నమ:
ఓం శ్రీ కంబుకంఠ్యై నమ:
ఓం శ్రీ సుచుబుకాయై నమ:
ఓం శ్రీ బింబోష్ఠ్యై నమ: 80

ఓం శ్రీ కుందదంతయుజే నమ:
ఓం శ్రీ కారుణ్యరసనిష్యందినేత్రద్వయ -
సుశోభితాయై నమ:
ఓం శ్రీ ముక్తాశుచిస్మితాయై నమ:
ఓం శ్రీ చారుచాంపేయనిభనాసికాయై నమ:
ఓం శ్రీ దర్పణాకారవిపులకపోల -
ద్వితయాంచితాయై నమ:
ఓం శ్రీ అనంతార్కప్రకాశోద్యన్మణి -
తాటంకశోభితాయై నమ:
ఓం శ్రీ కోటి సూర్యాగ్ని సంకాశ నానా -
భూషణ భూషితాయై నమ:
ఓం శ్రీ సుగంధవదనాయై నమ:
ఓం శ్రీ సుభ్రువే నమ:
ఓం శ్రీఅర్ధచంద్రలలాటికాయై నమ: 90
ఓం శ్రీ పూర్ణచంద్రాననాయై నమ:
ఓం శ్రీ నీలకుటిలాలకాశోభితాయై నమ:
ఓం శ్రీ సౌందర్యసీమాయై నమ:
ఓం శ్రీ విలసత్కస్తూరీ తిలకోజ్జ్వలాయై నమ:
ఓం శ్రీ దగద్ధగాయమానోద్యన్మణి-
సీమంతభూషణాయై నమ:
ఓం శ్రీ జాజ్జ్వల్యమానసద్రత్న -
దివ్యచూడావతంసకాయై నమ:
ఓం శ్రీ సూర్యార్ధచంద్ర విలసద్
భూషణాంత వేణికాయై నమ:
ఓం శ్రీ నిగన్నిగద్రత్న పుంజ ప్రాంత-
స్వరనిచోళికాయై నమ:
ఓం శ్రీ సద్రత్నాంచిత విద్యోత విద్యుత్ -
పుంజాభ శాటికాయై నమ:
ఓం శ్రీ అత్యర్కానల తేజోఽధిమణి
కంచుకధారిణ్యై నమ: 100
ఓం శ్రీ నానామణిగణా కీర్ణ హేమాంగద -
సుభూషితాయై నమ:
ఓం శ్రీ కుంకుమాగరుకస్తూరీ దివ్య -
చందనచర్చితాయై నమ:
ఓం శ్రీ స్వోచితౌజ్జ్వల్య వివిధ-
విచిత్ర మణిహారిణ్యై నమ:
ఓం శ్రీ అసంఖ్యేయ సుఖస్పర్శ-
సర్వాతిశయ భూషణాయై నమ:
ఓం శ్రీ మల్లికా పారిజాతాది దివ్యపుష్ప -
స్రగంచితాయై నమ:
ఓం శ్రీ రంగనిలయాయై నమ:
ఓం శ్రీ పూజ్యాయై నమ:
ఓం శ్రీ దివ్యదేశసుశోభితాయై నమ: 108



బర్డు ఆసుపత్రి (తిరుపతి)లో దివ్యాంగులతో దీపావళి సంబరాల్లో పాల్గొన్న
తి.తి.దే ధర్మకర్తల మండలి అధ్యక్షులు, శ్రీ కార్యనిర్వహణాధికారి



కాలినడక దారి భక్తులకోసం నూతనంగా ప్రారంభించిన "దివ్యదర్శనం"

'తిరుప్పావై' అవతరించిన విశిష్టక్షేత్రం శ్రీవిల్లిపుత్తూరు. ధనుర్మాసం వస్తే చాలు దక్షిణభారతదేశంలో లక్షలాది పెదాలమీద తెల్లవారుజామున భక్తిప్రపత్తులతో వినిపించే ఈ దివ్యప్రబంధం ఒక తమిళరచన అయినప్పటికీ ఎంతో ప్రాచుర్యం, ప్రాశస్త్యం పొందింది. భగవంతుణ్ణే మగనిగా భావించిన/పొందిన ఒక ధన్యురాలిఆరాధనకు ఆనవాలుగా నిలిచింది.

ఆ భక్తురాలే 'ఆండాళ్'.

'గోదాదేవి', 'ఆముక్తమాల్యద', 'శూడికొడుత్తనాచ్చియార్' అనే పేర్లు కలిగిన మహాభక్తురాలు జన్మించిన శ్రీవిల్లుపుత్తూరు నేటికీ ఒక దివ్యక్షేత్రంగా అలరారుతోంది. ఈ ధనుర్మాసం సందర్భంగా 'తిరుప్పావై' విశిష్టతను, అది ఆవిర్భవించిన శ్రీవిల్లిపుత్తూరు పూర్వాపరాలను, ఆండాళ్ కోవెలగాథలను ఈ వ్యాసం ద్వారా అందిస్తున్నాం.



ఓ పూబాల భక్తిమాల

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు
99896 79681

శ్రీవిల్లిపుత్తూరు తమిళనాడు రామనాథపురం జిల్లాలోని ఒక తాలూకాకేంద్రం. ఒకప్పటి పాండ్యరాజ్యంలోని పురాతనక్షేత్రాలలో ఇది ప్రముఖమైంది. ప్రాచీనమైంది. చెన్నై - త్రివేంద్రం రైలు మార్గంలో ఉన్న శ్రీవిల్లిపుత్తూరు 'విరుధనగర', 'తెంకాసి' రైల్వే జంక్షన్‌ల మధ్యలో వస్తుంది. ఈ ఊరికి ముందు శివకాశి, రాజపాళెం రైల్వేస్టేషన్లు ఉన్నాయి. మధుర, రాజపాళెం, శివకాశీల నుంచి బస్సులోకూడా వెళ్లవచ్చు.

మంగళకరమైన ఊరు

శ్రీ-విల్లి-పుత్తు-ఊరు అనే నాలుగుపదాలు చేరి, శ్రీవిల్లి పుత్తూరు అయింది.శ్రీ= సంపద్యుక్తమైన/ శుభకరమైన/ మంగళకరమైన, విల్లి= ఉపవాసాలతో, పుత్తు=కొత్త, ఊరు=గ్రామం. అనగా మంగళకరమైన ఉపవాసాలతో కొత్తగా అలరారేగ్రామం అని అర్థం. ఈ స్థలానికి 'శ్రీ' చేర్చి పల్కటం ఇక్కడ ఆండాళ్ నెలకొని ఉండటంవల్లేకావచ్చు. నూటఎనిమిదిదివ్యతిరుపతులలో దాదాపు తొంభై పైవాటికి 'తిరు' శబ్దం చేర్చి వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు తిరుమలై, తిరుక్కణ్ణపురం.... అయితే కొన్నిదివ్యదేశ నామాలకు ముందు శ్రీ శబ్దంకూడా చేర్చారు. ఉదాహరణకు శ్రీరంగం, శ్రీవిల్లిపుత్తూరు. వీటిలో శ్రీరంగాన్ని 'తిరువరంగం' అనీ, శ్రీవైకుంఠాన్ని 'తిరువైకుంఠం' అనీ వ్యవహరించటంకూడా ఉంది. కానీ "శ్రీవిల్లిపుత్తూరు" అని మాత్రమే పిలవడం, పేరుకు ముందు 'తిరు' చేర్చకపోవడం గమనించాల్సిన విశేషం.

చీమలకొండ

శ్రీవిల్లిపుత్తూరుకు 'పుదూవై పుత్తూర్' లేదా 'వల్మీకపురం' అనే పేర్లుకూడా ఉన్నాయి. 'పుత్తూర్' అంటే తమిళంలో చీమలకొండ అనే అర్థం కూడా ఉంది. పూర్వంనుండి ఆలయం చుట్టూ చీమలకొండ ఉండడం వల్ల అక్కడి పుత్తూర్‌కు విల్లిపుత్తూర్ అనే పేరు వచ్చిందని అంటారు. అలాగే 'వల్మీకపురం' అన్నా చీమలకొండ అనే అర్థం వస్తుంది.

ఆండాళ్‌కు ముందు.....

శ్రీవిల్లిపుత్తూరు ఎందరో మహానుభావులకు జన్మస్థలం. మండూక మునిగా వ్యవహరింపబడ్డ శికప్ప అనే ముని ఇక్కడ నివసించాడు. 'గోరకర్‌విప్పు' అనే ప్రసిద్ధ వైద్యగ్రంథాన్ని రచించిన గోరకమహర్షి అనే సిద్ధుడు ఇక్కడికి సమీపంలో ఉండే అళఘర్ కొండలలోను చాలాకాలం నివసించాడు. ఇక్కడే జన్మించిన 'తిరుజ్ఞానసంబంధార్' అనే మహానుభావుడు ఆ తర్వాత శివసిద్ధాంత జ్ఞానపీఠాన్ని స్థాపించాడు. పొన్నాయిరస్వామి, అరుముగతంబిరాన్‌స్వామి, కైలాససుందరస్వామి, ముక్తానందస్వామి, మొదలైన మహాత్ములు ఈ పట్టణంలో నివసించారు.

వటపత్రశాయి దేవాలయం

శ్రీవిల్లిపుత్తూరులోని ప్రధానదేవాలయాలు రెండు. మొదటిది జగద్విత మైన 'ఆండాళ్‌కోయిల' అయితే - రెండవది వటపత్ర

శాయిదేవాలయం. ఈ దేవాలయగోపురమే తమిళనాడురాష్ట్ర ప్రభుత్వచిహ్నం.

వటపత్రశాయి దేవాలయాన్ని స్థానికులు 'పెరియ పెరు మాళ్ల కోవెల' అని పిలుస్తారు. బ్రహ్మాండమైన ఈ ఆలయగోపురం పదకొండు అంతస్థులతో, నూటతొంభైయారు అడుగుల ఎత్తు ఉంటుంది. గోపురం అగ్రభాగంలో పదకొండుకలశాలు ఉన్నాయి. మధురను పాలించిన వల్లభదేవపాండ్యుడు (నెడుమారన్) ఈ ఆలయగోపురాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. తమిళ మహాకవి కంబడు ఈ ఆలయగోపురాన్ని మహామేరుపర్వతంతో పోల్చాడు. అలా వర్ణించినపద్యం గోపురానికి దక్షిణంవైపున అడుగున ఉండే రాతిపై చెక్కబడింది. కంబకవి ఈ ఆలయంలో వెలసిన దైవానికి చూడారత్నాన్ని బహూకరించినట్లు చెప్తారు.

ఆండాళ్ కోవెల

ఆండాళ్‌కోవెల వటపత్రశాయి ఆలయానికన్నాకూడా పెద్దది. ఇదికూడా తూర్పుముఖంగా ఉంది. ఆలయంలోని స్తంభాలన్నీ అతిబలిష్ఠంగా ఉంటాయి. ప్రతిశిలాస్తంభం రమణీయశిల్పాలతో నిండి ఉంటుంది. వేణుగోపాల, రామలక్ష్మణ, మన్మథ, పరమ శివ, విశ్వకర్మ, సరస్వతి మొదలైన మూర్తులు ఈ శిల్పాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా సరస్వతీశిల్పం విశేషంగా ఆకర్షిస్తుంది.

ఆండాళ్ కోవెలలో మూడుపుష్కరుణులు ఉన్నాయి. వాటిలో ఒకటి 'దర్పణతీర్థం' అని పిలువబడుతోతంది. ఇది ప్రఖ్యాతమైన పుష్కరిణి. తులసీమాల ధరించిన ఆండాళ్ ఈ తీర్థంలో తన ప్రతి బింబం చూసుకొనేది. ఈ పుష్కరణిలో చేపలు, కప్పలు మొదలైన జలచరాలు ఉండకపోవడం మరోచిత్రం. మరొక పుష్కరణి పేరు 'చందనకినరు'. దీనికే 'గరుడతీర్థం' అని కూడా పేరు. మరొక పుష్కరణి పేరు 'తిరుమాడ పుల్లి కినరు'. దీనిలోని జలాలను పెరుమాళ్లకు సంబంధించిన వంటలకు ఉపయోగిస్తారు. దీన్నే 'వాసుకితీర్థం' అని కూడా అంటారు.

ఇదే ఓంకారం

ఆండాళ్ గర్భాలయంలో రంగమన్నార్, ఆండాళ్, గరు త్మంతవిగ్రహాలు మూడూ ఒకే సింహాసనంమీద దర్శనమివ్వటం మరో విశేషం. రంగమన్నార్ మధ్యలో ఉండగా వారికుడివైపు ఆండాళ్, ఎడమవైపు గరుత్మంతుడు దర్శనమిస్తారు. వారు ప్రణవ రూపంగా దర్శనమిస్తారు.

వేదాంతులు రంగమన్నార్, ఆండాళ్, గరుడులను ఈశ్వర, ప్రకృతి, చేతనులుగా చెప్తారు. ఇదే తత్త్వత్రయం. వైష్ణవసిద్ధాంతం. గరుడుడు చిత్, రంగమన్నార్ ఈశ్వరుడు, ఆండాళ్ చిత్తు. ఇక్కడి రంగమన్నార్ మూర్తిహస్తాలలో శంఖచక్రాదులు కాకుండా రాజ దండం ఉంటుంది. ఆండాళులతో సమానంగా దర్శనమిచ్చేస్థాయి ఇక్కడి గరుడునికి లభించింది.



చేతిలో చిలుక..

ఆండాళ్ రచించిన కృతులలో 'నాచ్చియార్ తిరుమొళి' ఒకటి. అందులో పెరుమాళ్లుచెంతకు తన ప్రేమసందేశాన్ని ఆండాళ్ ఒక కోకిలతో పంపిస్తుంది. ఆ సందేశంలో తన చిలుకను చెలికానికి బహూకరిస్తానని మాట ఇస్తుంది. దీన్ని గుర్తు చేసుకునేందుకే ఆండాళ్ ఎడమచేతిపై ఒక చిలుకను ఉంచుతారు. ఇలా చిలుకను తయారు చేసి, ఆండాళ్ ఎడమచేతిలో ఉంచే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఒక కుటుంబం వాళ్లు తరతరాలుగా చేస్తున్నారు. ఈ చిలుకను మరుసటి రోజు భక్తులకు అనుగ్రహిస్తారు. ఆండాళ్ దాల్చిన చిలుక లభించటం భక్తులుకు పరమానుగ్రహం.

పాయసంకథ

ఆండాళ్ ఒకసారి తిరుమాలిరుంజోలైలో వెలసిన అళఘర్‌కు శత భాండముల పాయసం నైవేద్యంగా సమ ర్పిస్తానని మాట ఇచ్చిందట! అయితే ఆమె ఆ మాటను మరచిపోయింది. ఆండాళ్ అనంతరం జన్మించిన రామానుజులవారికి ఈ విషయం తెలిసి ఆయన తిరు మాలిరుంజోలై అళఘర్‌కు ఆండాళ్ మొక్కుబడిని చెల్లిం చారు. తర్వాతికాలంలో ఆయన శ్రీవిల్లిపుత్తూరుకు వెళ్లినప్పుడు తాను మరచిపోయిన తన మొక్కుబడిని చెల్లించిన ఆయనను అమితానందంతో ఆహ్వానించేందుకు ఆండాళ్ గర్భగృహంనుంచి అర్ధమండపం వరకు బయటకు వచ్చింది. అప్పటినుండి ఆండాళ్‌ఉత్సవవిగ్రహం మూలస్థానం లోనే కాక అర్ధమంటపంలోనే ఉంచుతున్నారు.

తీర్థాలు తటాకాలు

శ్రీవిల్లిపుత్తూరులో పవిత్రతీర్థాలు, తటాకాలు అనేకం ఉన్నాయి. కన్నడితీర్థం, చక్రతీర్థం, తిరుప్పర్ కడల్‌తీర్థం, తిరుముక్కులం(తిరువేణి/ త్రివేణి) తీర్థం. మండూక నది (నూపురగంగాతీర్థం), కణ్వతీర్థం, పంచతీర్థాలు మొదలైన ఎన్నో తీర్థాలు ఇక్కడ వెలిశాయి. ఈ ఆలయచరిత్రను తెలియజేసే శిలాశాసనాలు అక్కడ చాలా ఉన్నాయి.

పెరియాళ్వార్ - ఆండాళ్

వైకుంఠంలో ఒకరోజు నారాయణుడు యోగనిద్ర నుంచి మేల్కొంటాడు. అప్పుడు భూదేవి "భూలోకంలో ఎవర్ని ఎక్కువగా ప్రేమిస్తా" వని నారాయణుణ్ణి అడుగుతుంది. "నిష్కామ భక్తితో వాంఛారహితులైనవారిని ఎక్కువగా ప్రేమిస్తా" నని పెరుమాళ్లు చెప్పాడు. అప్పుడు భూదేవి 'తనకు భూలోకంలో అవతరించే అవకాశాన్ని కల్పించ' మని, పెరుమాళ్లసేవను, భగవత్సంకీర్తనను చేసుకుంటూ ఉండేటట్లు అనుగ్రహించ' మని అర్థిస్తుంది. పెరుమాళ్లు ఆమెకోరికను అనుగ్రహిస్తాడు. అప్పుడు ఆమె విష్ణుచిత్తునికి పూలతోటలో లభిస్తుంది ఆయన ఆనందానికి అవధులు ఉండవు. ఆయన ఆ బిడ్డకు 'కోద్ై' అని నామకరణం చేస్తాడు. 'కోద్ై' అంటే 'అందాల పుష్పసరం' అని అర్థం.

విష్ణుచిత్తుడు ఆమెను పవిత్రమైన, శక్తిమంతమైన వాతావరణంలో– శ్రీకృష్ణుని గాథలను వినిపిస్తూ పెంచుతాడు. ఆమె పెరియాళ్వారుకు పూలు సమకూర్చటం, అల్లటం, తులసిని సేకరించటం మొదలైన మాలాకైంకర్యాల్లో సహకరిస్తుంది. ఆ బాలిక దినదినాభివృద్ధి చెంది, యుక్తవయసుకు చేరుకుంటుంది. పెరుమాళ్లను తప్ప ఇతరులను పెళ్లాడరాదని నిశ్చయించుకుంటుంది. విష్ణుచిత్తుడు పూలబుట్టలను ఇంట్లో ఉంచి, వాటిల్ని సాయంకాలం ఆలయానికి తీసుకువెళుతుంటాడు. ఆ పూలను మాలికగా గుచ్చి, ఆండాళు అలంకరించుకొని, దర్పణతీర్థంలో తనప్రతి బింబాన్ని చూసుకొని, తాను పెరుమాళ్లకు సరైన జోడో, కాదో ఊహించుకుంటూ ఉంటుంది. ఆమె ప్రతిరోజూ తాను ధరించిన పూలమాలను తన మేనినుండి జాగ్రత్తగా విడదీసి, తన తండ్రికి తెలియకుండా వాటిల్ని పెరుమాళ్ల సన్నిధికి తీసుకు వెళ్లే పూలబుట్టలో పెడుతుంటుంది. ఒకరోజు విష్ణుచిత్తుడు ఇంటికి తొందరగా రావడంవల్ల ఆండాళ్ చేస్తున్న పనిని చూస్తాడు. ఆ పూలు పెరుమాళ్లకు సమర్పించేం దుకు పనికిరావని వేరే పూలు సేకరించేందుకు సమయం చాలక ఆ రోజు పెరుమాళ్లకు పుష్పకైంకర్యం చేయడు.

ఆ రాత్రి విష్ణుచిత్తునికి పెరుమాళ్లు స్వప్నదర్శనమిచ్చి, పుష్పకైంకర్యంలో ఎందుకు విఫలమయ్యావని అడుగుతాడు. విష్ణుచిత్తుడు తన కూతురు చేసిన పనివల్ల సమయానికి పూలు సమర్పించలేని పరిస్థితి ఏర్పడిందని విన్నవిస్తాడు. అప్పుడు పెరుమాళ్లు కోద్ై ధరించిన పూలంటే తనకు ఇంతో ఇష్టమనీ, అవి ధరించటం తనకు మధురానుభూతిని కలిగిస్తుందనీ చెప్తాడు. ప్రతిరోజూ కూడా కోద్ై ధరించిన తర్వాతనే ఆపూలను తన సేవకు తేవలసిందిగా పెరుమాళ్లు పెరియాళ్వారును ఆజ్ఞాపిస్తాడు. విష్ణుచిత్తుడు తన కూతురు గొప్పతనాన్ని గ్రహిస్తాడు. ఆమె అప్పటినుంచి చూడి కుడుత నాచ్చియార్/ ఆముక్తమాల్యదగా పిలువబడుతుంది. శ్రీరంగనాథుణ్ణి వివాహమాడుతానని పట్టుపడితే పెరియాళ్వారు అందుకు ఒప్పుకుంటాడు.

వరాహక్షేత్రం

శ్రీవిల్లిపుత్తూరునే వరాహక్షేత్రం అని కూడా అంటారు. ఒకానొక సమయాన హిరణ్యాక్షుడు ఇక్కడ నివసించిన మునులను చాలా ఇబ్బందులకు గురిచేశాడట. అతడు భూమిని చుట్టగా చుట్టి, సముద్రంలో వేయ బోయాడట. అప్పుడు పెరుమాళ్లు వరాహావతార మెత్తిభూమిని రక్షించాడట. అంతేకాదు భూదేవి కోరికమేరకు వరాహస్వామిగా తదనంతర కాలంలోకూడా భక్తులకు దర్శనమిచ్చేందుకు ఇక్కడే నెలకొన్నాడట. అందువల్ల ఈ స్థలానికి వరాహక్షేత్రం అనే పేరు వచ్చిందని చెబుతారు.

ఇంకో కథ........

కాలనేమి అనే రాక్షసుడు ఇక్కడిమునుల ధ్యానానికి భంగం కలిగిస్తూ ఉండేవాడు. ఆ మునులు నారాయణునికి తమఆర్తిని వినిపిస్తారు. నారాయణుడు తన శక్తిమంతమైన సుదర్శనచక్రాన్ని కాలనేమిని చంపేటందుకు వదులుతాడు. అది కాలనేమిని సంహరిస్తుంది. దానికి రక్తం అంటడంవల్ల నారాయణుడు వరుణుణ్ణి, గంగా యమునాసరస్వతులను ఈ స్థలానికి చేరుకోవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు.

అప్పుడు ఆ మూడునదులు ఒక తటాకంలోకి వేం చేస్తాయి. ఈ తటాకం గట్టుపై ఉత్తరాభిముఖంగా సుదర్శనపెరుమాళ్లవిగ్రహం నేడు కూడా దర్శనమిస్తుంది. కాలనేమిసంహారం అనంతరం భక్తులకోరికమేరకు సుదర్శన పెరుమాళ్లు ఇక్కడ అర్చామూర్తిగా వెలశాడని చెప్తారు. పెరుమాళ్లు ఇక్కడ వటవృక్షంకింద శయన మూర్తిగా దర్శనమిస్తాడు. ఆయన వటపత్రశాయిగా ప్రఖ్యాతుడు కాగా ఆ స్థలం వటేశ్వర పురంగా కూడా పిలువబడుతోంది.

ఒకరోజు శ్రీరంగనాథుడు విష్ణుచిత్తునికి స్వప్నసాక్షాత్కార మౌతాడు. ఆండాళ్‌ను శ్రీరంగానికి తోడ్కొని రమ్మని సెలవిస్తాడు. అదే సమయంలో శ్రీరంగంలోకూడా ఆలయార్చకునికి స్వప్నంలో కనిపించి, శ్రీవిల్లిపుత్తూరుకు ఛత్రం, వాలు, వెండి బెత్తాలతో వెళ్లి, ఆండాళును రాజగౌరవలాంఛనాలతో తీసుకరమ్మని ఆజ్ఞాపిస్తాడు. శ్రీరంగపరివారం శ్రీవిల్లిపుత్తూరుకు వెళ్లి, పెరియాళ్వారుకు ఈ సందేశం తెలియజేస్తారు. ఆండాళును పల్లకిలో ఊరేగింపుగా శ్రీరంగానికి తీసుకువెళతారు. ఎంతో ఆడంబరంగా పవిత్ర కాహలాదిశబ్దాలతో ఆండాళ్ సపరివారంగా రంగరంగవైభవంగా శ్రీరంగం చేరుకుంటుంది.

శ్రీరంగనాథుడు ఆండాళ్‌ను పాణిగ్రహం చేసేందుకు తన సంసిద్ధతను తెలియజేస్తాడు. పెరియాళ్వారులు మహానందభరిత దవుతాడు. ఆయన వారిపరిణయం శ్రీవిల్లిపుత్తూరులో సంప్రదాయ బద్ధంగా అందరూ తిలకించేటట్లు జరగాలని శ్రీరంగనాథునితో విన్నవిస్తాడు.

శ్రీవిల్లిపుత్తూరులో వివాహానికి అన్నీ సిద్ధం చేయబడుతాయి. శ్రీరంగంనుంచి శ్రీరంగనాథులరాకకు అందరూ ఎదురుచూస్తుం టారు. అయితే రంగనాథుడు వస్తున్న చిహ్నాలు ఏవీ కనిపించవు. ఆండాళ్ చాలా బాధపడుతుంది. ముహూర్తానికి ముందే రంగ నాథుణ్ణి తోడ్కొని రావలసిందని గరుత్మంతుణ్ణి అభ్యర్థిస్తుంది. గరు డుడు అలా చేస్తే ఆయనకు శ్రీరంగనాథ ఆండాళులతో సమాన స్థానం కల్పిస్తానని తెలియజేస్తుంది. గరుడుడు శ్రీరంగనాథునితో సుమూహూర్తసమయానికి శ్రీవిల్లిపుత్తూరుకు చేరుకుంటాడు. శ్రీరంగనాథ-గోదాదేవీ పరిణయోత్సవం వైభవంగా జరుగుతుంది. శ్రీరంగనాథుని ఎడమవైపు గరుడుడు, కుడివైపు ఆండాళమ్మ ఉండే విగ్రహాలు నేడుకూడా శ్రీవిల్లిపుత్తూరులో దర్శనమిస్తున్నాయి.

తిరుప్పావై

మగువలు మంచిమగడు లభించేందుకు చేసే నోముకు సంబంధించిన రచన తిరుప్పావై. దీనిలోని ప్రతిపాశురం చివరన 'పావై' అని ఉంటుంది. పావై అంటే నోము, పాట అనికూడా అర్థం ఉన్నట్లు చెప్తారు. కనుక ఈ రచనకు 'పావై' అనేపేరు సార్థకం. 'తిరు' శ్రేష్ఠవాచకం. కనుక తిరుప్పావై అనే పేరు రూఢి కెక్కింది. రాధ, గోపికలు, జయదేవుడు, అన్నమయ్య, మీరాబాయి మొదలైనవారు మధురభక్తికి ఆదర్శమూర్తులు. ఆ పరంపరలోని ప్రముఖులలో ఆండాళ్‌కూడా సముచితస్థానాన్ని సంతరించుకుంది.

తిరుప్పావైని నిశితంగా పరిశీలిస్తే ఈ కావ్యం అకస్మాత్తుగా అవతరించింది కాదని అవగతమవుతుంది. ఉన్నతమైన వేదాంత గ్రంథంగా దర్శనమిస్తుంది. నిశితపరిశీలకుడైన పాఠకునికి ఈ చిన్ని కవ్వపుపాలకడలిలో అద్భుతమైన అమూల్యరత్నాలు అగుపి స్తాయి. అవి అందమైన నవ్యకాంతుల్ని ప్రసరిస్తాయి. తిరుప్పావై రచన చాలాసరళంగా ఉంటుంది. వైష్ణవానికి సంబంధించిన మౌలికభావాలు దీనిలో విశదీకరించబడ్డాయి.

ఈ కృతిలో అలంకారం, అర్థసంపద, జ్ఞానోదయవిధానం, స్పష్టత, సహజత్వం, రమణీయత, సారళ్య కవితామాధుర్యం ప్రతి పదంలోనూ పదిలంగా ఉండి, మదికి పారవశ్యం కలిగిస్తాయి. తిరుప్పావైని స్థూలదృష్టితో నాలుగుభాగాలుగా వింగడించవచ్చు. 1 నుంచి 5 పాశురాలు ప్రకృతి పరిచయం, 6 నుంచి 15 దాకా గోపికలను మేల్కొల్పటం, 16- 20 దాకా సంఘటనలు, 21- 30 మధ్య శరణాగతి. చివరి పది పాశురాలలో శరణాగతితత్త్వం చెప్పబడింది. 26, 27, 29 పాశురాలు చాలా ప్రాముఖ్యత కలవి. 29వ పాశురం వైష్ణవదర్శనసారంగా దర్శనమిస్తుంది.

రామానుజులు, వేదాంతదేశికులు, మణవాలమహా మునులు మొదలైన గొప్ప గొప్ప వైష్ణవాచార్యులు తిరుప్పావై ప్రబంధాన్ని అత్యంతపరవశంతో గానం చేశారు. రామా నుజులవారికైతే 'తిరుప్పావై జీయర్' అనే పేరుకూడా ఉంది. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన సంఘటన ఉంది. ఆయన తిరుప్పావైని గానం చేస్తూ మార్గళిలో ప్రతినిత్యం భిక్షకు వెళ్లేవాడట. ఓ రోజు తన గురువైన మహాపూర్ణులు (పెరియనంబి) ఇంటికి అలాగే వెళ్లి తిరుప్పావై గానం చేస్తూ 18వ పాశురాన్ని పాడారట! అప్పుడు పెరియ నంబిగారి తిరుమాళిగ(ఇంటి) తలుపులు మూసి ఉన్నాయి. పాశురంలో తలుపులు తెరువమని కోరటం ఉంది. సరిగా ఆ సమయానికి పెరియనంబికూతురు తలుపులు తెరిచింది. అప్పుడు రామానుజులవారు ఆమెను నీళాదేవిగా భావించి, పరవశంతో ఆ పాశురాన్ని మళ్లీ గానం చేశారు. ఆ సంఘ టనకు గుర్తుగా తిరుప్పావైలోని 18వ పాశురాన్ని నేటికీ రెండుపర్యాయాలు గానం చేస్తారు.

రామానుజులవారు తిరుప్పావైని తిరుమలలోని శ్రీని వాసుని సన్నిధానంలో అధ్యయనం చేసే నియమం చేశారు. వేదాంత దేశికులు తిరుప్పావైకి పరవశించి, స్పందించి గోదాస్తుతిని రచించారు. మణవాల మహా మునులవారు తాను రచించిన 'ఉపదేశరత్నమాలై' అనే రచనలో ఆండాళమ్మను ఆళ్వారులు అందరిలోనూ ప్రముఖమైనవ్యక్తిగా వినుతించారు.



కైంకర్యమే.. తనువు దాల్చితే....

8

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478




(జరిగిన కథ - రామానుజులు కాంచీపూర్ణుని మహత్త్వాన్ని గుర్తించి తనను శిష్యునిగా స్వీకరించమని వారిని వేడుకుంటు న్నారు. కాంచీపూర్ణులు కాదు, కూడదు అంటున్నారు.)

నంబి - "నాయనా! రామానుజా! నీవు అగ్రవర్ణబ్రాహ్మ ణుడివి. నేను అబ్రాహ్మణుణ్ణి. నీవు మేధావివి. సకలశాస్త్రపారంగ తుడవు. నేను శాస్త్రజ్ఞానం లేనివాణ్ణి.

ఏ తీరులో చూచినా నీకు ఆచార్యుణ్ణయ్యే అర్హత లేనివాణ్ణి" అన్నారు.

రామానుజులు - "ఆచార్యవర్యా! మీకు చెప్పగలిగేంతటి వాణ్ణి కాను. కానీ నా విన్నపం ఆలకించండి.

భగవంతునిదృష్టిలో సమస్తమానవులు సమానులు. వారి జననమరణాలు, ప్రకృతిధర్మాలు ఒక తీరువే - నడిమినాలుగు నాళ్లే మిడిసిపాటు. వర్ణాశ్రమధర్మాలు మానవుడు సామాజిక జీవితంకోసం ఏర్పరచుకున్నవి. పుట్టుకలో మానవులందరూ సమానులే".



"చాతుర్వర్ణ్యం మయాసృష్టం। గుణకర్మవిభాగశః" - అనింది గీత (4-13). కాబట్టి ఆచార్యులు కావడానికి పుట్టుకతో వచ్చిన వర్ణం అడ్డు, ఆటంకం కాబోవు. జీవితాన్ని జయించిన వాళ్లకు మేధ - ఆలోచనలతో నిమిత్తం లేదు. మీరు అన్నింటికీ అతీతులు. అదే మీ ఆచార్యత్వానికి అర్హత! శాస్త్రం మార్గంమాత్రమే! గమ్యం - లక్ష్యం కాబోవు. ఆచరణవల్ల జ్ఞానం కలుగుతుంది. కానీ, జ్ఞాని కాజాలదు.

సత్యమైన పరమాత్మను తెలిసి, తనను స్వామికి అర్పించు కొనేవాడే జ్ఞాని. తాము జ్ఞానులకు అతీతులు. భగవంతుని సాన్నిహిత్యం - సంబంధం గలవారు. అది మీకు మకుటప్రాయం. స్వామీ! నాలోని చీకటిని పోగొట్టండి. వెలుగును ప్రసాదించండి.

చీకటి జడం. కాంతి చైతన్యం. ఒకటి మృత్యువు, ఒకటి సృష్టి. స్పష్టమైన సృష్టిని మ్రింగేయాలని మృత్యువు యత్నిస్తుంది. మృత్యువును గెలవాలని సృష్టి సమరం సాగిస్తుంది. చీకటి నలుపు రంగుకు ప్రతీక. విశ్వశ్రేయానికి విరుద్ధమైన భావం చీకటి; అభ్యు దయానికి అవరోధంగా నిలిచేది తిమిరం. ప్రకృతిలో కనబడే వికృతి తిమిరం. ప్రకృతికి విరుద్ధమైన వికృతి ప్రకృతిలోనే పుడుతుంది. వేరుపురుగులా దాన్ని తొలుస్తుంది. సమూలనాశనానికి దారి తీస్తుంది. వికృతికి విరుగు పెట్టటమే సమరం. అదే వెలుగు చీకటిని వెన్నాడి తరుముతుంది. కాంతి విశ్రాంతికి చిహ్నమవుతుంది. విచిత్ర మేమిటంటే వెలుగునీడలోనే తిమిరం నిలవ్వచ్చు. తన నీడనుకూడా తలదన్ని నిలిచే వెలుగే అమరం. అందుకే అమరులకు కనురెప్పపాటు లేదంటారు. చివరకు నీడకూడా పారదంటారు.

మన జీవితం సాధించే చివరి మెట్టు అమరత్వం. అమ రత్వం అనవరత సమరసంకేతం. చీకటితో చేసిందే సమరం.

తిమిరమంటే అజ్ఞానం కావచ్చు. అహంకారం కావచ్చు. నిర్దయ కావచ్చు! పారతంత్ర్యం కావచ్చు. శత్రువ్యూహం కావచ్చు! ద్రోహం కావచ్చు. వేదనకావచ్చు. ఇలా ఏకాలంలో, ఏప్రాంతంలో ఏవిధంగా పొటమరించినా దాంతో సమరం చేయడమే కాంతికిరణానికి లక్షణం.

అలాంటి కాంతికిరణాలు చీకటిలో ఉన్న నాపై ప్రసరింపజేసి, నాకు మనశ్శాంతిని ప్రసాదించండి. శాంతికి సమత తల్లి! సౌహార్దం తండ్రి, సౌహార్దం హార్దికం. మహాలోకంలో మనలేని సమత జీవితంలో మనుగడ సాగించడం కల్ల. సమసమాజం మనం సాధింపదలచుకున్న ఒక మహత్తరలక్ష్యం. ఆ వైపు నా పయనం ఆగకుండా సాగాలి, సాగుతూనే ఉండాలి.

ఆ పయనంలో ప్రభవిల్లిందే శాంతి. సహజీవన సమతాభావాలకు సౌహార్దం పాదు. అందుకే అది శాంతికి తండ్రి. తండ్రి భావ రూపుడు. తల్లి భౌతికరూపం. తల్లిదండ్రుల లక్షణాలను ముద్రించుకొన్న ఉభయరూపం శాంతి. ప్రగతి శాంతిప్రవృత్తి. అఖండంగా నిలిచే శాంతి అనంతమైన విశ్వచైతన్యానికి జీవమని సంభావించడం, తేజస్సు తపస్సుగా భావించే మనీషుల లక్షణం! తేజస్సు తపస్సైతే కాంతి శాంతి!

అలాంటి కాంతితో కూడిన శాంతి నాకు కావాలి. ఇంత వరకూ నా జీవితంలో ఎదురైన ఎన్నో సంఘటనలు మీకు తెలుసు. మనం సాగిస్తున్న ఈ జీవనయాత్ర ఎంత సుందరమైందో అంత కష్టతరమైంది కూడా! పుట్టిన దగ్గరనుంచీ – ఎన్నెన్ని అనుభవ పరంపరలు! మరింకెన్నెన్ని అనుభూతుల స్పర్శలు! కొన్ని గుచ్చుకొని బాధించే ముళ్లు – మరికొన్ని అప్పుడే రేకలు విచ్చుతున్న పుష్పాలు వచ్చి చల్లగా తాకినప్పటి మృదులస్పర్శలు.

చల్లదనాన్ని ఆస్వాదించడానికి మనకు ఏ తోడూ లేకపోయినా పరవాలేదు. కానీ ముల్లు గుచ్చుకొన్నప్పటి కరకుబాధ ఉందే – దాన్ని ఓర్చుకోవడంమాత్రం మన ఒక్కరివల్లకాదు! ఏ మూల నుంచో ఒక ఆపన్నహస్తం వచ్చి ఆదుకోవాలి!

పళ్ల బిగువున మనం అనుభవిస్తున్న బాధకు మరే ప్రక్క నుంచో ఒక ఉపశమనమంత్రం వచ్చి మన చెవిలో వినిపించాలి. వచ్చిపడిన కష్టం ఎంతటిదైనా దాని తీవ్రతను ఎంతో కొంత తగ్గించి, మనకు సాంత్వనం కూర్చే కారుణ్యమయహస్తస్పర్శ వచ్చి, మనల్ని చల్లగా తాకాలి.

కష్టసమయంలో మనం ఆశించే ఈ తోడ్పాటు ఏ దిశనుంచి వస్తుంది? మనకు అయినవాళ్లెవరో వచ్చి మనల్ని ఆదుకోవాలి. సాధారణంగా మనకు రక్తసంబంధీకులైన బంధువులో, మనకు మానసికబంధంతో చేరువైన ఆప్తమిత్రులో అయి ఉంటారు. అందుచేత అవసరసమయాల్లో ఆసరాకోసం మనం వారిపైన్నే ఆధారపడాలని ఆశపడతాం. కానీ, వారు ఎల్లవేళలా మనకు అందుబాటులో ఉంటారనేదికూడా అసంభవమైన విషయమే! వారుకూడా మనకు మాదిరి సాధారణులే! వారికికూడా మనకు వలెనే కొన్ని పరిమితులు ఉంటాయి. వారికైనా ఎల్లవేళలా మనకు సహకరించడానికి ఉండేది కొద్దిపాటి శక్తిమాత్రమే!

మరి ఎలాగ? స్వశక్తి కానీ, భౌతికమైన మరే సహాయసంపత్తి గానీ మనను ఆదుకోలేని దుస్థితి ఏర్పడితే? ఎలాగ మరి?

భయపడాల్సిన పనిలేదు. సర్వశక్తిమంతమైన ఆపద్బాంధవ తత్త్వం ఒకటి సదా మనను వెన్నంటి ఉంటుంది. అది భౌతికదృష్టికి అందదు కనుక మనం గుర్తించలేక పోవచ్చు. కానీ, సర్వవ్యాపకమైన ఆ పరమశక్తి ఒక దివ్యరక్షాకవచమై అన్నివేళలా మనలను ఆదుకొంటూనే ఉంటుంది. అది ఒక అపారమైన కారుణ్యతత్త్వం! ఎక్క డెక్కడ దైన్యం ఉంటుందో, ఎక్క డెక్కడ జ్వలితార్తి రగుల్కొంటూ ఉంటుందో – అక్కడక్కడ చినుకు చినుకై జల్లులాడే కృపావర్షం అది!

ఆపత్సమయంలో మనం ఒక్కసారి స్మరించినా చాలు – కరిగి కరిగి నీరయ్యే నీలిమేఘమల్లే మనలను చల్లగా తాకి హరింప చేసే ఆ దయామృతమే ఆపదవేళలో ఆకటివేళలో – మనకు తోడూ నీడై నిలుస్తుంది. ఆర్తిహరమైన ఆ పరమాత్మతత్త్వం! అది పరమ కారుణ్యభగవత్తత్త్వం!

ఆ భగవత్తత్త్వాన్ని దర్శించడంలో కుల ప్రస్తావన లేదు. అది మనమధ్య అడ్డంకి కాదు, కాకూడదు.

శమదమశౌచాదిగుణాలు బ్రహ్మకర్మస్వభావాలు

అని కదా భగవద్గీత! మా మామయ్య శ్రీశైలపూర్ణుల వారిది కూడా ఇదే మతం. మీకు తెలుసో తెలియదో నాకుమాత్రం ఇప్పటికీ బాగా గుర్తుండి పోయింది – నా చిన్నతనంలో మీరు మా ఇంటి ముందు నుంచి వెళుతుండగా తమరు ఎవరో గుర్తుందో? లేదో? కులగోత్రాలెంచకపోయినా, మీలోని బ్రహ్మవర్చస్సు చూచి నా మనసు అప్రయత్నంగా మీకు సాష్టాంగనమస్కారం చేయించింది. నేను అలా చేసినందుకు మా మామయ్య నన్ను మెచ్చుకున్నారుకూడా.

అంచేత నేను, మా మాతృశ్రీ, మామయ్యలు చూచేది అనుభవించేది జ్ఞానం, భక్తి, అంకితభావాలే గానీ పుట్టుక, కులగోత్రాలు కావు. ఆచార్యోత్తమా! పైపెచ్చు నాకు ఆళ్వారులు ఆదర్శం. వారిలో

కూడా భిన్నకులాలవారు ఉన్నారు. వారు అందరూ శ్రియఃపతికి అంతరంగికులే! అతిపవిత్రమూ, మహిమాన్వితమూ అయిన ఆళ్వారులు విష్ణుభక్తిపారవశ్యంలో అనన్యసామాన్యంగా స్వామిని స్తుతించిన వారే! అందులోనూ తిరుప్పాణాళ్వారుగురించి తమరికి తెలియంది కాదు.

తిరుప్పాణాళ్వారు ఉఱైయూర్‌లో ఒక బ్రాహ్మణుని పొలంలో వరికంకిలో భగవంతుని శ్రీవత్సమనే పుట్టుమచ్చ అంశంగా అవతరించారు. ఆ బిడ్డను ఆనాటికి పంచముడని వెలివేయబడ్డ మాతదాసుడు పెంచి, పెద్ద జేశాడు. సాత్త్వికాహారంతో పెరిగిన వీరు ఆ పంచముని కులవృత్తిఅయిన వీణలు చేయడం నేర్చుకొని, ఆ వీణలు మీటుతూ, శ్రీరంగనాథుణ్ణి కీర్తిస్తూ కావేరీనదీతీరంలో నివసించేవారు. శ్రీరంగ నగరితలలో మల్లెపూలమాలిక, శ్రీరంగనాథస్వామిమధురదయా హృదయ పేటిక, దేవదానవుల ప్రేమవాహిక. ఇక కావేరీనది స్వర్గ మర్త్యలోకాల వంతెన. దైవత్వమానవత్వాలకు నిచ్చెన. తిరుప్పాణాళ్వారు భక్తిపారవశ్యం పరమోత్కృష్టం, సర్వశ్రేష్ఠం. ఆ మహానుభావుడు మహాగాయకుడే కాదు, మహాభక్తుడు కూడా!

వారు చేతిలో తంబుర పట్టుకుని–

నీవు నాకు దేవుడవని, నీకు నేను భక్తుడనని
నీకు తెలియు, నాకు తెలియు, లోకమునకు నేమి తెలియు!

నీ రూపము నీ తేజము నిన్ను నిన్ను నేను నాలో
నన్ను నన్ను నీవు నాలో నిలుపుకొన్న నీతిగాథ ॥నీకు తెలియు॥

నీ పాదాలకు నా శిరమే నిత్యవేదికన్న నిజము
నీ అడుగుల కెడ తలుపులు తెరచియున్నవన్నమాట ॥నీకు తెలియు॥

గుడిలో బందీవి నీవు భక్తికి ఖైదీని నేను
నీవు నన్ను చేరలేవు నన్ను గుడికి చేరనీరు ॥నీకు తెలియు॥

అని ఎంతో ఆత్మ ఆర్తితో సంకీర్తనాగానం చేస్తూ కావేరీ తీరంలో తన్మయీ భావస్థితిలో ఉండేవారు. జలమివ్వడానికి రాళ్లపై, రప్పలపై పంచకల్యాణివలే పరుగులిడుతూ, దుముకుతూ, నవ్వుతూ, నాట్యమాడుతూ, అలవోకగా, లీలగా, ప్రవహిస్తుండేది కావేరీలలామ! పూజాపుణ్యంకోసమెంత తొందరో ఆ పరమ పుణ్యశాలినికి! కావేరీ నదీమతల్లి అత్యంత పవిత్రురాలు. శ్రీరంగేశునిపాదాలు తాకడానికే ప్రాకారం పడి పడి వచ్చేది. ఆ తల్లి ఉత్సాహమే ఉత్సాహం. నదీమ తల్లికే ఇంతటి ఆరాటముంటే భక్తుని కెంత వేదనో కదా!

తిరుప్పాణ్‌ను కొందరు దురహంకారులు కాదన్నా, కావేరి ఆ మహనీయుణ్ణి కాదన్న జాడలేదు. తల్లిచేతులలో పిల్లవానివలె తిరుప్పాణ్‌జీవితం ఆటపాటలే, మౌనముద్రలే! గాన తపస్సే! తపో గానమే! గానం ధ్యానజన్యమో, ధ్యానభాగమో కానీ, తిరుప్పాణ్



పాడినా, నడయాడినా బాహిరస్పృహ ఉండదు. పాట ఆగినా, ధ్యానారంభమే. తిరుప్పాణ్‌జీవన్ముక్తుడు.

ఒకరోజు తిరుప్పాణ్ అసంప్రజ్ఞాతసమాధిలో ఉండగా, శ్రీరంగనాథునకు తిరుమంజనం చేయడానికి కావలసిన తీర్థాన్ని తీసుకుని రావడం కోసం ప్రాతఃకాలంలో తిరుమంజన తీర్థకలశాన్ని తీసుకొని అక్కడకు వచ్చిన లోకసారంగమహాముని వీరిని చూచి "దూరంగా పో" అన్నారు. కానీ తిరుప్పాణ్‌కు ఆ మాట చెవిలో పడ లేదు. అందువల్ల కదలుటలేదు. లోకసారంగ మహామునికి కంఠశోష తప్ప ప్రయోజనం కన్పించలేదు. దాంతో ఆయనకు కోపమొచ్చేసింది. "తిరుప్పాణ్! వినబడుటలేదా? వినదలచలేదా? కదలవా? కదల దలచుకోలేదా? వినికూడా కదలవా? వినకనే కదలుటలేదా? ఏమి, తలైన కదపవు?" అని బిగ్గరగా అరిచారు.

ఇక మాటలతో లాభం లేదనుకుని, రెండు తగిలిస్తే తప్ప ప్రయోజనం లేదని, ఒక రాయిని తీసుకుని, తిరుప్పాణ్ పై విసరగా, ఆ రాయి వారి ముఖంపై తగిలింది. తిరుప్పాణ్ కనులు తెరిచారే కానీ తెలివి లేదు. రక్తం – ధారగా నెత్తురు! సారంగమహాముని విసిరింది రాయి, తగిలింది నుదుటికి. కారింది రక్తం. కలిసింది కావేటిలో. ఏటిలో నీటిలో! ఆ నీరే ఆనాటి పూజకు.

(ఇంకా ఉంది)

ఆనందనిలయం – ఆండాళ్ పాశురాలు

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

ఏడుకొండలవాడు ఏడేడులోకాల్లో ఈడే లేని, సరిజోడే లేని విచిత్రమైన దేవుడు! వింతవింత వెలుగుల దేవుడు!

తిరుమలలోని విచిత్రాలు అన్నీ ఇన్నీ కాదు. ఆయన వున్న 'బంగారుమేడ' విచిత్రమే! ఆయన రూపేవిచిత్రం! ఆయన నిలువెత్తు అలంకారాలు విచిత్రమే! ఆయనకు చేసే నివేదనలు విచిత్రాతివిచిత్రం! ఆయనకు నిర్వహించే ఉత్సవాలూ, ఊరేగింపులూ– ఇవన్నీ విచిత్రమే! ఇన్నివిచిత్రాలు చూస్తూ ఆనందంగా అనుభూతులను పొందడానికే నిత్యం వేలాదిమంది భక్తులు తిరుమలకు తరలిరావడం మరింత విచిత్రం!



ఈమాట నూటికి నూరుపాళ్లు సత్యం! అందులోను ఏడాదిలో ఒకనెలమాత్రం తిరుమలక్షేత్రచరిత్రలోనే మరీ విచిత్రం!

ఆ నెలే ధనుర్మాసం!

ఈ ధనుర్మాసం మార్గశిరం (మార్గళి), పుష్యం(తై). ఇలా రెండునెలల్లో కలసి వస్తుంది. అనగా ప్రతి సంవత్సరం డిశంబరు 15 నుండి జనవరి 14 వరకు గల మాసాన్ని "ధనుర్మాసం" అంటారు. ఈ ధనుర్మాసంలో తిరుమలఆలయంలో చోటు చేసుకొనే విశేషాల్ని తెలుసుకుందాం.

ధనుర్మాసంలో సుప్రభాతపఠనం ఉండదు

తిరుమలలో శ్రీవారిఆలయం ఏడాదిపొడవునా ప్రతిరోజూ తెల్లవారుజామున మూడు గంటలవేళ తెరవబడుతుంది.

"కౌసల్యాసుప్రజా రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అనే సుప్రభాతపఠనంతో శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిరోజూ బ్రాహ్మీ ముహూర్తంలో మేల్కొలుపుసేవ జరుగుతుంది. ఇది ఏడాది పొడవునా జరుగుతుంది. కానీ ఒక్క ధనుర్మాసంలోమాత్రం సుప్రభాత పఠనం ఉండదు!

మరి ఏముంటుంది? అంటే!

ఆండాళ్ పాశురాలపారాయణం ఉంటుంది

ధనుర్మాసంలో ప్రతిరోజు తెల్లవారుజామున మూడు గంటలకు సుప్రభాత పఠనానికి బదులుగా గోదాదేవి గానం చేసిన ముప్పది పాశురాల "తిరుప్పావై"ని పఠిస్తూ శ్రీవేంకటేశ్వరస్వామి వారిని మేల్కొలుపుతారు.

ఈ నెలరోజులపాటు కేవలం జియ్యంగారులు, ఏకాంగి, శ్రీవైష్ణవఆచార్యులుమాత్రమే ఏకాంతంగా "తిరుప్పావై" పాశుర గానాన్ని నిర్వహిస్తారు. "సుప్రభాతసేవ"లో మాదిరిగా ఇతర భక్తులకు ఇందులో ప్రవేశం లేదు. ఉండదు.

'తిరుప్పావై'ని శ్రీవేంకటేశ్వరుని పరమభక్తురాలుగా ప్రసిద్ధి పొందిన "గోదాదేవి" రచించింది. ఈ తల్లి పండ్రెండు ఆళ్వారులలో ఏకైకస్త్రీ ఆళ్వారుగా, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అవతారంగా సంభావింపబడుతూ వుంది. ఈ గోదాదేవి "ఆండాళ్" అనికూడా పేరు పొందింది.

ఆండాళ్ అనగా భగవంతుణ్ణి వశం చేసుకొన్న పరమ భక్తురాలైన స్త్రీ అనీ అర్థం. గోదా – అనగా పూలమాల ఇచ్చింది. ప్రధానంగా శ్రీవేంకటాచలపతినిగూర్చి –

"వెయ్యదోర్ తళలు మిళ్ శక్కరక్కై
వేంగడ వర్పన్నై విదికిత్తియే"

అంటూ ఆనందంగా గానం చేసింది – ఆండాళ్.

"వేయివెలుగుల ప్రకాశంతో, శంఖచక్రాలు ధరించి, దర్శనమిస్తున్న తిరువేంకటపతికి నేను సంపూర్తిగా అంకితమవు తున్నాని "నాచ్చియార్ తిరుమొళి"లో విన్నవించుకొని, ఆనంద నిలయుణ్ణి ఆండాళ్ శరణాగతి పొందింది."

గోదాదేవి చెప్పిన భక్తిపూర్వకమైన అంకితభావాన్ని దృష్టిలో ఉంచుకొని భగవద్రామానుజులవారు తిరుమల తిరుపతి ఆల యాల్లో కూడా ధనుర్మాసంలో తిరుప్పావైపఠనం ప్రతి ఏటా ధనుర్మాసంలో అనుష్ఠించే విధంగా కట్టడి చేశారు.

భగవద్రామానుజులవారిఏర్పాటుప్రకారం నెలరోజులపాటు ధనుర్మాసంలో బంగారువాకిలిముందు ప్రతిరోజూ వేకువ జామున ముప్ఫైపాశురాలూ పూర్తిగా- జియ్యంగార్లు, ఏకాంగి ఇతరవైష్ణవా చార్యులు పఠిస్తారు. ఏకాంతంగా సాగే ఈ పాశురాల పారా యణం పూర్తి అయిన తర్వాత శ్రీస్వామివారికి తోమాలసేవ అనే పుష్పాలంకరణం జరుగుతుంది.

వేంకటేశ్వరుడే శ్రీకృష్ణుడు! - వ్యూహలక్ష్మే ఆండాళ్!

మరోవిశేషం ఏమంటే ధనుర్మాసం ముప్ఫై రోజులపాటు, వేంకటేశ్వరునిమూలమూర్తిని శ్రీకృష్ణుడిగాను, వక్షఃస్థలవ్యూహ లక్ష్మిని ఆండాళ్‌గాను భావించి, అలాగే అలంకరిస్తారు. శ్రీస్వామి వారి నడుములో "తిరుప్పావై" అనే బంగారు పతకాలమాలను కటిబంధంగా అలంకరిస్తారు. ఇక వక్షఃస్థలంలో కుడివైపున ఉండే వ్యూహలక్ష్మికి ఎర్రనికెంపులను పొదిగిన బంగారు చిలకబొమ్మను అలంకరిస్తారు. అలాగే హృదయంమీద ఎడమవైపున పచ్చనితమల పాకులు, పూలతో, ఆకులతో తయారు చేసిన చిలుకబొమ్మను కూడా అలంకరిస్తారు.

ఈ తోమాలసేవలో కూడా మళ్లీ జియ్యంగార్లు, ఏకాంగి, వైష్ణవచార్యులు ముప్ఫైపాశురాల్లో ఏ రోజుపాశురాన్ని ఆ రోజు రెండుమార్లు గానం చేస్తారు. అంతటితో తోమాలసేవ పూర్తి అవు తుంది. ధనుర్మాసంలో ప్రతిరోజూ జరిగే పుష్పాలంకరణమనే తోమాలసేవలో శ్రీవారివక్షఃస్థలంలో బంగారుచిలుక - తమల పాకులు, పూలతో చేసిన చిలుకబొమ్మలను భక్తులు, ఉదయం నుంచి రాత్రివరకు కన్నులారా చూడవచ్చు.

బిల్వదళాలతో సహస్రనామార్చన

ఏడాదిపొడవునా ప్రతిరోజూ తిరుమల శ్రీవారికి తోమాల సేవ అయిన వెంటనే మొదటి అర్చనగా వేయినామాలతో సహస్ర నామార్చన జరుగుతుంది. ప్రతిరోజు జరిగే ఈ సహస్రనామా ర్చనలో తులసిదళాలను ఉపయోగిస్తారు. కాని, ధనుర్మాసంలో ప్రతిరోజూ మొదటి అర్చనగా సాగే సహస్రనామార్చనలో మారేడు (బిలువం) దళాలతో అర్చకస్వాములు శ్రీవారిపాదపద్మాలను అర్చి స్తారు.

> **బిల్వ(మారేడు) దళాల్లోను, బిల్వవనం లోనూ శ్రీమహాలక్ష్మి ఉంటుంది! అందు వల్లే ధనుర్మాసంలో తిరుమల శ్రీవారి సహస్రనామార్చనలో బిల్వదళాల్ని ఉప యోగిస్తారు.**

వేడివేడిగా నేతిపొంగళ్లు, బెల్లపుదోసెలు

ధనుర్మాసంలో నెలరోజులూ, తిరుమలేశునికి విచిత్రంగానే కొన్నినివేదనలు అదనంగా నివేదింపబడతాయి. తెల్లవారుజామున శీతాకాలం చలిలో వేడివేడి పొంగళ్లు, పాయసాలతో పాటు శ్రీని వాసుడికి "బెల్లపుదోసె" ప్రత్యేకంగా నివేదింపబడుతుంది. అర అంగుళంమందంతో విశాలంగా, గుండ్రంగా వుండే ఈ నేతి దోసెను బెల్లంపాకంలో ముంచి ప్రక్కన పెడతారు. ఇలా తయారు చేసిన "బెల్లందోసెలు" ధనుర్మాసంలో నెలంతా ప్రతిరోజూ ప్రత్యేక నివేదనగా ఉంటాయి.

చిన్నికృష్ణునికే పవళింపుసేవ!


ఏడాదిపొడవునా ప్రతిరోజు రాత్రిచివరగా తిరుమల శ్రీవారిఆలయంలో 'ఏకాంతసేవ' అనే పవళింపుసేవ జరుగు తుంది. బంగారునవారాపట్టెమంచంపై మెత్తనిదూది పరుపుపైన శ్రీనివాసస్వామివారివెండిభోగమూర్తికి శయనింపు భాగ్యం కలుగు తుంది. కానీ,

ధనుర్మాసంలో నెలరోజులు మాత్రం ప్రతిరోజు రాత్రి చివరగా జరిగే 'పవళింపుసేవ'లో భోగశ్రీనివాసమూర్తికి బదులుగా **శ్రీ వెన్నముద్ద కృష్ణునివెండివిగ్రహమూర్తి** మాత్రమే పాల్గొంటారు.

మేల్కొలుపులు చిన్నికృష్ణునికే!

ప్రతిరోజు రాత్రి బంగారుతూగుటుయ్యాలమంచంపై పవ్వ ళించిన చిన్నికృష్ణుణ్ణి తెల్లవారుజామున జియ్యంగారులు, వైష్ణవా చార్యులు, గోదాదేవి "తిరుప్పావై" పాశురాలు గానం చేస్తూ మేల్కొల్పుతారు.

ఇలా ఈ నెలరోజులపాటు ధనుర్మాసమంతా ఏకాంతంగా జరిగే తిరుప్పావైపఠనం అనంతరం చిన్నికృష్ణుని వెండిమూర్తికి గోరువెచ్చనినీటితో స్నానం చేయించిన తర్వాత పాలు, వెన్న, బెల్లపుదోసె, వేడివేడిగా ఉన్న పొంగళ్లను నివేదిస్తారు.



భగవద్రామానుజుల రచనలు

- ఆచార్య గల్లా చలపతి, 98858 26626

భక్తులకు శ్రీమన్నారాయణుని సులభప్రాప్యునిగా చేయడానికి రామానుజులవారు తొమ్మిదిగ్రంథాలు రచించారు. వేదాంతవాక్యాలన్నీ వ్యాఖ్యానపూర్వకంగా వివరింపబడి విశిష్టాద్వైతసంప్రదాయసారాంశం సరళంగా, స్పష్టంగా ఈ గ్రంథాలు వ్యక్తం చేశాయి. రచనాకాలాన్నిబట్టి కాకుండా గ్రంథప్రాధాన్యదృష్టితో ఆ గ్రంథాలివి- 1)బ్రహ్మ సూత్ర భాష్యం (శ్రీభాష్యం) 2)వేదార్థసంగ్రహం 3)వేదాంత దీపం 4)వేదాంతసారం 5)గీతాభాష్యం 6)శరణాగతిగద్య 7)శ్రీరంగ గద్య 8)వైకుంఠగద్య 9)నిత్యగ్రంథం (నిత్య భగవదారాధనం)

వీటిలో శ్రీభాష్యం గురించి....

వేదాంతంలోని తాత్త్విక విషయాల్ని నాలుగధ్యాయాలుగా 545 సూత్రాలతో ఉన్న బ్రహ్మసూత్రగ్రంథంలో ప్రతి అధ్యాయం నాలుగు పాదాలుగా విభజింపబడి కనిపిస్తోంది. సూత్రార్థాలనను సరించి ప్రతి పాదంలో కొన్ని అధికరణలున్నాయి. ఒక్కో అధికరణంలో వివరింపబడ్డ సూత్రాలకు



వేదాంతచర్చలు చేయబడినాయి. బ్రహ్మసూత్రాలను పూర్వాచార్యులు కొందరు వ్యాఖ్యానించి పరతత్త్వం శ్రీమన్నారాయణుడేనని, మోక్షానికి రాజమార్గం భక్తియేనని ప్రతిపాదించారు. తరువాత కొందరు కుదృష్టులు సరైన దర్శనం లేక తత్త్వావలోకనం లేనివారై వేదాంతంలో అపార్థాలను ప్రతిపాదించి మోక్షప్రాప్తి విధానాన్ని గజిబిజి చేశారు. అలాంటి కుదృష్టులు నిరూపించిన మార్గంలో మోహంతో సంచరిస్తున్న చేతనులను చూచి వాత్సల్యంతో లక్ష్మీదేవి వారి మోహాన్ని తొలగించమని శ్రీమన్నారాయణుని ప్రార్థించింది. అప్పుడు సర్వేశ్వరుడు ఆదిశేషుని భగవద్రామా నుజాచార్యులుగా అవతరింపజేశాడు.

బ్రహ్మసూత్రాలకు రామానుజాచార్యులవారు భాష్యం వ్యాఖ్యానప్రారంభంలోనే "బోధాయనమహర్షిచే రచింపబడ్డ బ్రహ్మసూత్రవృత్తిని పూర్వాచార్యులు సంక్షేపించారు. తదనుసారంగా బ్రహ్మసూత్రాలు నాచేత వ్యాఖ్యానింపబడుతున్నాయి" అని చెప్పుకొన్నారు. రామానుజభాష్యం వైష్ణవ భాష్యాలలో గొప్పగా గుర్తింపబడింది. ఇందులో సూత్రాలలో ప్రతిపాదింపబడ్డ విషయాలు సూత్రానుకూలంగా ఉన్నాయి. రచనావిధానం కూడా సరళత, గంభీరత, ప్రౌఢత, సోపపత్తికత, అర్థగౌరవం, సూక్ష్మవిచారం, భాషాసౌష్ఠవం ఇత్యాదుల అపూర్వ సమన్వయంతో ఉంది. అందువల్లే ఈ వ్యాఖ్యానం కాశ్మీర విద్యాపీఠంలో శారదాదేవిచే స్వీకరింపబడి 'శ్రీభాష్యం'గా ప్రఖ్యాతి పొందింది.

శ్రీభాష్యమంటే ఉపనిషత్తులు ప్రతిపాదించిన పరబ్రహ్మయొక్క అభయ అమృతస్వరూపమైన ఒక అక్షరాకృతి. ఉపనిషత్తులను మధిస్తే లభించేది అభయం, అమృతం, బ్రహ్మ. ఈ అమృతాన్ని ఆస్వాదించేవాళ్లకు అపునరావృత్తి లక్షణమైన ఆనందం లభిస్తుంది. భక్తులైనవాళ్లకు ఆనందాన్ని అనుభవంలోకి తేవడానికి భాష్యకారులు ప్రయత్నించారు. నాలుగధ్యాయాలుగా విభక్తమైన వేదాంతశాస్త్రాన్ని ఆచార్యులవారు అర్థబోధ సౌకర్యార్థం రెండువర్గాలుగా

కోటి చదువగవచ్చు కోపము నిలుపగరాదు

క్రోడీకరించారు. మొదటి రెండధ్యాయాలు ఒక భాగం. మూడునాలుగధ్యాయాలు మరోభాగం. మొదటి భాగం సిద్ధవిషయ స్వరూపపరబ్రహ్మతత్త్వానికి చెందింది కాగా, సాధ్యస్వరూపానికి సంబంధించింది రెండోభాగం. నాలుగ ధ్యాయాలకు సమన్వయ, అవిరోధ, ఉపాసన, ఫలాధ్యాయా లని పేరు.

బ్రహ్మసూత్రాలలోని ఒక్కొక్కసూత్రానికి ఆచార్యుల వారి వ్యాఖ్యానవిధానం ఎలా ఉన్నది తెలుసుకోవడానికి కొన్ని సూత్రాల్ని పరిశీలించడం అవసరం.

'అథాఽతో బ్రహ్మజిజ్ఞాసా' అనేది ప్రథమాధ్యాయం. మొదటిపాదంలోని మొదటిసూత్రం. ఈ సూత్రాన్ని మొదటి పాదంలోని –

1) జిజ్ఞాసాధికరణం అనే అధికరణంలో ఇలా వ్యాఖ్యానిం చారు. వేదాధ్యయనం తర్వాత కర్మజ్ఞానం సంపాదించాలి. తదనంతరం బ్రహ్మజ్ఞానం సంపాదించాలి. వేదార్థైకదేశం కావడంవల్ల కర్మవిచారం ప్రథమకర్తవ్యం. తరువాత బ్రహ్మ విచారం. కేవల కర్మఫలం అల్పం, అస్థిరం. బ్రహ్మజ్ఞానం అనంతం, స్థిరమైనఫలం. సారాంశమేమిటంటే – కర్మవిచారం అల్పఅస్థిరఫలాన్నిస్తుంది. కాబట్టి కర్మవిచారానంతరం బ్రహ్మ విచారం చేయాలి. ఆ బ్రహ్మం ఏది అనే విషయం గ్రహించ డానికి –

2)జన్మాద్యధికరణంలో వ్యాఖ్యానింపబడ్డ **'జన్మాద్యస్యయతః'** అనే సూత్రాన్ని పరిశీలించాలి. బహువిధాలైన భోగ్యాలతో, భోక్తలతో కూడిన ఈ జగత్తుకు దేనివల్ల జన్మ–స్థితి–లయ– మోక్షాలు కలుగుతున్నాయో అది బ్రహ్మం అని అర్థం. అందుకు ప్రమాణం ఏమిటంటే –

3)శాస్త్రయోనిత్వాధికరణంలోని **'శాస్త్రయోనిత్వాత్'** అని సూత్ర వ్యాఖ్యానాన్ని చూడాలి. బ్రహ్మకు శాస్త్రీయమైన ప్రమాణం ఉందని అర్థం. చిదచిద్వస్తు శరీరకుడైన బ్రహ్మ నిఖిల జగదేకకారణమని శ్రుతులు చెపుతున్నాయి. అలా తెలుసు కోవడంవల్ల ప్రయోజనం ఏమిటి? అనే విషయం తెలుసు కోవడానికి –

4) సమన్వయాధికరణంలోని విషయాన్ని పరిశీలించాలి. ప్రకృతి జగత్కారణం ఎందుకు కాకూడదు అనే ప్రశ్నపుడు తుంది. ప్రకృతి జగత్కారణం కాదు అనే విషయం తెలుసుకోవడానికి –

5) ఈక్షత్యధికరణం చూడాలి దేనికి ప్రమాణం ఉండదో అది అపశబ్దం. ఈక్షతి ధాత్వర్థమైన ఈక్షణవ్యాపారం సిద్ధించనందున బ్రహ్మమే సత్ శబ్దవాచ్యకమైన జగత్కారణ మని అర్థం. సర్వానికి సర్వజ్ఞుడైన పరమాత్మే కారణం. కాబట్టి సశ్శబ్దవాచ్యుడు పరమాత్మే, ప్రకృతికాదు.

6) ఆనందమయాధికరణం నిరతిశయానందం పరమాత్మ యందే సంభవించుటవల్ల, జీవాత్మయందు సంభవించక పోవడంవల్ల ఆనందమయుడు, జగత్కారణంగా నిర్దేశింపబడ్డ వాడు పరమాత్మే గాని జీవాత్మకాడు. జీవాత్మకు ఆనందాన్ని పరమాత్మే ప్రసాదిస్తాడు. కాబట్టి ఆనందమయుడు పర మాత్మే.

ఇంకా ఈ పాదంలో 7)అంతరధికరణం 8) ఆకాశా ధికరణం 9)ప్రాణాధికరణం 10)జ్యోతిరధికరణం 11)ఇంద్ర ప్రాణాదికరణం అనే పేర్లతో అధికరణాలున్నాయి. చతుర్థా ధ్యాయం చతుర్థపాదంలో సంపత్యావిర్భావాధికరణం ఉంది. జీవుడు శరీరంనుండి పరంజ్యోతిస్వరూపుడైన పర బ్రహ్మను పొంది స్వరూపంతో అభివ్యక్తమౌతున్నాడు అని శ్రుతి. ఇందులో పరంజ్యోతిని పొందిన జీవాత్మ స్వరూపావిర్భావం చర్చించబడింది.

ఇలా శ్రీభాష్యవ్యాఖ్యానం సూత్రానుకూలంగా ఉంది. సూత్రాలవ్యాఖ్యలలో శ్రుతులు సూత్రానుసారం నిర్దేశించబడి చర్చింపబడ్డాయి. వివరాలన్నిటితో భాష్యవివరణ అస మానంగా ఉంది.

తత్త్వమీమాంస, ఆచారమీమాంస నిశితంగా చర్చింప బడి వాస్తవసిద్ధాంతాలు పొందుపరచ బడ్డాయి. విశిష్టాద్వైత సిద్ధాంతం వేదశాస్త్రపురాణేతిహాసాదిప్రమాణాలతో ప్రతి పాదితం.

శ్రీరామానుజుల రెండు విలక్షణ విగ్రహాలు

- డా॥ ముదివేడు ప్రభాకరరావు, 94418 72536.

శ్రీ రామానుజులవారి విగ్రహాలెన్నో భారతదేశంలో ఉన్నప్పటికీ విలక్షణమూ, విశిష్టమూ అయిన రెండు విగ్రహాల విషయం సంక్షిప్తంగా ఇక్కడ పొందుపరచడం జరిగింది. శ్రీరామానుజుల జీవితంలోని ప్రధాన ఘట్టాలతో సమన్వయించే ఈ విగ్రహాలు శ్రీవైష్ణవ సంప్రదాయంలో దివ్యత్వాన్ని కలిగి ఉన్నాయి.

నచేత్ రామానుజేత్యేషా చతురీ చతురక్షరీ।
కామవస్థాం ప్రపద్యంతే జంతవోహంత మాదృశః॥

"రామానుజా!" అనే నాల్గక్షరాల పేరే ఈ జగత్తులో లేక పోతే, వేదాంతవాసన ఏ మాత్రమూలేని మావంటి జంతు సమాను లైన జీవులు ఎటువంటి కడగండ్ల పాలయ్యేవారో కదా!" అని శ్రీపిళ్లైలోకాచార్యులవారు (క్రీ.శ.1213- 1323) ప్రపన్న పరి త్రాణమనే రహస్యగ్రంథంలో వ్రాశా రంటే, ఇక సామాన్య జీవుల సంగతి ఏమని చెప్పేది?

"ఓం నమో నారాయణాయ" అనేది అష్టాక్షరీ మంత్రం. చతురక్షరీ రామానుజులు, అష్టాక్షరీ మంత్రాన్ని సంసారి చేతనులైన ప్రజలందరికీ ఉప దేశించి, మోక్షాన్నిప్పించిన పరమకారుణికులైన ఆచార్యపురుషులు.

ఈ అష్టాక్షరీమంత్రంకంటే దానిని ఉపదేశించిన **'రామానుజా!'** అనే చతురక్షరియే మాపాలిటికి మోక్షమని ఆచార్యాభి మానాన్ని ప్రకటించినారు శ్రీ పిళ్లైలోకాచార్యులు. ద్వయమంత్రంలో రెండవదైన **"శ్రీమతే నారా యణాయనమః"** అనే దానికి బదులుగా **"శ్రీమతే రామానుజాయ నమః"** అని చెప్పడం ఆచార్య ప్రపత్తికి, ఆచార్య నిష్ఠకు ప్రబలోదాహరణం.

1

"తామాన తిరుమేని" - శ్రీరంగదేవాలయం

తామ్+ఆన తిరుమేని= స్వయంగా తామే అయిన విగ్రహం. శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామిఆలయంలో ప్రతిష్ఠించ బడిన విగ్రహమిది. శ్రీరామా నుజుల జీవన్మూర్తి విగ్రహం. ఇది కొన్ని ప్రత్యేక సాంకేతిక పద్ధతులలో నిర్మించబడింది. తమ స్వకీయ రూపమే చెక్కు చెదరకుండా యథాతథంగా మూర్తిగా వెలయింపజేసిన విగ్రహం **'తామాన తిరు మేని'.**



ఇది పద్మాసన భంగిమలోని **'అభయ ముద్రా'** విగ్రహం కావడం విశేషం. ఆర్తులు, ప్రపన్నులైన శరణాగతులకు ఆచా ర్యులు నిరంతరమూ **అభయప్రదానం** జేస్తున్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడు లోకానికి **అభయప్రదానం** చేయగా, శ్రీరామానుజులు కలియుగాంతంవరకు అది వర్తిస్తుందని చెప్పడానికి అభయ ముద్రలో ఉన్నారు.

ఉపవీతిన మూర్ధ్వ పుండ్రవంతం- త్రిజగత్పుణ్య ఫలం త్రిదండహస్తమ్।
శరణాగత సార్థవాహమీడే- శిఖయా శేఖరిణం పతిం యతీనామ్॥
- వేదాంతదేశికుల యతిరాజసప్తతి (శ్లో.11)

2

"తామ్ ఉగన్ద తిరుమేని" - శ్రీపెరుంబూదూరు

శ్రీరామానుజుల జన్మస్థలం శ్రీపెరుంబూదూరు. ఒకసారి శ్రీరంగంలో ఉన్న శ్రీరామానుజులవారికి తమ శక్తి క్షీణించు చున్నట్లు తోచగా, దానిని తన స్వకీయ యోగబలంచే శ్రీపెరుం బూదూరులో నిలిపారు. అదేక్షణంలో దాశరథి మొదలియాండాన్ కుమారుడు మొదలగువారిచే ఆచార్యానుమతితో ఆయన జన్మస్థల మైన శ్రీపెరుంబూదూరులో ప్రతిష్ఠింపబడిన విగ్రహం. ఆచార్య రామానుజుల యోగశక్తి సర్వమూ సంపుటీకరింపబడిన విగ్రహ మిది. తమ యోగబలంతో ఉద్భవింపజేసుకొన్న విగ్రహం. తామ్= తమ కుతామే, ఉగన్ద=సంసారిచేతనులైన జీవుల ఉజ్జీవింపజేయ డానికి అవతరింపజేసిన, తిరుమేని=దివ్యయోగమూర్తి విశేషం- **'తామ్ ఉగన్ద తిరుమేని'.**

యథావతారాత్ మధురా మురారే- రామస్య సాకేత పురీచ యద్వత్।
తథాయతీంద్రస్య కృపాశ్రయస్య- పుణ్యోత్తరో భూతపురీ బభూవ॥



రామ, కృష్ణావతారాలచే అయోధ్య, మధురాపట్ట ణాలు పవిత్రప్రదేశాలై నట్లు, యతిరాజులవారి అవతరణంచే 'భూతపురి' అని పిలువబడే శ్రీ పెరుం బూదూరు అగణిత పుణ్య ప్రదమైన పట్టణమైనది. ఇది 'అంజలిముద్ర'లో ఉన్న విగ్రహం.

శ్రీవారి సన్నిధిలో.. అధ్యయనోత్సవం

- డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు, 74160 93342

సప్తగిరీశసార్వభౌములైన శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో మున్నూటఅరవైరోజులు నిత్యబ్రహ్మోత్సవ సదృశమైన ఆధ్యాత్మికపారమ్యమే! దాదాపు వేయేండ్లనాడు భగవద్రామానుజాచార్యులవారు ఏర్పరచిన నిత్య, పక్ష, మాస, వార్షిక, విశేష బ్రహ్మోత్సవ సంరంభమే తిరుమలగిరులంతటా ప్రతిబింబిస్తూంటాయి, ప్రతిధ్వనిస్తూంటాయి. వాటిలో అధ్యయనోత్సవం ఒకానొక మనోహరమైన దివ్యప్రబంధానుసంధాన పూర్వకమైన భవ్యపరిమళం.

తిరుమలలో ఈ నెల 28న ప్రారంభమయ్యే అధ్యయనోత్సవాల సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం.

తమిళభాషలో రచించబడి, గానం చేయబడిన పాశురాలను 'దివ్యప్రబంధం' అంటారు. ఇది 'నాలాయిరం'- అంటే నాలుగువేలు. శ్రీవైష్ణవదేవాలయాలలో దివ్యప్రబంధాన్ని ఆయా సమయాల్లో గానం చేస్తారు. అలా గానం చేయబడే క్షేత్రాలను 'దివ్యక్షేత్రాలు'గా భావిస్తారు. ఇలాంటివి మొత్తం 108గా గుర్తించారు. ప్రపన్నులైన మహానుభావులు ఈ దివ్యదేశాలలో మాత్రమే తీర్థస్వీకారం చేయడం ఒక సంప్రదాయం.

ప్రపన్నజనకూటస్థులైన శ్రీనమ్మాళ్వార్లపరమపదోత్సవాన్ని అధ్యయనోత్సవమనీ, వైకుంఠోత్సవమనీ, ప్రపన్నోత్సవమనీ, మోక్షోత్సవమనీ పిలిచినా, తిరుమలలో మాత్రం దీన్ని అధ్యయనోత్సవమని మాత్రమే వ్యవహరిస్తారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో శ్రీభాష్యకారుల ప్రతినిధిగా పెద్దజీయంగార్ స్వామివారు, వారికి అధీనులుగా చిన్నజీయం గార్ స్వామివారు తమ ఏకాంగుల తోడ్పాటుతో ఈ దివ్యప్రబంధ అనుసంధానాది కైంకర్యాలను నిత్యమూ సమర్పిస్తూంటారు. నాలుగువేల పాశురాలతో శోభిల్లే దివ్యప్రబంధం నాలుగువిభాగాలుగా విస్తరించి ఉంది. అవి ముదలాయిరం- పెరియతిరుమొళి-ఇయర్పా- తిరువాయ్‌మొళి. ఈ సంపూర్ణదివ్యప్రబంధపారాయణానికే అనగా సంపూర్ణ ద్రావిడ వేదాధ్యయనానికే "అధ్యయనోత్సవం" అని ప్రసిద్ధి.

శ్రీనమ్మాళ్వార్ల అవతరణస్థలం ఆళ్వారు తిరునగరి. తిరుమంగైఆళ్వార్ అనే మహానుభావులు ఆ ఊరిలో నమ్మాళ్వార్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆ ఉత్సవమూర్తిని శ్రీరంగానికి పల్లకిలో వేంచేపు చేసుకొని వచ్చి, శ్రీరంగనాథ స్వామివారి శ్రీసన్నిధిలో వైకుంఠ ఏకాదశి మొదలు పదిరోజుల పాటు తిరువాయ్‌మొళిని అనుసంధానం చేసినట్లు, అప్పటి నుండి అధ్యయనోత్సవం ఆరంభమైనట్లు పూర్వాచార్యపరంపర. ఇక ఉత్సవ సమాప్తి అయినరోజున నమ్మాళ్వార్లను శ్రీవారి పాద సన్నిధిలో చేర్చి, మరలా లోకోద్ధరణనిమిత్తమై "మా ఆళ్వార్లను మాకు ప్రసాదించ"మని ప్రార్థిస్తారు. తర్వాతి కాలంలో నమ్మాళ్వార్ల అనుగ్రహంతో శ్రీమన్నాథ మునులు నాలాయిరాన్ని తిరిగి సంపాదించి, ఈ ఉత్సవాన్ని 22 రోజుల పర్యంతం జరిగేలా ప్రారంభించారు. ఇలా ఈ వరవడి సాగుతోంది.

నాలుగువేల పాశురాలను మొత్తం ఒకేసారి స్థిరాసనంలో పూర్తిచేయడం కనుక, శ్రీవైకుంఠఏకాదశికి ముందు పదిరోజులు (పగల్‌పత్తు), మొదటి రెండు ఆయిరాలను (ముదలాయిరం, పెరియ తిరుమొళి) అనుసంధిస్తారు. ఏకాదశి నుండి పదిరోజుల రాత్రివేళ (రాపత్తు) మిగిలిన రెండుఆయిరాలను (ఇయర్పా, తిరువాయ్‌మొళి) అనుసంధానం చేస్తారు. ఇరవై ఒకటవరోజున రామానుజనూత్రందాది, ఉపదేశరత్నమాల అనుసంధించి, 'శాత్తుముఱై' చేసేయడం, ఆ మరునాడు తిరుప్పల్లాండు తొడక్కం చేసి పూర్తిచేయడం సాధారణంగా జరుగుతుంది.

అయితే, తిరుమల శ్రీవారి సన్నిధిలో 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజనూత్రందాది, 24వరోజున శ్రీ వరాహస్వామిసన్నిధిలో శాత్తుముఱై, 25వ రోజున తన్నీర్అముదు ఉత్సవం చేసి అధ్యయనోత్సవాలను శుభసమాప్తి చేస్తారు. ఈ సందర్భంగా ఒక నిషేధాన్ని గుర్తు చేసుకోవాల్సి ఉంది. అధ్యయనోత్సవానికి ముందు కార్తికపౌర్ణమి నుండి (కృత్తికా దీపోత్సవం) కూరత్తాళ్వార్ తిరునక్షత్రం (జన్మదినం) వరకు- అంటే రెండు మాసాలపాటు- దివ్యప్రబంధపారాయణాన్ని అనధ్యయన (నిషేధం) కాలంగా పెద్దలు పరిగణించడం జరిగింది. అయితే, ఈ రెండునెలలకాలంలో తిరువాయ్‌మొళికి సారరూపమైన 120 పాశురాలు గలిగిన తిరువాయ్‌మొళి నూత్రందాదిని అనుసంధించాలని పూర్వాచార్య పరంపరగా వస్తోంది. ఈ రెండుమాసాలు తిరుమంగైఆళ్వార్ల

నమ్మాళ్వార్లను శ్రీరంగంలో వేంచేపుచేసినకాలానికి ఒక సంకేతం అన్నమాట!

వైష్ణవాలయాల్లో దివ్యప్రబంధఅధ్యయనం తప్పక జరిగి తీరాలని పారమేశ్వర, శాండిల్య, జయాఖ్య, ఈశ్వర, శ్రీప్రశ్న, పాద్మ, బ్రహ్మ, నారాయణ, విష్వక్సేనాదిసంహితలలోనూ, విష్ణు తంత్రంలోనూ ప్రముఖంగా ప్రస్తావించబడింది. నిత్యమూ జరిగినా, జరగకపోయినా కనీసం సంవత్సరంలో ఒక్కసారైనా అనుసంధించబడాలి అనే నియమంతో శ్రీమన్నాథ మునులు ఈ అధ్యయనోత్సవాన్ని 22 రోజులకు పరిమితం చేశారట!

తిరుమల విషయానికి వస్తే అధ్యయనోత్సవాన్ని ఏర్పాటు చేసినవారు తొలుత తిరుమంగైఆళ్వార్లు, తదుపరి నాథమునులు, తదనంతరం భగవద్రామానుజాచార్యులవారు.

దీనికి సంబంధించి, 1253 సంవత్సరం నాటి తిరుపతి శాసనం పాక్షిక దివ్యప్రబంధ పారాయణాన్ని సూచించగా, 1360 సంవత్సరం నాటికే సంపూర్ణ దివ్యప్రబంధ పారాయణం మొదలైనట్లు ఇతర శాసనాలు ఋజువు చేస్తున్నాయి. 1446 సంవత్సరం నాటి శాసనం బ్రహ్మోత్సవాలలో ఈనాటి వలే, తిరువాయ్‌మొళి అధ్యయనాన్ని తెలియజేస్తోంది. మొదట్లో తిరువాయ్‌మొళిగానం రాజగోపురానికి ముందు తిరువాసన్ దగ్గర, తరువాత ఎంబెరుమానార్ల సన్నిధి ఎదుట, ప్రస్తుతం రంగనాయక మండపంలోనూ ఈ అధ్యయ నోత్సవం జరుగుతోంది. అన్నమాచార్యులవారుకూడా ఈ ఉత్సవాన్ని విశేషంగా కీర్తించడం జరిగింది.


చివరిరోజు నమ్మాళ్వార్ల పరమపదోత్సవం. తిరుమలలో మాత్రం అధ్యయనోత్సవం శుభసమాప్తి. శ్రీస్వామివారిని గరుడ వాహనంపై / తిరుచ్చిపై వేంచేపు చేసి, వారికి ఎదురుగా ఆళ్వార్లను (తిరు మలలో శ్రీరామానుజులవారిని) సేవగా పుర ప్పాట్టు (తిరువీధిఉత్సవం) జరుపుతారు. తిరిగి వచ్చాక వేదాది విన్నపం చేశాక, తిరువాయ్‌మొళిలోని చివరిపత్తు (శాత్తుముఱై పాశురాలను విడిచి) ఆందాదిగా అనుసంధిస్తారు.

అధ్యయనోత్సవవిధానం

యథావిధిగా నిత్యఆరాధనాదులన్నీ పూర్తిచేశాక, ఉత్సవ మూర్తులను ఒకపల్లకీలో వేంచేపు చేస్తారు. వేరొక పల్లకీలో శఠగోపాది ఆళ్వార్లను వేంచేపు చేసి, శ్రీస్వామివారికి ఎదురుగా ఆళ్వార్లు ఉండేలా సన్నిధిచుట్టూ ప్రదక్షిణం చేసి ధ్వజస్తంభంవరకు వస్తారు. వీరుభయుల మధ్య భాగవతోత్తములు గోష్ఠిగా రెండు వరుసలలో చేరుతారు. ఆ తర్వాత శ్రీవారికీ, ఆళ్వార్లకూ అర్ఘ్యపాద్యాదిషోడశోపచారాలు సమర్పిస్తారు. అప్పుడు స్థానాచార్యులవారికి పరివట్టం (తలపాగ వంటిది) ధరింపజేసి, వేదాది విన్నపం (శంగోలం) చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లకు శఠారి ఇచ్చి, 'అరుళప్పాడు' చెప్తారు. దివ్య ప్రబంధం అనుసంధానం ఆరంభించి, భాగవతోత్తములకు శఠారి ఇచ్చి మళ్లీ ఆలయానికి ప్రదక్షిణంచేసి, తిరుమల శ్రీవారి గర్భగుడిలో చేరుస్తారు. అప్పుడు ఆళ్వార్లను శ్రీవారికి అభిముఖంగా ముఖమండపంలో వేంచేపు చేసి, ఆనాటి దివ్యప్రబంధభాగాన్ని పూర్తి చేస్తారు. ఇక ఆళ్వార్లను యథాస్థానంలో చేర్చాక, నైవేద్యం, శాత్తుముఱై, తీర్థప్రసాద వినియోగం ఒక క్రమంలో జరుగుతుంది. ఇలా అధ్యయనోత్సవం అనునిత్యమూ జరుగుతూ ఉంటుంది.

ఆళ్వార్లను శ్రీస్వామివారి దివ్యశ్రీచరణ సన్నిధిలో చేర్చగా, భక్తులు తులసీపుష్పాదులను ఆళ్వార్లకు సమర్పిస్తారు. హారతి ఇస్తారు. ఆపైన ద్వారాన్ని మూసివేసి, ఆళ్వార్లకు తిరుమంజనం, అలంకారం వగైరాలు సమర్పించి, పొంగలి ఆరగింపు చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లను తిరిగి తమకు అనుగ్రహించమనీ, లోకోద్ధరణకు అవశ్యమనీ ప్రార్థన చేస్తూ, ద్వారం తెరచి, శాత్తుముఱై పూర్తి చేస్తారు. ఆ సందర్భంగా శ్రీవారికి, నమ్మాళ్వార్లకు, ఎంబెరుమానార్లకు, పూర్వాచార్యులకు సంభావనలు సమర్పించడం సంప్రదాయం. చివరకు స్థానాచార్యులకు మాలాపరివేష్టం, శఠారి, తీర్థప్రసాదాదులతో సత్కారం, ఇతరులకు, తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.

తిరుమలలో పెరియజీయర్ స్వామివారు, ఎంబెర్‌మానార్లకు ప్రతినిధులుగా, సత్సంప్రదాయపరిరక్షణ ధర్మకర్తలుగా, 'అరైయర్ల' స్థానంలో ద్రావిడవేదగానాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారు.



సిరినోము

- కీ.శే.ముళ్లపూడి వెంకటరమణ

కొండంత దేవునికి గోరంత పత్రి చాలు - అది భక్తితో ఇస్తేనే.

వేదవేదాంతాలూ, అర్థపరమార్థాలూ, మంత్రతంత్రాలూ తెలిసిన ఎంత జ్ఞాని అయినా భక్తి లేకుండా కొండంత పత్రీ పూలూ గుమ్మరించినా అవి గోరంతకూడా స్వామికి చేరవు - చాలవు. ఈశ్వరస్పృహలేని జ్ఞానం మేఘాలమధ్య ఇరుక్కున్న సూర్యచంద్రులవంటిది. కొరగాని వెలుగు. అట్టి జ్ఞానానికి అహంకారమనే చత్వారం వస్తుంది.

భక్తి - నిర్మలమైన స్వచ్ఛమైన భక్తి - కుచేలుడి అటుకుల వంటిది. శబరి ఎంగిలిచేసిన పళ్లవంటిది. మూడుకన్నుల దేవరకు తన కన్ను అమర్చడానికి ఆయన ముఖంమీద తన కాలిజోడును ఆనవాలుగా తొక్కిపెట్టిన కన్నప్ప ప్రేమలాంటిది. శ్రీకృష్ణుడి తల నొప్పి తగ్గించడానికి భక్తుల పాదధూళి కావాలన్నారు వైద్యులు. కన్నవారూ, కట్టుకున్నవారూ, అన్నగారూకూడా పాదధూళి ఇవ్వడానికి భయపడ్డారు. తాము ఏ నరకానికి పోయినా చింతలేదు గాని కన్నయ్య సల్లగుంటే సాలు అంటూ తమపాదాలకంటిన దుమ్ముతీసి నుదుట విబూదిలా పూశారు-గొల్లభామలు. అదీ స్వచ్ఛమైన ప్రేమ; భక్తి.

అలాగే తాను స్వామిని వరించి, ఆ ప్రేమకొద్దీ - తాను ధరించి తీసినహారాన్ని తనకు తానే నైవేద్యం పెట్టుకున్న హారాన్ని, స్వామికే ప్రసాదంగా పంపింది - గోదాదేవి (ఆండాళ్‌తల్లిగా అవతరించిన శ్రీమహాలక్ష్మి). ఆమెను కడుపారా కనకపోయినా తులసి వనంలో కనుగొని పెంచిన తండ్రి విష్ణుచిత్తుడు. నిత్యం ఆయనా, ఆలయపరివారమూ సమకూర్చి పంపిన హారంలోని విరులకన్నా, ఆ మాలలో చేరిన ఆండాళ్ కురుల పరీమళమే స్వామికి నచ్చింది. అనురాగమను రాగంలో భక్తిప్రేమలు మేళవించిన లోకోత్తర సౌరభం అది. అంతవరకూ అర్చకాదిదేవసేవకులు దైనందిన విధ్యుక్తధర్మంగా - భక్తి గురించిన స్పృహ లేకుండా కట్టితెచ్చిన హారాలు స్వామి ధరించాడు; కానీ ఆండాళ్ తనసిగలో ముడిచి, నీటిలో ప్రతిబింబం చూచి మురిసి - తీసిన మాలను పంపితే స్వామి ప్రేమతో ఆనందంగా ధరించసాగాడు.

“అమ్మా- స్వామికి మనమిచ్చు నైవేద్యాన్ని ఆయన ప్రాశించి ఆమోదించాక దాన్నే మనం ప్రసాదంగా స్వీకరించాలిగాని మనం రుచిచూసిన ప్రసాదాన్ని ఆయనకు నైవేద్యం పెట్టకూడదు, ఇది తప్పు” అని చెప్పబోయాడు తండ్రి-పెరియాళ్వార్ అనే విష్ణు చిత్తుడు. కానీ ఆ కురుల విరుల పరీమళాల పరిష్వంగ సౌరభాలను క్రమంగా అవధరించి ఎరుకపరచుకున్నాడు-ఆయన. అప్పుడు తానే గోదాదేవిని రంగనాథునికి అర్పించి తానూ తరించాడు.

సహజ పరీమళాలు గుబాళించే విరులదండలకు కన్నెపిల్ల నెరికురుల సౌరభాన్ని జోడించి, పరమాత్ముడినే ముగ్ధుణ్ణి చేసిన ఈ గోదాదేవి పన్నెండువందల ఏళ్ల కిందట అవతరించిన వైష్ణవ వైతాళికులు పన్నిద్దరాళ్వారులలో ఏకైకమహిళ. ఆళ్వారులు పాడిన నాలాయిరప్రబంధంలో (నాలుగువేల పాశురాలు) గోదాదేవి పాడిన ముప్పదిపాశురాలకు అతివిశిష్టమైన స్థానం ఉంది. అదికన్నయ్యను వలచిన కన్నెమనసుల సరాగాల మాల. మేలు పలుకుల మేలు కొలుపులు.

కలియుగంలోని శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి - ద్వాపరంలోని రేపల్లె గొల్లభామగా తన్ను తాను భావించుకుంది. తమ మధ్యనే తిరుగాడే శ్రీకృష్ణస్వామిని పగలంతా చూస్తున్న సంతోషం, రాత్రివేళ చూడలేని తాపం. తెల్లవారే వేళనే కన్నులారా చూచి తరించాలనే తపన, ఆత్రం కలబోసిన భావరాగానురాగాల పారిజాతాల మాల- ఈ తిరుప్పావై.

ఈ మేలుకొలుపులు ఎవరికి? నీలా తుంగస్తనగిరి సానువులలో తలవుంచి నిదురించే - నిదుర నటించే కృష్ణస్వామికా? కాదు - గోకులంలోని తనయీడు కన్నెపిల్లలందరికీని. ఇంటింటికీ వెళ్లి వాళ్లను నిదురలేపడం- ‘అక్కా లేవే- చెల్లీ లేవే - ఈ ధనుర్మాసంలో ముప్పదినాళ్లూ మనం కాత్యాయనీవ్రతం తలపెట్టాం గదా - మరచిపోయారా - లేవే - ఈ తిరుప్పావై (సిరినోము) శ్రద్ధగా చేస్తే అమ్మవారు వరమిస్తుంది. అప్పుడే కన్నయ్య మనందరినీ పెళ్లాడతాడు. లెండి. త్వరగా



రండి-యమునకువెళ్లి పొద్దుపొడిచేలోగా వెన్నెల్లో చలిలో స్నానాలు చెయ్యాలి మనం. ఎంత చలి అయినా తప్పదు-లెండి-'ఇష్టఫలము అందుకొనుటకు కష్టపడవలె చెల్లెలా' అంటూ ఇంటింటికీ వెళ్లి తలుపులు తట్టుతుంది. బద్ధకిష్టులను, ముద్దుగుమ్మలను మొద్దుగుమ్మలుగా వెక్కిరిస్తుంది - రెచ్చగొడుతుంది.

కృష్ణలీలలు పాడుకొంటూ అందరూ కలిసి నందరాజు భవంతికి వెళ్తారు. అక్కడు ముందుగా కావలివారిని మర్యాదగా పిలిచి తలుపులు గడియలు తీయమంటారు. ఆ తరువాత బలరామస్వామి, ఆ పిమ్మట నందరాజు, యశోదమ్మలు. సాధింపులతో నందరాజునుకూడా విడిచిపెట్టదు - గోదాదేవి.

"ఏమయ్యా స్వామీ - గోకులంలో ఆబాలగోపాలాన్నీ, ఆవు దూడలనూ, వాళ్లఆకలీ దప్పికా కుశలం కనిపెట్టి కాపాడతావే - ఈ కన్నెపిల్లలు నీ గుమ్మంలో చలిలో నిలబడి వణికిపోతున్నారే-ఆమాత్రం పసిగట్టలేవా" అని సాధిస్తుంది.



నందరాజునే కాదు - వైకుంఠపాలకుడు సాక్షాత్ విష్ణుమూర్తినే సతాయిస్తుంది. 'ఓ స్వామీ - ముప్పది ముక్కోటి దేవతలకు ఎప్పుడు ఏముప్పొస్తుందోనని ఎల్లవేళలా కావలికాచే మురారిగారూ - కాస్త మా మొర వినరా - నిన్ను పొందగా నోముపట్టినా కన్నెపిల్లలం మేమూ - చలిలో గజగజ వణుకుతు నిలిచిన చిన్నపిల్లలం మేము' అని.

చివరగా కన్నయ్య సతీమణి నీలాసుందరీదేవిని మేలుకొలుపుతుంది - స్వామిని కౌగిటిలో బంధించి విడవకుండా నిద్రనటిస్తున్న అమ్మవారికి వేడికోలు.

తాము సిరినోము పట్టామనీ, స్వామివారు ఆ నోముకు కావలసిన పాలూ పళ్లూ కొబ్బరిబూరాలూ తప్పెట్లూ, తాళాలూ ఇస్తామని చెప్పారనీ, అవి తీసుకుని యమునకు వెళ్లి స్నానమాడి అమ్మవారికి పూజలు చేసి నైవేద్యాలు పెట్టాలనీ చెప్తారు. అంత వరకూ పాలూ, పూలూ, చక్కెర పొంగలి, దధ్యోదనం ఇవేమీ ముట్టకూడదు- ఆకలేసినా నోరూరినా, మనసూరినా పూజ ముగిసే వరకూ చూడరాదు, వాసన చూడరాదు. అప్పుడు కృష్ణస్వామిని అందరం పెళ్లాడవచ్చు - అంతే వాళ్లకు కావలసింది.

ఇంతమంది ఒక్క స్వామిని ఒక్కసారిగా పెళ్లాడటమా- అది జరిగేపనా? అని ఈ కన్నెపిల్లలకు ఆలోచన కూడా ఉండదు - అంత అమాయకత్వం - అంత స్వచ్ఛమైనప్రేమ - వెన్నకాచిన నేయిలాగా.

అంతలో అన్నిటినీ తిరగేస్తే మనసులోని నిజమైన కోరిక గుర్తుకు వస్తుంది. "స్వామీ స్వామీ-అన్నట్టు ఉన్న సంగతి మరచి పోయాం-మేమింతవరకూ అడిగినవన్నీ చిన్నాచితకా పెద్దా గొప్పా కోరికలూ వరాలూ అన్నీ-తూనాబొద్దు-అన్నీ చెరిపేసెయ్ - మాకు మేడలూ మిద్దెలూ వద్దు - పెళ్లీ సంసారాలూ వద్దు - నగానట్రా వద్దు. స్వర్గం మోక్షం వద్దు - మాక్కావలసింది నువ్వు - నువ్వే.

నువ్వు కనపడాలి-అంతలో మాయమైపోవాలి-మేము వెతకాలి-నిన్ను తిట్టుకుంటూ సాధించాలి-మళ్లీ నువ్వు కనిపించాలి-మేము సంబరపడి గంతులు వెయ్యాలి...ఇంతకు మించి మేము తెలిసో తెలియకో వేరే వరాలేవైనా కోరి ఉంటే - అవన్నీ తుడిచి పారేయ్. స్వామీ - నువ్వే - నిన్ను చూడని బెంగా, నిన్ను చూచిన సంబరం - ఇంతే - ఇవి యమునలో కెరటాల్లాగా వస్తూ వెళ్తూ మళ్లీ మళ్లీ వస్తూ ఉండాలి. మా నోములూ పూజలూ ఇందుకే-"

ఇటువంటి వరాన్ని ఏ మహర్షులూ యోగులూ భక్తులూ అవధూతలూ కూడా కోరలేరు. చిరంజీవత్వం, స్వర్గం భోగాలూ



అవి దాటితే మోక్షమూ తప్ప - ఇలా భగవంతుడితో కేరితంలూ, ఆటపాటలూ, దాగుడుమూతలూ ఆడటం - ఆనందించడం కన్నె మనసులకే తెలుసు.

తీరబోయే కోరిక - ఆరబోయే హారతే -
తీరీ తీరని కోరికలే మేము కోరే వరాలు.

ఇందులో పాటలు - కన్నెపిల్లలు నోము పట్టడం. తెల్లవారు ఝామున లేచి ఇంటింటికీ వెళ్లి తలుపులు తట్టి, తోడి నేస్తాలను లేపడం. వాళ్లు చలికి భయపడి దొంగనిద్రలు నటించడం, గోదాదేవి వాళ్లను ఆటపట్టించి బయటకు రప్పించడం. అప్పుడు అందరూ యమునకు వెళ్లి, చలిలో జలకాలాడటం. అన్నీ ఎకసెక్కాలతో కేకలతో అల్లరీ చప్పట్లతో చాలా సరదాగా అట్లతద్ది ఆటల్లో కన్నెపిల్లల అల్లరి పాటల్లాగే ఉన్నాయి. వీటిలో గోదాదేవి నందరాజు లోగిలికి కావలివారినీ, గోకులాన్ని ఏలే నందరాజునూ, చివరికి లోకాలనేలే విష్ణుమూర్తినీ కూడా ఎగతాళి చేసి, వీథిలోకి రప్పించడం ఎంతో సరదాగా ముచ్చటగా ఉంటుంది. ఇదీ నిర్మలమైన భక్తి. కోరికలనే కోరని భక్తి. సిరిసంపదలుగాని స్వర్గంగాని చివరకు మోక్షంకూడా వద్దని కేవలం గోపాలదేవుని సఖ్యం కోరే భక్తి. అలాంటి వాటిలో వేదవేదాంతార్థాలు నిక్షిప్తమై ఉన్నాయని కొంతమంది పండితులు వ్యాఖ్యానాలు చేశారు. హాయిగా పాడుకునే పాటలను భట్టీయం వేయించారు. అశ్వమేధ యాగాది హోమాల పూజల వ్రతాల మంత్రాల్లాగా స్వరశుద్ధంగా చదవడం నేర్పడం చేశారు. మంత్రాలు వింటున్నప్పుడు–'మాంగల్యం తంతునా' అనే మంత్రాలను పలుకుతునప్పుడు– వాటిలోని అర్థాల కేసి దృష్టిపోదుకదా - అలాగే ఇవీని.

"ఏ వేదములు పఠించె లూత...." అన్నట్లుగా శ్రీకాళహస్తిలో పరమేశ్వరునికృపను పొందిన సాలెపురుగు, పాము, ఏనుగు, కన్నప్ప–ఎట్టి విద్యాగంధమూలేని జీవులు. కేవలం స్వచ్ఛమైన భక్తివారిది. ఆ భక్తే ముజ్జగాలనూ బొజ్జలో ఉంచుకున్న స్వామిని తులసీదళంతో తులతూచింది - అంతేగాని శ్యమంతకమణి కురి సిన సంపదలతో కాదు. శబరి ఎంగిలిపళ్లు, కుచేలుడి అటుకులూ, విదురుడి అరటి పండు తొక్కలూ అలాటివే. తిరుప్పావైలో ఆండాళ్ తల్లి పాటలూ, గోదాదేవి తన సిగలో ముడిచి స్వామికిచ్చిన హారమూ అలాటివే.





విశిష్ట ఫలదాయకం...

విష్ణు సహస్రనామ పారాయణం

- శ్రీ డి.వి.ఆర్.భాస్కర్, 99121 99394

మనం పూజించే ప్రతిదైవం, తలచే ప్రతినామం అన్నీకూడా సర్వదేవతల సమన్వయమే. ఈ జగత్సత్యం మన మనస్సులలో నాటుకునేందుకే విశ్వశాంతి కోరే మహర్షులు 'సహస్రనామాలు' చెప్పారు. మన ఇష్టదైవానికి సంబంధించిన నామాలను సాధ్యమైతే ప్రతినిత్యం లేదా సంవత్సరంలో ఆయా దేవతలకు సంబంధించినమాసంలో, లేదా వారంలో, ఆయా దేవతలకు ప్రీతిపాత్రమైనరోజున స్మరించడంవల్ల ఇష్టదైవంఅనుగ్రహం కలుగుతుందనడంతో సందేహం లేదు.

భగవంతుడు సాక్షాత్తూ విష్ణుస్వరూపుడు. కాబట్టి నదులన్నీ కలిసేది సముద్రంలోనే అన్నట్లుగా మనం ఏ దేవునికి నమస్కారం చేసినా అది ఆ శ్రీమన్నారాయణునికే చెందుతుందని పురాణాలు పేర్కొంటున్నాయి. మార్గశీర్ష మాసం విష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసం కాబట్టి ఈ మాసం రోజులూ విష్ణుసహస్రనామపారాయణం చేస్తే విశిష్ట ఫలితాలు కలుగుతాయి.

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అన్నాడు - శ్రీకృష్ణభగవానుడు. అంటే ధర్మం ఎక్కడుంటే అక్కడ తానుంటానన్నాడు కాబట్టి విష్ణువును స్థితికారుడనీ, సమస్త ప్రాణులనూ రక్షించే వాడనీ, ఉపనిషత్తులు పేర్కొంటున్నాయి. విష్ణువు అంటే విశ్వమంతా నిండిన వాడని అర్థం.

ఈ సృష్టిలో అత్యుత్తమములైనవిగా పేర్కొనగలిగినటువంటి జ్ఞానం, అమరత్వం, వాత్సల్యం, సౌశీల్యం మొదలైన సమస్తసద్గుణాలూ, నవరసభరితాలైన వస్తువాహనాభరణాలూ, రాజోపచారాలూ, దైవోపచారాలూ, సమస్తసదాచారాలకు ఆధారభూతమైన చిత్తవృత్తి వంటి నశించని సంపదలన్నింటికీ శ్రీహరే ఆధారభూతుడు. సమస్త దేవగణాదులలోనూ విష్ణువుకంటే మిన్న అనదగ్గవాడు ఏ విధంగా లేడో, అదేవిధంగా 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరి మంత్రంకంటె అధికమైంది లేదు. మంత్రపుష్పం అంతా విష్ణుమయమే! సర్వత్రా వ్యాపించి ఉన్న

ఆ విష్ణుభగవానుని విశేషాలు తెలిపేవే విష్ణుసహస్రనామాలు. ఈ నామాలన్నీ విశ్వవ్యాప్తమైన ఆయనశక్తినీ, అనంతమైన ఆయనలీలలనూ తెలియచేస్తూ, మనం ఏ రూపంలో భగవంతుడిని కొలిచినా దేవుడొక్కడే అనే భావనను కలుగచేస్తాయి.

'విశ్వం విష్ణు ర్వషట్కారో.....' అంటూ ఆరంభ మయ్యే విష్ణుసహస్రనామస్తోత్రపారాయణం విశేషమైన ఫలితాలు ఇస్తుందనడంలో సందేహం లేదు. లక్షలాదిమంది భక్తులను తనదివ్యబోధలద్వారా, మహిమలద్వారా ప్రభావితం చేసిన ఎందరో మహాత్ములు తమ భక్తులను విష్ణుసహస్రనామ పారాయణ చేయండని ఉపదేశించడం అందరికీ తెలిసిందే!

పురుష సూక్తం

పురుష సూక్తంలో ధ్రువుడు విష్ణుమూర్తిని 'సహస్ర శీర్షా పురుష స్సహస్రాక్ష స్సహస్రపాత్... మనోరథో నాథ సఫలస్స త్వయాకృతః, తపశ్చ తప్తం సఫలం యద్దృష్టోఽసి జగత్పతే' అని స్తుతించాడు. అంటే వేయి శిరస్సులు, వేయి కన్నులు, వేయి చేతులు, వేయి పాదాలు గలవాడివి, విశ్వవ్యాపివి, భూమ్యాకాశాలు కూడా నిండిపోయి, ఇంకా పదిఅంగుళాలపైన విస్తరించిన వాడివి, పుట్టనిది, పుట్టబోయేది – అవతారం దాల్చునున్నది నీవే కదా పురుషోత్తమా! అంతా నీ విరాట్ రూపం నుంచే, నీ తత్వం నుంచే ఏర్పడింది. వాసుదేవా! ఈ సర్వభూతాత్మక జగత్తు యావత్తూ నీరూపం ధరించిందే, ఋక్కులు, సామములు, ఛందో రీతులు ఉద్భవించింది నీ యందే! నిజానికి నీలో లేనివేవి? అన్నీ నీవే! అంతా నీవే! నీ నుంచి సర్వం, ఆ సర్వం నుంచి నీవు ఆవిర్భవించారు. సర్వాత్మకుడవైన నీకు ప్రణామాలు, సర్వజీవుల మనోరథము ఎరిగిన వాడవు.

నా కోరిక ఏదో, అది నీ వల్లనే సఫలం అయి తీరుతుంది. నా పూజలు ఫలించాలంటే నీ దర్శనభాగ్యం కావాలి' అని స్తోత్రం చేయడంతో మిక్కిలి సంతోషించిన శ్రీమహావిష్ణువు ధ్రువునికి నక్షత్ర మండలంలో శాశ్వత స్థానం కల్పించిన సంగతి తెలిసిందే! అందుకే 'అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్, లోకాధ్యక్షంస్తువన్నిత్యం సర్వ దుఃఖాతిగో భవేత్' అంటే 'ఆది మధ్యాంతాలు లేనివాడు, వికారరహితుడు, బ్రహ్మాదిదేవతలకు ప్రభువు, సర్వలోకాలకు నియామకుడు, సర్వవ్యాపకుడు అయిన శ్రీమహావిష్ణువును నిత్యం స్తోత్రం చేయడం వల్ల అన్ని దుఃఖాలను అవలీలగా దాట గలం. ఆధిదైవిక, ఆధి భౌతికమైన దుఃఖాలను అతి సులువుగా అధిగమించవచ్చు.

శుభఫలితాల సమాహారం


మహాభారతంలో అంపశయ్యపై శయనించి ఉన్న భీష్ముడు ధర్మరాజాదులకు బోధించిన దివ్యస్తుతులే విష్ణుసహస్రనామాలు. వీటిని అనునిత్యం స్మరించడంవల్ల అన్ని కష్టాలూ తీరిపోయి, సుఖసంపదలు కలుగుతాయని పురాణోక్తి.



కాబట్టి ఈ మాసంలో వీలున్న ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర కాని, ఆలయంలో కాని వ్యక్తిగతంగా లేదా సామూహికంగా విష్ణుసహస్రనామపారాయణ చేయడంవల్ల అన్ని దుఃఖాలు తొలగి, అమోఘమైన ఫలితాలు కలుగుతాయి. విష్ణువు ఎక్కడ ఉంటే – లక్ష్మి అక్కడ నివసిస్తుంది. ఆయన పరివారం సరేసరి! ఫలితంగా అనేకానేకశుభాలు చేకూరతాయి.

గోదాదేవి పాశురాలు - ఆళ్వార్ల సమన్వయాలు

- డా।। పరవస్తు కమల







గోదాదేవి 'తిరుప్పావై' అనే ద్రావిడప్రబంధం ద్రావిడ వేదంగా, ధ్వనికావ్యంగా ప్రఖ్యాతి పొందింది. రూపంలో చిన్నదైనా జ్ఞానంలో అనంతమైంది. మొత్తం తిరుప్పావై పాశురాలు, ఆచార్యులపరంగానూ, ఆళ్వారులపరంగానూ రెండోదశ పది రోజులూ ఆశ్రయణదశగా చెప్పబడుతూ, ఆళ్వారాచార్యుల పరంగా వ్యాఖ్యానాలు చేయబడి ఉన్నాయి. ఆళ్వారుల అంశలో శ్రీమన్నారాయణుని పంచాయుధాలు, స్వామిశరీరంపై నిరంతరం నిలిచి ఉండే ఇతరఅలంకరణలుగా ఆయా ఆళ్వారుల తిరునక్షత్రతనియన్లలో తెలుపబడుతున్నాయి.

ఆళ్వారుల కాలాన్నిబట్టి, ఆయాతత్త్వాలకు ఆయాపాశురాలపరంగా సమన్వయించడంలో కన్పించేతేడాకు ప్రాముఖ్యత ఎలా ఉన్నాకూడా - పదిమందిఆళ్వారుల అంశలకు తగిన సమన్వయాలే ప్రాముఖ్యతను వహించాయి.

శ్రీజగదాచార్య, వ్యాఖ్యానవాచస్పతులు అయిన ప్రతివాదిభయంకర అణ్ణంగరాచార్యస్వాములు 'తిరుప్పావై' గ్రంథానికి వ్రాసినవ్యాఖ్య ప్రసిద్ధి పొందింది. తమిళంలో సంప్రదాయానుసారంగా, స్పష్టంగా సాగిన ఈ వ్యాఖ్యానానికి శ్రీమాన్ నేలటూరి భక్తవత్సలం అయ్యంగారు ఆంధ్రీకరణకర్త. ఇది తిరుప్పావై పాశురాలలోని సంకేతపదాల ఆధారంగా, ఆళ్వారుల ద్రావిడప్రబంధాలగ్రంథాల పరంగా వ్యాఖ్యానించబడి ప్రామాణికమై ఉంది. వాటిస్వాపదేశార్థాలు క్లుప్తంగా ఇట్లా ఉన్నాయి.











6వ పాశురం

"పుళ్లుమ్" అనే పాశురంలో నిద్రలేపబడే ఆళ్వార్ 'ఆండాళ్' తండ్రియైన విష్ణుచిత్తుడు (పెరియాళ్వార్)గా చెప్ప బడుతున్నారు. 'పుళ్లరైయన్ కోయలిల్' అనే సంకేతపదం గరు డాంశసంభూతులై విష్ణుచిత్తులను సంకేతించడమేగాక 'ఉళ్లత్తు కొండువిత్తినై' అనే పాశురదళం పెరియాళ్వార్‌ను నిర్ధారించేవని చెప్పబడినవి.

7వ పాశురం

"కీశుకీన్టెంగు" అనేదానిలో కులశేఖరాళ్వార్‌ను నిద్రలేపు తున్నట్లు ఆయా సంకేతపదాలు పేర్కొనబడినాయి. 'నాయగప్పెణ్ పిళ్లాయ్' నాయకరత్నము అనే పదం ఆ ఆళ్వారుకు ప్రతీకగా చెప్పబడింది. 'నారాయణమూర్తి కేశవనై పాడవుమ్' అని పేర్కొని ఆండాళ్, ఆ ఆళ్వార్‌రచన 'మానినైవాయ్' లోని కేశిసంహార వృత్తాంతం ప్రశంసించినట్లుగా వ్యాఖ్యానించబడింది.

8వ పాశురం

'కీళ్వానమ్' అనే దానిలో 'నమ్మాళ్వార్' (శఠగోపుడు, పరాం కుశుడు) లేపబడుతున్నారు. 'కోదుకలముడైయ' పావాయ్ అనే పదాలు శ్రీకృష్ణుణ్ణి పొందాలనే (కృష్ణతృష్ణకు) ఆ ఆళ్వార్ తపనకు, పుట్టగానే ఇంద్రియసహజగుణాల్ని జయించిన ఆ ఆళ్వార్ పవిత్రతకు సంకేతాలుగా చెప్పబడ్డాయి. దేవాధిదేవనై, 'ఇమైయోర్ తలైవా' దేవతలకు అధిపతి, 'వాననాయకనే, అడి యేన్ తాళవన్దరుళే' తమసేవ నందుకొనుటకై భగవంతుణ్ణి రమ్మని పిల్చిన ఆళ్వార్ ఇతడని స్పష్టం చేస్తున్నవి.

9వ పాశురం

'తూమణి మాడత్తు' అనే దానిలో 'భక్తిసారులు' (తిరు మళిశై ఆళ్వార్) లేపబడుతున్నారు. 'మామాన్ మగళే', 'ధూపమ్ కమళ' అనే పదాలు భార్గవవంశస్థుడైన ఆళ్వార్‌ను, భార్గవియైన లక్ష్మిని (ఆండాళ్‌ను) తెలియజేస్తున్నాయి. జ్ఞానం, భక్తి (అను ష్ఠానం) గల ఆళ్వార్‌ను ధూపమ్, కమళ అని సంకేతించబడు తోంది.

'మందిర పట్టాళో' అని పేయాళ్వార్లవద్ద మంత్రోపదేశం చేసినట్లుగాను, 'మాయమెన్న మాయమే' అని వీరి ప్రబంధాల్లో అనుసంధించిన పదాలు సూచిస్తున్నాయి. 'ఊమైయో, అన్దిచ్చె విడో' అనే పదాలు, జ్ఞానంమాత్రముంటే కుంటివాడనీ, అను ష్ఠానంమాత్రమే ఉండి, జ్ఞానం లేకుంటే వారు గ్రుడ్డివారని సంకేతాలవల్ల చెప్పబడుతున్నది.

10వ పాశురం

